

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



గురువారం | 25-12-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 289 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, పుష్యమాసం, శుక్లపక్షం, తిథి: పంచమి మ.1.43 తదుపరి షష్ఠి, నక్షత్రం: ధనిష్ఠ ఉ.8.18 తదుపరి శతభిషం, వర్జ్యం: మ.3.42-5.21, దుర్ముహూర్తం: ఉ.10.25-11.09, మ.2.48-3.32, అమృతఘడియలు: రా.1.35-3.14, రాహుకాలం: మ.1.30-3.00, సూర్యోదయం: 6.46, సూర్యాస్తమయం: 5.44



‘అర్జున’కు గాయత్రి, ధనుష్

ఖేల్‌రత్నకు హార్దిక్ సింగ్
సిఫారసు చేసిన కమిటీ



న్యూఢిల్లీ : జాతీయ క్రీడా అవార్డులకు ఆటగాళ్ల పేర్లను ఎంపిక కమిటీ సిఫారసు చేసింది. బుధవారం విడుదలజేసిన ఆటగాళ్ల జాబితాలో బ్యాడ్మింటన్ డబుల్స్ క్రీడాకారిణి, జాతీయ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ తనయ గాయత్రి పేరును అర్జున పురస్కారానికి సిఫారసు చేసింది. గాయత్రి డబుల్స్ సహచరి ట్రీసా జాలీ (కేరళ) పేరునూ ఎంపిక చేసింది. అలాగే హైదరాబాద్‌కు చెందిన బధిర షూటర్ ధనుష్ శ్రీకాంత్ పేరును అర్జున అవార్డుకు ప్రతిపాదించింది. భారత ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షుడు గగన్ నారంగ్, బ్యాడ్మింటన్ మాజీ క్రీడాకారిణి అపర్ణా పొపట్, హాకీ మాజీ క్రీడాకారిణి ఎం ఎం సౌమ్యలతో కూడిన ఎంపిక కమిటీ..ప్రతిష్ఠాత్మక ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డుకు హాకీ జట్టు వైస్-కెప్టెన్ హార్దిక్ సింగ్ పేరును ప్రతిపాదించింది. మొత్తం 24 మంది క్రీడాకారులను అర్జున అవార్డుకు సిఫారసు చేసింది.

హంపి టైటిల్ నిలబెట్టుకునేనా?

● బరిలో హారిక, అర్జున్, గుకేష్, ప్రజ్ఞానంద
● నేటి నుంచి ఫిడే ప్రపంచ చాంపియన్‌షిప్

దోహా: గతేడాది మహిళల ర్యాపిడ్ ఈవెంట్‌లో విజేతగా నిలిచిన హంపి, గుకేష్ దొమ్మరాజు గురువారం నుంచి జరిగే ప్రతిష్ఠాత్మక ఫిడే ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ చాంపియన్‌షిప్ బరిలో దిగనున్నారు. భారత్ నుంచి అర్జున్ ఇరిగేసి, ప్రజ్ఞానంద, నిహాల్ సరీన్..విదేశీ స్టార్లలో మాగ్నస్ కార్ల్‌సన్, కరువానా, వెస్లీ సో, నెపోమ్నియాచి తలపడుతున్నారు. మహిళల్లో హారిక, దివ్యా దేశ్‌ముఖ్, వైశాలితో పాటు వెన్‌జున్, టింగ్జీ, గోర్యాచినా తదితరులు రంగంలో ఉన్నారు.

ఉన్నతి, తన్వి ముందంజ

● జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్

విజయవాడ సిటీ (ఆంధ్రజ్యోతి): వర్ధమాన షట్లర్లు ఉన్నతి హుడా, తన్వీ శర్మ, రౌనక్ చౌహాన్, సంస్కార్ సరస్వత్ జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ వ్యక్తిగత విభాగాల్లో ముందంజ వేశారు. టాప్‌సీడ్ ఉన్నతి 21-8, 21-8తో ఆకాంక్షపై, తన్వి 21-10, 21-14తో షైనా మణిముత్తుపై, ఆకర్షి కశ్యప్ 21-7, 21-9తో లక్ష్య రాజేశ్‌పై, అష్మిత చాలిహా 21-7, 21-11తో కావ్యపై, మేఘనా రెడ్డి 19-21, 21-17, 21-18తో బార్వేపై నెగ్గారు. పురుషుల సింగిల్స్‌లో సంస్కార్ 21-11, 21-13తో శిఖర్‌పై, చౌహాన్ 21-9, 21-13తో రణ్‌వీర్‌పై విజయాలు సాధించారు.

విజయ్ హజారే ట్రోఫీ ఆరంభం అదిరింది. రోహిత్, కోహ్లీతోపాటు పలువురు టీమిండియా బ్యాటర్లు ఆడుతుండడంతో ఫ్యాన్స్ స్టేడియాలకు క్యూ కట్టారు. అందుకు తగ్గట్టే రో-కో శతకాలతో అలరించగా.. సకీబల్ గని, ఇషాన్ కిషన్, వైభవ్ సూర్యవంశీ వేగవంతమైన సెంచరీలతో మెరుపులు మెరిపించారు. మొత్తంగా టోర్నీలో పరుగుల వరద పారింది. ఇక, బిహార్ భారీ స్కోరుతో ప్రపంచ రికార్డును బద్దలు కొట్టింది.

చెలరేగిన రోహిత్ (155)



జైపూర్: రోహిత్ శర్మ (94 బంతుల్లో 18 ఫోర్లు, 9 సిక్సర్లతో 155) దుమ్మురేపడంతో.. గ్రూప్-సి మ్యాచ్‌లో ముంబై 8 వికెట్లతో సిక్కింను చిత్తు చేసింది. తొలుత సిక్కిం 50 ఓవర్లలో 236/7 స్కోరు చేసింది. ఆశిష్ థాపా (79) హాఫ్ సెంచరీ చేశాడు. శార్దూల్ 2 వికెట్లు తీశాడు. ఛేదనలో ముంబై 30.3 ఓవర్లలో 237/2 స్కోరు చేసి గెలిచింది. ఓపెనర్‌గా బరిలోకి దిగిన రోహిత్.. ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఈ క్రమంలో 62 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకొన్నాడు. లిస్ట్-ఎలో తన వేగవంతమైన శతకాన్ని నమోదు చేశాడు. అయితే, రోహిత్‌ను క్రాంతి అవుట్ చేశాడు. రఘువంశీ (38)తోపాటు ముషీర్ ఖాన్ (27 నాటౌట్), సర్ఫరాజ్ (8 నాటౌట్) రాణించారు.

అలరించిన కోహ్లీ (131)



1 లిస్ట్-ఎ క్రికెట్‌లో ఇన్నింగ్స్ పరంగా వేగంగా 16 వేల పరుగుల మైలురాయిని చేరిన ఆటగాడిగా కోహ్లీ (330 ఇన్నింగ్స్).. సచిన్ టెండూల్కర్ (391 ఇన్నింగ్స్)ను వెనక్కినెట్టాడు.

బెంగళూరు: పదిహేనేళ్ల తర్వాత విజయ్ హజారే ట్రోఫీ బరిలోకి దిగిన విరాట్ కోహ్లీ (101 బంతుల్లో 14 ఫోర్లు, 3 సిక్సర్లతో 131) సెంచరీతో చెలరేగాడు. దీంతో గ్రూప్-డి మ్యాచ్‌లో ఢిల్లీ 4 వికెట్లతో ఆంధ్రపై గెలిచింది. తొలుత ఆంధ్ర 50 ఓవర్లలో 298/8 స్కోరు చేసింది. రికీ భుయ్ (122) సెంచరీ సాధించినా.. మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. సిమర్‌జీత్ సింగ్ 5 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో ఢిల్లీ 37.4 ఓవర్లలో 300/6 స్కోరు చేసి గెలిచింది. ఓపెనర్ అర్పిత్ రాణా (0)ను నితీశ్ డకౌట్ చేశాడు. దీంతో తొలి ఓవర్‌లోనే బ్యాటింగ్‌కు దిగిన కోహ్లీ.. మరో ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య (74)తో కలసి స్కోరు బోర్డును నడిపించాడు. కాగా, సెంచరీ పూర్తి చేసుకొన్న విరాట్‌ను సత్యనారాయణ రాజు అవుట్ చేశాడు. కెప్టెన్ రిషభ్ పంత్ (5) విఫలమైనా.. ఢిల్లీ అప్పటికే గెలుపునకు చేరువైంది.

అవుట్ చేయకుండా ఉండాల్సింది!

రాజుకు సందేశాల వెల్లువ

సెంచరీ అనంతరం సత్యనారాయణ రాజు బౌలింగ్‌లో కోహ్లీ క్యాచవుటయ్యాడు. కెరీర్‌లో రాజుకు ఇది చిరకాలం గుర్తిండి పోయేది. అయితే, కోహ్లీని అవుట్ చేయడంపై అతడి ఫ్యాన్స్ నిరాశను వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కోహ్లీని అవుట్ చేయకుండా ఉండాల్సిందంటూ రాజు ఇన్‌స్టాకు సందేశాల మీద సందేశాలు పంపారు. 'నాటౌట్‌గా ఉంచాల్సింది.. సోదరా' అని ఒకరు పోస్టు చేస్తే.. 'వాళ్లు వస్తూనే ఉంటారు. 131కే అవుట్ చేశావు. అయినా బాగా ఆడావు' అని మరొకరు రాశారు.

పోటెత్తిన అభిమానం



రోహిత్ ఆడుతుండడంతో స్టేడియంలో అభిమానుల సందడి నెలకొంది. మ్యాచ్ ఆరంభంకాక ముందే 8 వేల మంది వచ్చి కూర్చొన్నారు. క్రమంగా ఆ సంఖ్య పెరుగుతూ పోయింది. ఇక, సెంచరీ చేసిన తర్వాత దాదాపు 20 వేల మంది వచ్చినట్టు సమాచారం. మొత్తం మీద రోహిత్ హిట్టింగ్‌కు ఫ్యాన్స్ ఫిదా అయ్యారు.

బిహార్ 574/6

● పురుషుల లిస్ట్-ఎ క్రికెట్‌లో ప్రపంచ రికార్డు
● గని, వైభవ్ ఫాస్టెస్ట్ సెంచరీలు
● అరుణాచల్ చిత్తు
● విజయ్ హజారే ట్రోఫీ



సకీబల్ గని (40 బంతుల్లో 128 నాటౌట్)

1 పురుషుల లిస్ట్-ఎ క్రికెట్‌లో బిహార్ 574/6 అత్యధికం. 2023-24 సీజన్‌లో అరుణాచల్‌పై తమిళనాడు 506/2ను బిహార్ అధిగమించింది.



వైభవ్ సూర్యవంశీ (84 బంతుల్లో 190)

లిస్ట్-ఎ క్రికెట్‌లో సెంచరీ సాధించిన పిన్న వయస్కుడిగా వైభవ్ (14 ఏళ్ల 272 రోజులు)

రాంచీ: టీనేజ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ (84 బంతుల్లో 16 ఫోర్లు, 15 సిక్సర్లతో 190), కెప్టెన్ సకీబల్ గని (40 బంతుల్లో 10 ఫోర్లు, 12 సిక్సర్లతో 128 నాటౌట్) వేగవంతమైన శతకాలు నమోదు చేయడంతో.. విజయ్ హజారే ట్రోఫీలో బిహార్ ప్రపంచ రికార్డు స్కోరు నమోదు చేసింది. ప్లేట్ గ్రూప్‌లో బుధవారం అరుణాచల్ ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో తొలుత బిహార్ 4 వికెట్లకు 574 స్కోరు చేసింది. పురుషుల లిస్ట్-ఎ క్రికెట్‌లో ఇదే అత్యధికం. త్రుటిలో ద్విశతకం చేజార్చుకొన్న వైభవ్.. 36 బంతుల్లోనే సెంచరీ మార్క్ అందుకోగా.. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన గని కేవలం 32 బంతుల్లోనే వంద పరుగుల మార్క్ చేరుకొన్నాడు. ఈ క్రమంలో లిస్ట్-ఎ క్రికెట్‌లో అతి తక్కువ బంతుల్లో శతకం సాధించిన భారత బ్యాటర్‌గా సకీబల్ రికార్డులకెక్కాడు. కొండంత లక్ష్య ఛేదనలో అరుణాచల్ 42.1 ఓవర్లలో 177 పరుగులకే కుప్పకూలింది. దీంతో బిహార్ 397 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది.

ఇ‘షాన్‌దార్’



అహ్మదాబాద్: ఇషాన్ కిషన్ (39 బంతుల్లో 7 ఫోర్లు, 14 సిక్సర్లతో 125) లిస్ట్-ఎ క్రికెట్‌లో రెండో వేగవంతమైన సెంచరీ నమోదు చేసినా.. జార్ఖండ్ 5 వికెట్ల తేడాతో కర్ణాటక చేతిలో ఓడింది. తొలుత జార్ఖండ్ 412/9 స్కోరు చేసింది. ఛేదనలో కర్ణాటక 47.3 ఓవర్లలో 413/5 స్కోరు చేసి గెలిచింది. దేవ్‌దత్ పడిక్కల్ (147) శతకం బాదాడు.

లిస్ట్-ఎ క్రికెట్‌లో ఫాస్టెస్ట్ సెంచరీలు

మెక్‌గర్క్ (ఆస్ట్రేలియా)	29 బంతులు
ఏబీ డివిల్లీర్స్ (దక్షిణాఫ్రికా)	31 బంతులు
సకీబల్ గని (భారత్)	32 బంతులు

లిస్ట్-ఎ క్రికెట్‌లో భారత బ్యాటర్ల వేగవంతమైన శతకాలు

సకీబల్ గని	32 బంతులు	అరుణాచల్‌పై	డిసెంబరు 24, 2025
ఇషాన్ కిషన్	33 బంతులు	కర్ణాటకపై	డిసెంబరు 24, 2025
అన్‌మోల్ ప్రీత్	35 బంతులు	అరుణాచల్‌పై	డిసెంబరు 21, 2024
వైభవ్ సూర్యవంశీ	36 బంతులు	అరుణాచల్‌పై	డిసెంబరు 24, 2025
యూసుఫ్ పఠాన్	40 బంతులు	మహారాష్ట్రపై	ఫిబ్రవరి 16, 2010

నా ఆవేదనను అర్థం చేసుకోండి

యర్రాజి జ్యోతి



తొమ్మిదిసార్లు జాతీయ రికార్డులు తిరగరాసింది. 20కి పైగా అంతర్జాతీయ పతకాలు. దేశ ప్రతిష్ఠ కోసం పదేళ్లగా చెమటోడుస్తున్నా ఇప్పటికీ తగిన గుర్తింపు, ప్రోత్సాహం లభించకపోవడం ఆమె దురదృష్టం. ఏ భారతీయ క్రీడాకారిణి సాధించని రికార్డులు సొంతం చేసుకున్న విశాఖ ఎక్స్‌ప్రెస్ యర్రాజి జ్యోతి పడుతున్న ఆవేదన సోషల్ మీడియాలో ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. **దీనిపై ఆమె మాటల్లోనే తెలుసుకుందాం.**

పరిగెత్తేందుకు మంచి బూట్లు కూడా లేని స్థితి నుంచి మొదలెట్టి.. ఈ రోజు ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించే స్థాయికి చేరుకున్నా. అయినా ఇప్పటికీ సరైన గుర్తింపు దక్కకపోవడం బాధగా ఉంది. సెక్యూరిటీ గార్డుగా పనిచేసే మా నాన్నకి వచ్చే రూ.6 వేల జీతంతోనే కుటుంబం నడిచేది. ఎన్నో కష్టాల్ని అధిగమించి, బాధలు దిగమింగి పట్టుదలతో శ్రమిస్తున్నా. ఇన్ని పతకాలు సాధించిన నాకే సరైన గుర్తింపు, గౌరవం లేకపోతే పేద, మధ్య తరగతి కుటుంబాల నుంచి ప్రతిభావంతులైన చిన్నారులు.. క్రీడలను కెరీర్‌గా ఎలా ఎంచుకోగలుగుతారు? ప్రస్తుతం దక్షిణ మధ్య రైల్వే జూనియర్ క్లర్క్‌గా పని చేస్తున్నా. నా కంటే జూనియర్లకు కూడా నిబంధనలతో సంబంధం లేకుండా భారీ నజరానాలు, ప్రోత్సాహకాలు లభిస్తుంటే సంతోషంగా ఉంది. కానీ, నా దగ్గరికి వచ్చేసరికి ఎందుకు పాలసీలు, జీఓలు అడ్డు వస్తున్నాయో అర్థం కావడం లేదు. నా ఆవేదనను అర్థం చేసుకోండి. ఇప్పటికైనా నాకు సహకారం అందించాల్సిందిగా కోరుకుంటున్నా.

(ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి-హైదరాబాద్)

అన్ని విధాలా ప్రోత్సహిస్తాం

జ్యోతి మట్టిలో మాణిక్యం. గత వైసీపీ ప్రభుత్వంలో ఆమెకు పెండింగ్‌లో ఉన్న నగదు బకాయిలన్నింటిని సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం విడుదల చేసింది. ఆమెకు ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందించాలని చంద్రబాబు గతంలోనే ఆదేశించారు. కామన్వెల్త్ క్రీడలకు జ్యోతి సన్నద్ధమయ్యేందుకు ప్రభుత్వం తరపున అన్ని విధాలా సహకరిస్తాం.

- రవినాయుడు
(శాప్ చైర్మన్)

హైదరాబాద్ పరాజయం

రాజ్‌కోట్: విజయ్ హజారే ట్రోఫీని హైదరాబాద్ ఓటమితో ఆరంభించింది. గ్రూప్-బిలో బుధవారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 84 పరుగుల తేడాతో యూపీ చేతిలో ఓడింది. తొలుత యూపీ 50 ఓవర్లలో 324/5 స్కోరు చేసింది. అభిషేక్ గోస్వామి (81), ఆర్యన్ జుయాల్ (80), ధ్రువ్ జురెల్ (80) అర్ధ శతకాలు సాధించారు. అర్ఫాజ్ అహ్మద్ రెండు వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో హైదరాబాద్ 43 ఓవర్లలో 240 పరుగులకు ఆలౌటైంది. తన్మయ్ అగర్వాల్ (53), రాహుల్ బుద్ధి (47), వరుణ్ (45) కొంత మేర పోరాడారు. జీషన్ అన్సారీ నాలుగు వికెట్లు దక్కించుకొన్నాడు.



అత్యాధునిక ఫీచర్లతో ఆల్ న్యూ సెల్టోస్

కియా ఫ్యాక్టరీలో తొలి కారు విడుదల

పెనుకొండ రూరల్ (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలం యర్రమంచి సమీపంలోని కియా పరిశ్రమలో అత్యాధునిక ఫీచర్లతో సరి కొత్త కియా సెల్టోస్ కార్ల ఉత్పత్తి ప్రారంభమయింది. కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ గ్వాంగ్ లీ బుధవారం తొలి కారును ఆవిష్కరించారు. ఈ కారు జనవరి 2 నుంచి మార్కెట్‌లో అందుబాటులోకి రానున్నట్టు తెలిపారు. కారు ధర కూడా అదే రోజు వెల్లడించనున్నారు. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న కియా కారు కన్నా ఇది మరింత పెద్దదిగా, విశాలంగా ఉంటుందని ఆయన అన్నారు. అలాగే మరింత మెరుగైన భద్రతా ప్రమాణాలు, మరిన్ని డిజిటల్ ఫీచర్లు ఈ కారు ప్రత్యేకతలు. ఎస్‌యూవీల్లో పొడవైన కారుగా ఇది నిలుస్తుందని, గత వెర్షన్లతో పోల్చితే ఎత్తు, పొడవు, వెడల్పు అన్నీ పెరగడంతో పాటు క్యాబిన్ స్పేస్ పెరిగి వెనుక సీట్లలో ప్రయాణికులకు మరింత సౌకర్యవంతంగా ఉంటుందన్నారు.

వేగవంతమైన చెక్ క్లియరెన్స్ రెండో దశ వాయిదా

ముంబై: వచ్చే నెల 3వ తేదీ నుంచి అమలుచేయాల్సిన వేగవంతమైన చెక్ క్లియరెన్స్ రెండో దశను ఆర్‌బీఐ వాయిదా వేసింది. ఈ విధానం కింద తమకు ఇమేజి రూపంలో అందిన చెక్‌లను బ్యాంకులు మూడు గంటల్లోగా క్లియర్ చేయాలి లేదా కారణం చెప్పి తిరస్కరించాలి. కంటిన్యూయస్ క్లియరింగ్ అండ్ సెటిల్‌మెంట్ (సీసీఎస్) పేరుతో వచ్చే నెల 3వ తేదీ నుంచి ఆర్‌బీఐ ఈ విధానం అమలు చేయాలని భావించింది. కాని అనివార్య పరిస్థితుల్లో తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు ఈ విధానం అమలును వాయిదా వేస్తున్నట్టు ఆర్‌బీఐ తెలిపింది. ఏ కారణం చేత ఈ నిర్ణయం తీసుకుందీ వెల్లడించలేదు. ఫేజ్ 1 కింద అమలు చేస్తున్న చెక్కుల ప్రాసెసింగ్ సమయాన్ని కూడా ఆర్‌బీఐ సవరించింది. బ్యాంకులు ఇక క్లియరెన్స్ కోసం పంపే చెక్‌లను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల్లోపే సమర్పించాలి. చెక్ ఇమేజి, ఎంఐసీఆర్ వివరాల ఆధారంగా ఆ చెక్ క్లియరెన్స్‌ను ఆమోదిస్తోందీ, లేనిదీ బ్యాంకులు ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఏడు గంటల లోపు ఎలక్ట్రానిక్ పద్దతిలో తెలియజేస్తాయి. లేకపోతే ఆ చెక్ క్లియరెన్స్‌కు ఆమోదం లభించినట్టు భావిస్తారు.

ఎల్‌వీఎం 3 ఎం6కి అనంత్ టెక్నాలజీస్ పరికరాలు

హైదరాబాద్: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) విజయవంతంగా ప్రయోగించిన ఎల్‌వీఎం3 ఎం6 రాకెట్‌కు అవసరం అయిన హార్డ్‌వేర్, ఏవియానిక్స్ సిస్టమ్స్, ఎలక్ట్రానిక్స్, ప్రెసిషన్ సబ్ సిస్టమ్స్ హైదరాబాద్‌కు చెందిన అనంత్ టెక్నాలజీస్ (ఏటీఎల్) సరఫరా చేసింది. ఆత్మనిర్భర్ భారత విజన్‌కు అనుగుణంగా ఈ వ్యవస్థలన్నింటినీ ఏటీఎల్ అత్యాధునిక కేంద్రంలో తయారుచేసినట్టు కంపెనీ చైర్మన్ డాక్టర్ సుబ్బారావు పావులూరి చెప్పారు. ఈ విజయం ఇస్రో చరిత్రలో ఒక కీలకమైన మైలురాయి అని, అందులో తాము కూడా భాగస్వాములు కావడం ఆనందంగా ఉన్నదని అన్నారు.

వికాస్ ఇంజన్లు సరఫరా చేసిన ఎంటార్

ఎల్‌వీఎం3-ఎం6కు అవసరం అయిన వికాస్ ఇంజన్లు, క్రయోజెనిక్ ఎగువ స్టేజ్ అసెంబ్లీలు, కీలకమైన పలు ఇతర భాగాలు తాము సరఫరా చేసినట్టు హైదరాబాద్‌కు చెందిన ఎంటార్ టెక్నాలజీస్ తెలిపింది. రాబోయే కాలంలో భారత అంతరిక్ష పరిశ్రమ ప్రపంచ స్థాయిలో కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నామని, ఆ ప్రయత్నంలో ఇస్రోకు తమ మద్దతు కొనసాగించేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నామని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ పర్వత్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్‌లోకి సునీల్ మిట్టల్



భారతీ ఎంటర్‌ప్రైజెస్, వార్‌బర్గ్ పింకస్‌కు హాయర్ ఇండియాలో 49 శాతం వాటా

● డీల్ విలువ సుమారు రూ.7,500 కోట్లు!?

న్యూఢిల్లీ: ప్రముఖ పారిశ్రామికవేత్త సునీల్ మిట్టల్‌కు చెందిన భారతీ ఎంటర్‌ప్రైజెస్ కొత్త రంగంలోకి ప్రవేశించింది. ఇప్పటికే టెలికాం, బీమా, రియల్టీ, ఆతిథ్య వ్యాపారాలను నిర్వహిస్తున్న ఈ హోల్డింగ్ కంపెనీ.. వేగంగా వృద్ధి చెందుతున్న కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ విక్రయ మార్కెట్లోకి అడుగు పెట్టింది. ఇందుకోసం చైనాకు చెందిన కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం హాయర్ గ్రూప్ భారత అనుబంధ విభాగమైన హాయర్ ఇండియాలో వ్యూహాత్మక వాటా కొనుగోలు చేసింది. అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం వార్‌బర్గ్ పింకస్, భారతీ ఎంటర్‌ప్రైజెస్ కలిసి హైయర్ ఇండియాలో మొత్తం 49% వాటాను దక్కించుకున్నాయి. ఒప్పందం విలువను మాత్రం వెల్లడించలేదు. ఇండస్ట్రీ వర్గాల ప్రకారం.. హాయర్ ఇండియా మార్కెట్ విలువ రూ.15,000 కోట్ల స్థాయిలో ఉంటుందని అంచనా. ఈ లెక్కన, 49 శాతం వాటా కొనుగోలు కోసం సుమారు రూ.7,500 కోట్ల వరకు వెచ్చించి ఉండవచ్చు. ఈ లావాదేవీ పూర్తయ్యాక, హాయర్ ఇండియాలో భారతీ ఎంటర్‌ప్రైజెస్, వార్‌బర్గ్ పింకస్ సంయుక్తంగా 49% వాటాను, చైనాకు చెందిన హాయర్ గ్రూప్ మరో 49% వాటా కలిగి ఉండనున్నాయి. మిగతా 2 శాతం వాటా సంస్థ ఉద్యోగుల చేతుల్లో ఉంది. ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం భారత్‌లో హాయర్ వృద్ధి, విస్తరణను మరింత వేగవంతం చేయనుందని.. కంపెనీ ఆవిష్కరణలు, భారతీ బలమైన నెట్‌వర్క్, బ్రాండ్ల వ్యాప్తిలో వార్‌బర్గ్ పింకస్ ట్రాక్ రికార్డు ఇందుకు దోహదపడగలవని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో భారతీ ఎంటర్‌ప్రైజెస్ పేర్కొంది. కాగా, తాజా పెట్టుబడులు మార్కెట్లో హాయర్ ఇండియా పోటీ సామర్థ్యాన్ని మరింత పెంచగలవని హాయర్ గ్రూప్ అంటోంది.

2004లో భారత్‌లోకి ప్రవేశం

హాయర్ గ్రూప్ 2004లో భారత్‌లోకి ప్రవేశించింది. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 6,500 విక్రయ కేంద్రాలతో కూడిన డీలర్ నెట్‌వర్క్‌ను కలిగి ఉంది. ఈ సంస్థ టెలివిజన్లు, ఎయిర్ కండీషనర్లు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, ఎల్ఈడీ ప్యానెళ్లు, వాటర్ హీటర్లు, మైక్రోవేవ్ ఓవెన్లు తదితర ఉత్పత్తులను విక్రయిస్తోంది. గడిచిన ఏడేళ్లలో కంపెనీ వ్యాపారం సుమారు 25% చొప్పున వృద్ధి చెందుతూ వచ్చింది.

సబ్బుల్లో నంబర్ 1 బ్రాండ్‌గా సంతూర్



బెంగళూరు (ఆంధ్రజ్యోతి): నాలుగు దశాబ్దాలుగా మార్కెట్లో తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శిస్తున్న సంతూర్ సోప్ దేశంలో సబ్బుల విక్రయాల్లో నంబర్ 1 బ్రాండ్‌గా నిలిచిందని విప్రో కన్స్యూమర్ కేర్ ఒక ప్రకటనలో తెలిపింది. రూ.2850 కోట్ల అమ్మకాలతో వ్యక్తిగత పరిశుభ్రత విభాగంలో ఇది అగ్రస్థానంలో నిలిచినట్టు కంపెనీ సీఈఓ వినీత్ అగర్వాల్ తెలిపారు. పంపిణీదారులు, ఇతర భాగస్వాములు అందించిన సహకారమే ఈ విజయానికి కారణమని పేర్కొన్నారు.

నీహార్ ఇన్ఫో గ్లోబల్ విస్తరణ

హైదరాబాద్: నీహార్ ఇన్ఫో గ్లోబల్ కంపెనీ అమెజాన్ ఐఎక్స్‌డీ కార్యక్రమం ద్వారా దేశవ్యాప్త ఫుల్‌ఫిల్‌మెంట్ సామర్థ్యాలను విస్తరించింది. తమ లాజిస్టిక్స్, సరఫరా వ్యవస్థ విస్తరణలో ఇది ఒక కీలక మైలురాయి అని కంపెనీ తెలిపింది. దీని వల్ల దేశవ్యాప్తంగా తమ ఇ-కామర్స్ సామర్థ్యాలు పెరుగుతాయని వెల్లడించింది.

ఆఫీస్ స్పేస్ లీజింగ్ 6% అప్

న్యూఢిల్లీ: ఈ ఏడాది హైదరాబాద్ సహా దేశంలోని 7 ప్రధాన నగరాల్లో కార్యాలయ స్థలాల (ఆఫీస్ స్పేస్) లీజింగ్ వార్షిక ప్రాతిపదికన 6% పెరిగి 7.15 కోట్ల చదరపు అడుగులకు చేరుకుందని రియల్ ఎస్టేట్ కన్సల్టింగ్ కంపెనీ కోలియర్ వెల్లడించింది. దేశీ, విదేశీ కార్పొరేట్ కంపెనీల నుంచి కార్యాలయ స్థలానికి గిరాకీ గణనీయంగా పెరగడం ఇందుకు దోహదపడిందని బుధవారం విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. వచ్చే ఏడాదీ ఆఫీస్ స్పేస్‌కు బలమైన డిమాండ్ కన్పించనుందని, టెక్నాలజీ, బీఎఫ్ఎస్ఐ (బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్) రంగాల వృద్ధి ఇందుకు చోదకంగా పనిచేయవచ్చని అంటోంది. నగరాలవారీగా చూస్తే, ఈ ఏడాది ముంబై, హైదరాబాద్‌లో మాత్రం ఆఫీస్ స్పేస్‌కు గిరాకీ తగ్గిందని.. మిగతా ఐదు నగరాల్లో (చెన్నై, బెంగళూరు, పుణె, కోల్‌కతా, ఢిల్లీ-ఎన్‌సీఆర్) పెరిగిందని ఆ రిపోర్టులో ప్రస్తావించింది.

ఏపీలోనూ బొగ్గు తవ్వకాలు

● బిడ్స్ దాఖలు చేసిన రిలయన్స్-యాక్సిస్ ఎనర్జీ

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ కూడా దేశ బొగ్గు ఉత్పత్తి మ్యాప్‌లో చేరనుంది. ఏలూరు జిల్లా చింతలపూడి మండలం రేచర్ల బ్లాకులో త్వరలో బొగ్గు తవ్వకాలు ప్రారంభం కానున్నాయి. ఈ బ్లాకులో బొగ్గు తవ్వకాలు, గ్యాసిఫికేషన్‌కు రిలయన్స్ ఇండస్ట్రీస్, హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్ ఇండియా బిడ్స్ సమర్పించాయి. దేశవ్యాప్తంగా మొత్తం 41 బ్లాకుల్లో బొగ్గు ఉత్పత్తి లేదా గ్యాసిఫికేషన్ కోసం కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది అక్టోబరులో బిడ్స్ ఆహ్వానించింది. ఇందులో 17 బ్లాకుల కోసం ఈ రెండు కంపెనీలు సంయుక్తంగా బిడ్స్ చేశాయి.

ఏపీ బ్లాకు ప్రత్యేకత : ఏలూరు జిల్లా చింతలపూడి మండలంలోని రేచర్ల బ్లాకులో దాదాపు 200 కోట్ల టన్నుల నుంచి 300 కోట్ల టన్నుల అత్యంత నాణ్యమైన గ్రేడ్-1 బొగ్గు నిక్షేపాలున్నట్టు అంచనా. ఈ నిక్షేపాలతో 60 సంవత్సరాల పాటు ఏటా 8,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చు.

రెండో రోజూ నష్టాలే

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ వరుసగా రెండో రోజూ నష్టాలతో ముగిసింది. సెన్సెక్స్ 116.14 పాయింట్ల నష్టంతో 85,408.70 పాయింట్ల వద్ద ముగియగా, నిఫ్టీ 35.05 పాయింట్ల నష్టంతో 26,142.10 వద్ద ముగిసింది. ఈ వారం ట్రేడింగ్ నాలుగు రోజులే ఉండడం, సంవత్సరాంతపు సెలవులతో ట్రేడింగ్ పరిమాణం కూడా బాగా తగ్గింది. ప్రతికూల అంతర్జాతీయ సంకేతాలు, ఎఫ్‌పీఐల అమ్మకాలు కూడా బుధవారం సూచీలను కిందికి లాగాయి. ఈ నెలాఖరు వరకు ట్రేడింగ్ ఇలానే ఉంటుందని భావిస్తున్నారు. రిలయన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, సన్ ఫార్మా, ఇండిగో షేర్లలో అమ్మకాల ఒత్తిడి ఎక్కువగా కనిపించింది.

● అమెరికన్ డాలర్ మారకంలో రూపాయి 8 పైసలు దిగజారి 89.71 వద్ద ముగిసింది.

నేడు సెలవు: క్రిస్మస్ పర్వదినం సందర్భంగా మార్కెట్లకు నేడు సెలవు. ఈక్విటీ, ఫారెక్స్, కమోడిటీ మార్కెట్లు పని చేయవు.

బిజినెస్

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,38,930 ▲	1,27,350 ▲	2,44,000 ▲
విజయవాడ	1,42,000 ▲	1,32,000 ▲	2,24,000 ▲
విశాఖపట్నం	1,41,100 ▲	1,27,350 ▼	2,44,000 ▲
రాజమండ్రి	1,38,930 ▲	1,27,350 ▲	2,22,000 ▲
ప్రొద్దుటూరు	1,40,500 ▲	1,29,260 ▲	2,24,000 ▲
ముంబై	1,36,630 ▲	1,25,150 ▲	2,18,980 ▲

ఎస్ఎఫ్ఐఓ చేతికి ఇండస్ ఇండ్ బ్యాంకు కేసు

న్యూఢిల్లీ: ఇండస్‌ఇండ్ బ్యాంకు డెరివేటివ్స్ పెట్టుబడి ఖాతాల లెక్కల మోసాల నిగ్గు తేల్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకోసం ఈ కేసు దర్యాప్తును కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన తీవ్ర ఆర్థిక నేరాల దర్యాప్తు సంస్థ ఎస్ఎఫ్ఐఓకు అప్పగించింది. బ్యాంకు ఉన్నతాధికారుల ప్రమేయంతో జరిగిన ఈ మోసంతో బ్యాంకు దాదాపు రూ.1,960 కోట్లు నష్ట పోయింది. దాంతో బ్యాంకు నికర ఆస్తుల విలువ 2.35% వరకు తుడిచి పెట్టుకు పోయింది. ఎస్ఎఫ్ఐఓ రంగంలోకి దిగడంతో వీరి బాగోతం పూర్తిగా బయట పడుతుందని భావిస్తున్నారు.

అపోలో పునర్వ్యవస్థీకరణకు గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్: అపోలో హాస్పిటల్స్ వ్యాపార పునర్నిర్మాణానికి బీఎస్ఈ, ఎన్ఎస్ఈ బుధవారం నో అబ్జెక్షన్ జారీ చేశాయి. అపోలో హాస్పిటల్స్ సమర్పించిన ముసాయిదా పథకం, ఇతర పత్రాల విషయంలో సెబీ నిబంధన 37 (ఎల్ఓడీఆర్), 2015 కింద "నో అబ్జెక్షన్" జారీ చేసినట్టు ఎక్స్ఛేంజిలు తెలిపాయి. అపోలో సంస్థ దీని ప్రకారం ఇప్పుడు ఎన్‌సీఎల్‌టీకి ముసాయిదా పథకాన్ని పంపించుకోవచ్చునని ఎన్ఎస్ఈ ఆ లేఖలో తెలియచేసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

25వ తేదీ			
హైదరాబాద్	675	విజయవాడ	720
వరంగల్	677	గోదావరి	695
చిత్తూరు	703	విశాఖపట్నం	702
		డజను గుడ్లు రూ. 96	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	142	విజయవాడ	135
వరంగల్	142	గుంటూరు	140
కరీంనగర్	142	ఒంగోలు	140
మహబూబ్‌నగర్	142	చిత్తూరు	142
కర్నూలు	142	నెల్లూరు	147
విశాఖపట్నం	126	అనంతపురం	147
గోదావరి	135		

www.andhrajyothy.com
గుంటూరు సిటీ
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
గురువారం | 25-12-2025
Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

నేడు క్రిస్మస్

వేడుకలకు ముస్తాబైన చర్చిలు



క్రిస్మస్ సందర్భంగా విద్యుత్ వెలుగుల్లో విజయవాడలోని సెయింట్ పాల్ బాసిలికా చర్చి

రెవెన్యూ ప్రక్షాళన!

ప్రజల్లో అసంతృప్తి తొలగింపే లక్ష్యంగా రోడ్‌మ్యాప్

సీఎం ఆదేశాలతో కీలక భేటీ

భూముల సర్వే, మ్యుటేషన్, పాస్‌పుస్తకాలు, 22ఏపై చర్చ

జేసీ నుంచి కొన్ని కీలక అధికారాలు ఆర్డీవోకు బదలాయింపు

మరికొన్ని అధికారాలు తహశీల్దార్‌కు

22ఏ నుంచి పట్టా భూముల తొలగింపు

ప్రజల ఇంటి స్థలాలకూ నిషేధ విముక్తి

జాయింట్ ఎల్‌పీఎమ్‌లు, విస్తీర్ణంలో తేడాలకు నిర్దిష్ట గడువులో పరిష్కారం

సమావేశంలో కీలక నిర్ణయాలు!



స్వర్ణాంధ్ర-2047పై సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు, అధికారులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రెవెన్యూ శాఖపై ప్రజల్లో సంతృప్త స్థాయిని 80 శాతానికి ఎలా తీసుకురావాలి? వారి పిటిషన్ల పరిష్కారంలో జాప్యాన్ని నివారించాలంటే తక్షణ చర్యలు ఏంతీసుకోవాలి? పారదర్శకత కోసం, అవినీతిరహిత సేవలు అందించడానికి చేపట్టాల్సిన మౌలిక చర్యలు ఏమిటి.. ఈ శాఖపై ఉన్న చెడు ముద్ర తొలగించి.. ఫీల్ గుడ్‌లోకి తీసుకొచ్చేందుకు ఏ సంస్కరణలు తీసుకురావాలన్న అంశాలపై ప్రభుత్వం సమాలోచనలు మొదలుపెట్టింది. బుధవారం రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన కీలక సమావేశం జరిగింది. రెవెన్యూ ప్రక్షాళనకు అవసరమైన రోడ్‌మ్యాప్ సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. ఆ శాఖ స్పెషల్ సీఎస్ సాయిప్రసాద్ దీనిపై నివేదిక రూపొందించనున్నారు. దీనికి సంబంధించిన

మిగతా 10వ పేజీలో...

పదవుల బొనాంజా!

టీడీపీలో 1,050 మంది నేతలకు పోస్టులు

ఒక్కో పార్లమెంటరీ కమిటీలో 40 మంది

మహిళలకు 28 శాతం

11

ఇంజనీరింగ్ ఫీజుల్లో మార్పులు

హైకోర్టు తుది తీర్పు ఆధారంగా జీవో

కనిష్ఠం రూ.40 వేలు.. గరిష్ఠం రూ.1.05 లక్షలు

11

విశాఖలో అమెజాన్ విస్తరణ

ఇప్పటికే ఈ-కామర్స్ డెవలప్‌మెంట్ సెంటర్

దానిని విస్తరించనున్నట్టు ఎస్‌టీపీఐకి వెల్లడి

ఐటీపై ప్రధాన దృష్టి!

11



'ఆతిథ్యం' ఇవ్వనున్న రుషికొండ!

ప్యాలెస్‌పై రెండు ఫ్లోర్లు వేసి హోటళ్లకు కేటాయింపు?

సబ్ కమిటీలో ప్రతిపాదన.. మరికొన్ని ప్రత్యామ్నాయాలపైనా దృష్టి

ప్రభుత్వంపై భారం పడరాదన్నదే లక్ష్యం.. ప్రజా ప్రయోజనాలే పరమావధి

ఆదాయమూ వచ్చేలా త్వరలోనే నిర్ణయం.. పయ్యావుల, దుర్గేశ్ వెల్లడి

10

బిడ్ వేసిన సంస్థతో ఒప్పందం

ఆదోని మెడికల్ కాలేజీ నిర్మాణానికి ముందుకొచ్చిన 'కిమ్స్'కు ఆమోదం

మిగిలిన బిడ్డర్లతోనూ సంప్రదింపులు.. వైద్య విద్య నాణ్యతలో రాజీ లేదు

పీపీపీలో పేదలకు నాణ్యమైన వైద్యం.. జిల్లా మొత్తం 'కుప్పం సంజీవని'

10

ఆ మండలాలు నెల్లూరులోనే?

ప్రజల అభ్యంతరాలతో రెవెన్యూ శాఖ నిర్ణయం!

మూడు కొత్త జిల్లాలకు జనం ఓకే.. 500కి పైగా సలహాలు

వేగంగా మెరుగైన సేవలు.. స్వర్ణాంధ్ర-2047పై సీఎం సమీక్ష

11

ఇస్రో 'బాహుబలి'



శ్రీహరికోటలో సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి నింగిలోకి దూసుకెళ్తున్న ఎల్‌వీఎం3-ఎం6 రాకెట్

గ్రాండ్ సక్సెస్!

నిప్పులు చిమ్ముతూ ఎల్‌వీఎం3-ఎం6 నింగికి

భారత అంతరిక్ష రంగ చరిత్రలో తొలిసారి 6 వేల కిలోల అతి భారీ శాటిలైట్ ప్రయోగం

అమెరికా 'బ్లూబర్డ్ బ్లాక్-2' దిగ్విజయంగా కక్ష్యలోకి

ప్రపంచ సమాచార వ్యవస్థలో పెను విప్లవం

9

కాస్మెటిక్స్ కాంట్రాక్టులో కిరికిరి

అర్హత లేని సంస్థకు రూ.17 కోట్ల టెండరు

వైసీపీ కీలక నేత మిత్రుడి సంస్థకు లబ్ధి.. హాస్టళ్లకు కాస్మెటిక్స్ సరఫరాకు టెండర్లు

అనుభవ పరీక్షలో నిలవని 'విక్టరీ బజార్'.. ఇతర అర్హతల్లోనూ వెనుకబడిన వైనం

అయినా, విజేతగా ప్రకటించిన అధికారులు.. సీఎంకు ఫిర్యాదులు.. పేషీకి ఆదేశాలు!

11

పోలవరం.. 2027 జూన్‌కల్లా పూర్తికావాలి

పీపీపీ సీఈవో యోగేశ్ నిర్దేశం.. ఢిల్లీ వచ్చిన ప్రతిసారీ సీఎం ఇదే స్పష్టంచేస్తున్నారు

త్వరగా పూర్తిచేయాలన్నదే కేంద్రం ఉద్దేశం కూడా.. బాధ్యతలు చేపట్టాక తొలిసారి ప్రాజెక్టు వద్దకు

మొదట పునరావాస గ్రామాల్లో పర్యటన.. మౌలిక వసతులు, పరిహారంపై ఆరా

తర్వాత ప్రాజెక్టు క్షేత్ర ప్రాంతానికి సీఈవో.. బట్రస్, డయాఫ్రం వాల్ పనులపై సంతృప్తి

7

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ముంబై 'మనోమిలన్'

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీ చేతులు కలిపినంతగా, ఆలింగనాలు చేసుకున్నంతగా ప్రచారం చేస్తున్నారేమిటి? అని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మీడియాను అడుగుతున్నారు. 20ఏళ్ళ తరువాత ఉద్ధవ్ థాక్రే, రాజ్‌థాక్రేలు చేయీచేయీ కలిపి, ఒకేవేదికమీదకు వచ్చిన సందర్భంపై వ్యాఖ్యానించమన్నందుకు ఫడ్నవీస్ ఈ ఎదురు ప్రశ్న వేశారు. గుర్తింపు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న థాక్రే సోదరులు ఎన్ని విన్యాసాలు చేసినా ఫలితం ఉండదని, ప్రజలు మరిచిపోయిన వారి పార్టీలు ఒక్కటైనా ఉపయోగం లేదని ఫడ్నవీస్ తేల్చేశారు.

బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కలిసి పనిచేయబోతున్నట్టుగా ఉద్ధవ్ నాయకత్వంలోని యూబిటి, రాజ్‌థాక్రేకు చెందిన మహారాష్ట్ర నవనిర్మాణ్‌సేన (ఎంఎన్ఎస్) బుధవారం ప్రకటించాయి. బాల్‌థాక్రే భారీ చిత్రం వెనుక ఉండగా, వేదికమీద సోదరులిద్దరూ ఉన్న ఆ దృశ్యం అభిమానులకు చూడముచ్చటగా ఉంది. బీఎంసి ఎన్నికలవరకే ఈ సోదరప్రేమ కొనసాగుతుందని జనం ఎక్కడ అనుకుంటారోనన్న అనుమానం ఉన్నదేమో, ఈ కలయిక ఎప్పటికీ కలిసివుండటానికేనని ఒకటికి రెండుసార్లు స్పష్టం చేశారు ఉద్ధవ్. బీజేపీమీద కోపం ఉన్న వాళ్ళంతా యూబీటీ–ఎంఎన్ఎస్ కూటమిలో చేరవచ్చునని కూడా పిలుపునిచ్చారు. మీడియా సమావేశానికి ముందు సోదరులు ఇద్దరూ బాలాసాహెబ్ సమాధిని సందర్శించి నివాళులు అర్పించారు. మరాఠీ ఓటుబ్యాంకును సుస్థిరం చేసుకొని, అస్మితను జనంలో ఆవహింపచేసి, అధికారంలో ఉన్న 'మహాయుతి' కూటమిని సవాలు చేయడానికి ఈ ఏకీకరణ ఉపకరిస్తుందని అభిమానులు అంటున్నారు. మాటకారి సంజయ్ రౌత్ దీనిని 'మనోమిలన్' (మనసుల కలయిక)గా అభివర్ణిస్తున్నారు. ఉద్ధవ్‌ను తన రాజకీయవారసుడుగా ప్రకటించినందుకు అలిగి, ఆగ్రహించిన రాజ్‌థాక్రే పెద్దాయన జీవించి ఉండగానే వేరుకుంపటి పెట్టుకున్నాడు. ఉద్ధవ్‌కు ఉన్న నిలకడతనం, నిబద్ధత రాజ్‌కు లేవని, మాట, మనసు మారిపోతూంటాయని, అందుకే బాలాసాహెబ్ అతడిని పక్కనపెట్టారని అంటారు. జూలైలో వీరిద్దరూ హిందీని వ్యతిరేకిస్తూ ఒకే వేదిక మీదకు వచ్చినప్పుడు ప్రజల్లో సానుకూల స్పందన కనిపించడంతో, చర్చోపచర్చల అనంతరం ఇలా ఒక్కటి కావడం సాధ్యపడింది. కీలకమైన సీట్ల పంపకం అంశం ఇంకా తేలాల్సివున్నప్పటికీ, బీజేపీ–శిండేశివసేన–అజిత్‌పవార్ ఎన్సీపీ కలగలసిన మహాయుతికి వీరు సవాలు విసరగలరని అభిమానుల నమ్మకం. పుట్టినిల్లు ముంబైని దీర్ఘకాలం శాసించి, ఏలిన శివసేన క్రమంగా చీలి, చితికిన నేపథ్యంలో ఇప్పుడు మళ్ళీ అక్కడ తన ఉనికిని చాటుకోవడానికి ఇలా తాపత్రయపడుతోంది.

పదేళ్ళ విరామం తరువాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో అధికార మహాయుతి ఇటీవల ఘనవిజయం సాధించిన నేపథ్యంలో, థాక్రేల కలయిక మరింత అవసరపడింది. 288మునిసిపల్ కౌన్సిళ్ళలో మహాయుతి 207 గెలుచుకుంటే, విపక్ష మహావికాస్ అగాడీకి 44 దక్కాయి. బీజేపీ 117, శిండే శివసేన 53, అజిత్‌పవార్ ఎన్సీపీ 37 మున్సిపల్ అధ్యక్ష పదవులు దక్కించుకున్నాయి. మహాయుతిని గెలిపించిందుకు అభినందనలంటూ రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కాంగ్రెస్, యూబీటీ విమర్శించినప్పటికీ, అసలు పార్టీలకంటే చీలికపక్షాలకు ప్రజామోదం అధికంగా ఉన్నదని ఈ ఫలితాలు నిర్ధారించాయి. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు మరోమారు ఇలా కిందిస్థాయిలో ప్రతిఫలించిన నేపథ్యంలో, జనం ఉద్ధవ్, శరద్‌పవార్ పక్షాన లేరనీ, తమనే ఆదరిస్తున్నారని ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్ మరింత గర్వంగా చెప్పుకోవచ్చు. సంస్థాగతంగా వీరు మరింత బలపడ్డారనడానికి కూడా ఈ ఫలితాలు నిదర్శనం. నేనే అసలు శివసేన అన్న షిండే వాదనను వివిధ వ్యవస్థలతో పాటు జనం కూడా సమర్థించి, ఇలా ఆరురెట్లు అధికస్థానాలతో ఆశీర్వదించడం ఉద్ధవ్‌కు పెద్ద ఎదురుదెబ్బ. అసెంబ్లీ ఎన్నికల్లో తీవ్ర అన్యాయం జరిగిందని, ఎన్నికల సంఘం కుట్రలకు పాల్పడిందని ఆరోపించిన కాంగ్రెస్ ఈ స్థానిక ఎన్నికల్లో అనాదిగా తనకు పునాదిగా ఉన్న ప్రాంతాలను సైతం కోల్పోయింది. ఈ నేపథ్యంలో, జనవరి 15న జరగబోతున్న బీఎంసీ ఎన్నికల్లో మహాయుతి విజృంభించకుండా నిలువరించాలని ఉద్ధవ్ ప్రయత్నిస్తున్నారు. 75వేల కోట్ల రూపాయల బడ్జెట్ ఉన్న ముంబైని గెలుచుకోవడానికి సోదరుడితో చేయికలిపారు. మర్నాడు వెలువడే ఫలితాల్లో ముంబైవాసులను ఈ సోదరప్రేమ ఎంత ప్రభావితం చేసిందో తేలిపోతుంది.

అటల్ బాటలో మోదీ 'రిఫామ్ ఎక్స్‌ప్రెస్'


అజాత శత్రువు, భారతరత్న మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ అటల్‌బిహారీ వాజ్‌పేయి శతజయంతి సంవత్సరం పూర్తవుతున్న సందర్భమిది. భారతదేశంలో సుపరిపాలనకు మార్గదర్శనం చేసిన ఆయన ఐదేళ్లపాటు ప్రధానమంత్రిగా కొనసాగిన తొలి కాంగ్రెసేతర రాజకీయవేత్త. ప్రజాసంక్షేమంపై శ్రద్ధ, దేశ భద్రతపై రాజీలేని విధానంతోపాటు సంస్కరణల విషయంలో పూర్తి నిబద్ధతతో దేశాన్ని పాలించారు. సంకీర్ణ సర్కారును నడుపుతూనే వివిధ రంగాల్లో ఆయన తీసుకొచ్చిన సంస్కరణలు దేశాభివృద్ధికి బాటలు వేశాయి. ఇప్పుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా వాజ్‌పేయి బాటలోనే నడుస్తూ 'సుపరిపాలన'ను సంస్కరణల ద్వారా ఆచరణలో చూపిస్తున్నారు.

మూడోసారి అధికారంలోకి వచ్చాక మోదీ సర్కారు సంస్కరణల విషయంలో మరింత స్పష్టమైన విధానంతో పనిచేస్తోంది. 'వికసిత్ భారత్–2047' లక్ష్యాలను చేరుకునేందుకు కేంద్ర ప్రభుత్వం పక్కా ప్రణాళికలతో ముందుకెళ్తోంది. ఈ ఏడాదిలోనే క్రీడలు, మినరల్



ఎక్స్ఛేంజ్, పోర్ట్స్, వైద్యం మొదలైన రంగాల్లో సుమారు 20 కీలకమైన బిల్లులను తీసుకొచ్చింది. ఈ శీతాకాల సమావేశాల్లో మొత్తం 10 కీలక బిల్లులు తీసుకురాగా, ఎనిమిది బిల్లులు ఉభయసభల ఆమోదం పొందాయి. ఈసారి సమావేశాల్లో ఉపాధి కల్పన, అణుశక్తి, బీమా, పన్నుల హేతుబద్ధత, దీర్ఘకాల ఆర్థిక స్థిరత్వం తదితర అంశాలపై బిల్లులను పార్లమెంటు ముందుకు తీసుకొచ్చింది. వచ్చే రెండు దశాబ్దాలపాటు దేశానికి ఏమేం అవసరమో గుర్తించి.. దేశహితం కోసం వాటిని చట్టరూపంలోకి తీసుకొచ్చింది. ఇవి కాకుండా.. 'రిపీలింగ్ అండ్ అమెండింగ్ బిల్–2025' ద్వారా.. 1886 నాటి ఇండియన్ ట్రామ్ వేస్ బిల్ వంటి దాదాపు 70 కాలం చెల్లిన చట్టాలను కూడా తొలగించింది.

వాజ్‌పేయి హయాంలో గ్రామీణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. 2001లో 'సంపూర్ణ గ్రామీణ రోజ్‌గార్ యోజన' పథకాన్ని తీసుకొచ్చి గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పన, ఆహార భద్రతకు బాటలు వేశారు. ఆ తర్వాత 'ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన' ద్వారా గ్రామాలకు అనుసంధానం పెంచారు. వాజ్‌పేయి సంపూర్ణ గ్రామ స్వరాజ్య స్వప్నాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు మోదీ సర్కారు వికసిత్ భారత్–గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అజీవికా మిషన్ గ్రామీణ్–2025 బిల్లు (జీ రామ్ జీ)ను తీసుకొచ్చింది. ఉపాధి హామీ, నైపుణ్యం, జీవనోపాధి, కార్మికులకు గౌరవప్రదమైన జీవనాన్ని కల్పించడం ద్వారా వికసిత భారత్ నిర్మాణానికి బాటలు వేసేలా ఎన్డీయే ప్రభుత్వం ఈ బిల్లుకు రూపకల్పన చేసింది. ఈ పథకంలో ఉన్న 100 రోజుల పనిదినాలను 125కు పెంచి భరోసా ఇచ్చింది. కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి 15 రోజుల్లోగా పని తప్పనిసరిగా కల్పించాలని, లేదంటే వారికి పరిహారం అందించాలని స్పష్టం చేసింది. చట్టం అమల్లో పారదర్శకత తీసుకొచ్చేందుకు సాంకేతికత వినియోగాన్ని తప్పనిసరి చేసింది. చెల్లింపులకు సంబంధించి బయోమెట్రిక్ ధ్రువీకరణ, ప్రణాళికల తయారీ, నిర్వహణ కోసం జియో స్పేషియల్ టెక్నాలజీ వినియోగం, పనిని ట్రాక్ చేసేందుకు మొబైల్ అప్లికేషన్‌ను ఈ చట్టం తప్పనిసరి చేసింది. కొత్త చట్టంలో ఉపాధి హామీతో పాటు వివిధ ప్రభుత్వ విభాగాల సమన్వయంతో గ్రామాల్లో నీటి సంరక్షణ, సాగునీటి సౌకర్యాల మెరుగు, అటవీకరణ పెంచడం, గ్రామీణ రహదారులు, పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం, ధాన్యం నిల్వ కేంద్రాల వంటి మౌలిక వసతులు చేపట్టవచ్చు. దీంతో గ్రామీణ కార్మికులకు జీవనోపాధి మెరుగుపడి, వ్యవసాయ రంగానికి మేలు జరగనుంది.



మూడోసారి అధికారంలోకి వచ్చాక మోదీ సర్కారు సంస్కరణల విషయంలో మరింత స్పష్టమైన విధానంతో పనిచేస్తోంది. 'వికసిత్ భారత్–2047' లక్ష్యాలను చేరుకునేందుకు కేంద్ర ప్రభుత్వం పక్కా ప్రణాళికలతో ముందుకెళ్తోంది. వచ్చే రెండు దశాబ్దాలపాటు దేశానికి ఏమేం అవసరమో గుర్తించి, దేశహితం కోసం వాటిని చట్టరూపంలోకి తీసుకొచ్చింది.

వాజ్‌పేయి హయాంలో అంతర్జాతీయ ఒత్తిడులను లెక్కచేయకుండా భారత దేశం అణుపరీక్షలను నిర్వహించింది. "భారత్ ఇప్పుడు అణ్వస్త్రదేశం. భారత దేశ భద్రతకు, ఆత్మనిర్భరతకు ఈ ప్రయోగం అత్యవసరం" అని అప్పుడు వాజ్‌పేయి పేర్కొన్నారు. ఈ స్ఫూర్తితో మోదీ సర్కారు అణు ఇంధన రంగంలో మరింత పురోగతి సాధించేందుకు శాంతి (ద సస్టేనబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫామింగ్ ఇండియా) బిల్లు–2025ను తీసుకొచ్చింది. 2047 నాటికి 100 గిగావాట్ల అణు విద్యుదుత్పత్తి, 2070 నాటికి కర్బన ఇంధన వినియోగం నిలిపివేత లక్ష్యంగా ఈ బిల్లును రూపొందించారు. కఠినమైన, భద్రతాపరమైన నిబంధనల పరిధిలో.. అణు ఇంధన రంగంలో ప్రైవేటు సంస్థలు పనిచేసేందుకు ఈ బిల్లు బాటలు వేసింది. క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ దిశలో భవిష్యత్ విద్యుత్ అవసరాలను పూర్తిచేసేందుకు ఈ బిల్లు ఉపయుక్తం కానుంది.

పోటీ ప్రపంచంలో ఏఐ, క్వాంటమ్ టెక్నాలజీ, సెమీకండక్టర్ల తయారీ మొదలైన అధునాతన సాంకేతికతల వినియోగానికి నిరంతర, నాణ్యమైన విద్యుత్ అవసరం. అణు విద్యుత్‌తోనే ఇది సాధ్యం. అందుకే ఈ రంగంలో ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించాలని కేంద్రం నిర్ణయించింది. అణుశక్తి చట్టం–1962, అణు నష్టానికి పౌర బాధ్యత చట్టం–2010లను రద్దు చేయడం ద్వారా, అంతర్జాతీయ అణుశక్తి పర్యావరణ వ్యవస్థ సహకారాన్ని పొందుతూ దేశీయ అణుశక్తిని మరింత బలోపేతం చేసుకునే దిశగా ఈ బిల్లు ఉపయోగపడుతుంది. ఈ ప్రయత్నంలో ఒకవేళ ఏమైనా ఇబ్బందులు తలెత్తితే, నష్టనివారణ కోసం 'న్యూక్లియర్ లయబిలిటీ ఫండ్'ను ఏర్పాటు చేసింది.

అందరికీ బీమా భరోసా ఉండాలనేది బీజేపీ ఆలోచన. వాజ్‌పేయి ప్రభుత్వం 1999లో ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ యాక్ట్ (ఐఆర్‌డీఏ)ను తీసుకొచ్చింది. బీమా రంగంలో ప్రైవేటు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు (26శాతం) బాటలు వేస్తూనే ఓ చట్టబద్ధమైన నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఇప్పుడు మోదీ సర్కారు అందరికీ బీమా, అందరికీ రక్ష (బీమా సవరణ) బిల్లు–2025ను తీసుకొచ్చింది. దీంతో బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 74 నుంచి 100శాతానికి పెంచడం ద్వారా అంతర్జాతీయంగా అవలంబిస్తున్న పద్ధతులు అమల్లోకి వస్తాయి. బీమా కంపెనీల మధ్య పోటీ పెరుగుతుంది. తద్వారా బీమా కవరేజ్ పెరిగి, ప్రీమియం తగ్గుతుంది. దీంతో మారుమూల ప్రాంతాల వారు కూడా బీమా చేయించుకునే వీలు కలుగుతుంది.

వాజ్‌పేయి ప్రభుత్వం వైద్య రంగంలో ప్రైవేటు పెట్టుబడులకు మార్గం సుగమం చేసింది. తద్వారా మారుమూల ప్రాంతాల్లోనూ మెరుగైన వైద్యసేవలకు బాటలు వేసింది. ఈ పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో మోదీ ప్రభుత్వం 'ఆరోగ్య భద్రతతో జాతీయ భద్రత సెస్ బిల్లు–2025'ను తీసుకొచ్చింది. ఇది 'ఆరోగ్య భారత్' నిర్మాణం కోసం వైద్య వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుంది.

"మా అభివృద్ధిపథం సంస్కరణల ఆధారంగా ఉంటుంది. మా విధానాలు ప్రజాకేంద్రితంగా ఉంటాయి. గత 11 ఏళ్లుగా ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చాం. భవిష్యత్తులో మరిన్ని తీసుకొస్తాం. ప్రజాసంక్షేమం, దేశ గౌరవం, వాణిజ్య ప్రయోజనాలు, భద్రత వంటి విషయాల్లో రాజీపడే ప్రసక్తే లేదు" అని ప్రధాని నరేంద్రమోదీ వివిధ సందర్భాల్లో స్పష్టంగా చెప్పారు. అందులో భాగమే ఈ శీతాకాల సమావేశాల్లో మోదీ సర్కారు తీసుకొచ్చిన సంస్కరణల ఎక్స్‌ప్రెస్.

◆ జి.కిషన్‌రెడ్డి
కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి

(నేడు జాతీయ సుపరిపాలన దినోత్సవం)

బిహార్‌లో నితీశ్ నైతిక దుర్మార్గం

ఒక ముఖ్యమంత్రి అలా ప్రవర్తించవచ్చునా? బిహార్‌లో పది రోజుల క్రితం ఒక ప్రభుత్వ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ తన విధి నిర్వర్తిస్తూ అనూహ్యంగా అనుచిత రీతిలో వ్యవహరించడం పూర్తిగా ఆక్షేపణీయం. రాష్ట్ర ప్రభుత్వ సచివాలయంలో కొత్త ఆయుష్ (ఆయుర్వేద, హోమియోపతి, యునాని) వైద్యులకు నియామక లేఖల పంపిణీ కార్యక్రమమది. కొత్తగా నియమితులైన ఒక ముస్లిం మహిళా ఆయుష్ డాక్టర్‌కు అపాయింట్‌మెంట్ లెటర్ అందజేస్తూ నితీశ్ మహాశయుడు ఆమె ధరించిన హిజాబ్‌ను పట్టుకుని 'ఇదేమిటి?' అని అడుగుతూ లాగివేశారు! ముఖ్యమంత్రి వెనుక నిలుచున్న ఉప ముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరి ముఖ్యమంత్రి ఆ అనుచిత చర్యకు పాల్పడకుండా నివారించడానికి ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. అక్కడే ఉన్న ఆరోగ్యమంత్రి మంగళ్ పాండేతో పాటు మరొక ఉన్నతాధికారి సైతం ముఖ్యమంత్రి వింత ప్రవర్తనను వారించకుండా నవ్వుతూ చూస్తుండిపోయారు. ముఖ్యమంత్రి నితీశ్ బహిరంగంగా పాల్పడిన ఆ చెడ్డ పని న్యాయస్థానం శిక్షింపదగిన నేరం. మామూలు నేరానికి మించిన అపరాధమది. ఆ మహిళా డాక్టర్ వ్యక్తిగత స్వేచ్ఛ, శారీరక సమగ్రత, గౌరవంపై దాడి అది (స్త్రీల శారీరక సమగ్రత లేదా స్వయంప్రతిపత్తిని గుర్తించడం కనీస సంస్కారం. పునరుత్పత్తి ఎంపికలు అంటే గర్భధారణ, గర్భనిరోధకం, గర్భస్రావం మొదలైన విషయాలలో స్వంత శరీరం గురించి స్వయంగా నిర్ణయించుకునే హక్కు స్త్రీకి ఉన్నది. స్త్రీ స్వాభావిక విలువను గౌరవించకపోవడం, లైంగిక వేధింపులకు పాల్పడడం స్త్రీ వ్యక్తిత్వంపై అమానవీయ దాడి అవుతుంది. స్త్రీల శారీరక స్వయం ప్రతిపత్తిని ఆమె ప్రాథమిక హక్కుగా భారత రాజ్యాంగ అధికరణ 21 గుర్తించింది. శారీరక సమగ్రతను గోప్యత, స్వేచ్ఛ మానవ గౌరవంతో అనుసంధానించింది). మహిళ నమ్రత లేదా సౌమ్యతకు భంగం కలిగించడానికి వ్యతిరేకంగా, స్త్రీలకు రక్షణలు కల్పిస్తున్న నేర విచారణా చట్టం పరిధిలోకి స్త్రీ వ్యక్తిగత స్వేచ్ఛ, శారీరక సమగ్రత, గౌరవంపై దాడి చర్యలు వస్తాయి. అంతేకాదు, ప్రాథమిక న్యాయసూత్రాల వివేకం ప్రకారం మహిళా ఆయుష్ డాక్టర్ పట్ల ముఖ్యమంత్రి నితీశ్ అనుచిత ప్రవర్తన నైతిక దుర్మార్గం అవుతుంది. అటువంటి సిగ్గుమాలిన నైచ్యానికి పాల్పడిన వారిని పదవులు లేదా ఉద్యోగాల నుంచి తొలగించేందుకు దీన్ని తగిన కారణంగా న్యాయస్థానాలు దశాబ్దాల నుంచీ పరిగణిస్తున్నాయి. ముఖ్యమంత్రి నితీశ్ బహిరంగ అనైతిక ప్రవర్తన రాజ్యాంగ హక్కులు అయిన గౌరవం, స్వేచ్ఛ, గోప్యతలను ఉల్లంఘించడమే, సందేహం లేదు. బిహార్ ముఖ్యమంత్రి ఉదంతంలో ఈ ఉల్లంఘన మనం గుర్తించవలసిన మరీ ముఖ్యమైన నేరం.

చెప్పవచ్చినదేమిటంటే ముఖ్యమంత్రి నితీశ్ చర్య ఆ బాధిత మహిళా డాక్టర్‌కే కాకుండా, ఆమె వలే ప్రభుత్వ సర్వీసుకు ఎంపికైన ఇతర మహిళా డాక్టర్లకూ మతస్వేచ్ఛ పరంగానే కాకుండా, జెండర్ సమానత్వం విషయంలో కూడా తక్షణ, ప్రతికూల పర్యవసానాలను తప్పక సృష్టించే అవకాశాన్ని సూచిస్తోంది. తప్పుడు ప్రవర్తనా రీతులకు కారకుడు అయిన ముఖ్యమంత్రి పాలనలో ఉండే పరిస్థితులు ముస్లిం మహిళలకు సురక్షితమైనవేనా? పాలనా వ్యవహారాలను నిర్దేశించే మంత్రి పదవులలో ఉన్నవారు, ఉన్నతస్థాయి ప్రభుత్వాధికారులు బహిరంగంగా నైతిక నైచ్యానికి నిర్భయంగా పాల్పడేందుకు అనుమతిస్తున్న పరిస్థితులలో, మహిళలు నిశ్చింతగా విధులు నిర్వర్తించేందుకు వీలైన పని ప్రదేశాలు ఉంటాయా? ఇప్పుడు సమస్త న్యాయస్థానాలూ స్త్రీలకు సమాన హక్కులు ఉన్నాయని వక్కాణిస్తున్నాయి. మహిళా గౌరవం, స్వయం ప్రతిపత్తి గురించి గంభీరంగా మాట్లాడుతున్నాయి. అయితే కోర్టుల వెలుపల విశాల సమాజంలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి.

నైతిక దుర్మార్గ చర్య (Act of Moral Turpitude)ను ఒక సుప్రసిద్ధ అమెరికన్ నిఘంటువు ఇలా నిర్వచించింది: 'సమాజం మనోభావాలను, ఆమోదిత ప్రవర్తనా ప్రమాణాలను ఉల్లంఘించే చర్య'. మరింత స్పష్టంగా చెప్పాలంటే సాధారణ లేదా కనీస నైతికతకు పూర్తిగా తిలోదకాలు ఇవ్వడమే. మరొక ప్రసిద్ధ నిర్వచనాన్ని కూడా చూద్దాం. ఒక మనిషి తోటి మనుషులు, సమాజం పట్ల నిజాయితీని, న్యాయవర్తనను నీచంగా, హీనంగా, క్షుద్రంగా ఉల్లంఘించడమే నైతిక దుర్మార్గం. అంగీకృత, ఆచారబద్ధమైన విధులు, విధ్యుక్త ధర్మాలకు విరుద్ధంగా వ్యవహరించడం నైతిక దుర్మార్గమవుతుందని Black's Law Dictionary పేర్కొంది. 'చట్టపరమైన శిక్షతో సంబంధం లేకుండా, స్వాభావికంగా దుర్మార్గమైన చర్య' నైతిక దుర్మార్గమని మరొక నిఘంటువు నిర్వచించింది. మరింత స్పష్టంగా చెప్పాలంటే నైతిక దుర్బలత్వాన్ని కలిగి ఉన్న చర్య నైతిక దుర్మార్గం కిందకు వస్తుంది. న్యాయం, నిజాయితీ, సువ్యవస్థిత ప్రవర్తనా ప్రమాణాలకు విరుద్ధమైన చర్యలు నైతిక దుర్మార్గాలు. నైతిక దుర్మార్గ చర్యల అపరాధాలకు పాల్పడిన వ్యక్తులను ఉద్యోగాల నుంచి తొలగిస్తూ, సర్వీసు ప్రయోజనాలను నిరాకరిస్తూ తీర్పులు వెలువరించినప్పుడు న్యాయస్థానాలు తరచూ ఈ నిర్వచనాలను పునరుద్ఘాటించడం పరిపాటిగా ఉన్నది.



ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ చర్య, భారత రాజ్యాంగ అధికరణ 25 కింద హామీపడిన మత స్వేచ్ఛపై దాడి కూడా అనడంలో సందేహం లేదు. హిజాబ్‌ను, దాన్ని ధరించిన మహిళ అనుమతి లేకుండా తొలగించడం లేదా లాగివేయడమన్నది విస్తృత పర్యవసానాలకు దారితీసే దురాగతం. ముఖ్యమంత్రి లాంటి ఉన్నతపదవిలో ఉన్న వ్యక్తే అటువంటి చర్యకు పాల్పడితే... దుష్ట తలంపులు ఉన్న మూకలు అలాంటి నేరపూరిత చర్యలకు పాల్పడేందుకు అది ప్రేరణాత్మకం కాదా?

ఒక మహిళ నమ్రత లేదా సౌమ్యతకు భంగం కలిగించే నేరాన్ని భారతీయ న్యాయసంహిత సెక్షన్ 74 (ఐపీసీ సెక్షన్ 354) ఇలా నిర్వచించింది: 'ఒక మహిళ నమ్రత లేదా సౌమ్యతను దెబ్బతీసే ఉద్దేశంతో చేసే దాడి లేదా నేరపూరిత బలప్రయోగం. మరింత స్పష్టంగా చెప్పాలంటే ఒక మహిళ మర్యాదకు భంగం కలిగించే ఉద్దేశం ఏ విధంగా వ్యక్తమైనా అది శిక్షార్హమే అవుతుంది. ఇందుకు ఏడాది కాలం జైలుశిక్షతో పాటు, జరిమానా అనివార్యమవుతుంది. ఈ శిక్షను ఐదు సంవత్సరాల పాటు పొడిగించేందుకు అవకాశమున్నది'. కేరళ హైకోర్టు గత ఆగస్టులో వెలువరించిన ఒక తీర్పు ఇలా పేర్కొంది: '354 ఐపీసీ ప్రకారం... జరిగిన నేరాలు కేవలం ఒక మహిళ గౌరవానికి భంగం కలిగించే వ్యక్తిగత అపరాధాలు మాత్రమే కాదు, అవి సమాజం అంతరాత్మను దెబ్బతీసే నేరాలు. వీటి విషయంలో ఎటువంటి రాజీ అభిలషణీయం కాదు. ఎందుకంటే రాజీ అనేది అటువంటి నేరాలను మరింత నిర్భయంగా పాల్పడేందుకు ప్రోత్సహిస్తుంది'.

బిహార్ ముఖ్యమంత్రి ప్రవర్తన ఆ మహిళా ఆయుష్ డాక్టర్‌ను బహిరంగంగా అవమానించడమే అవుతుంది. పైగా ఆ సమయంలో అక్కడ ఉన్నవారు మౌనంగా, నవ్వులు చిందిస్తూ ఉండిపోవడం మరింత ఘోరం. ఇది పూర్తిగా గర్హనీయం. ఈ నైతిక అపరాధానికి పాల్పడిన వారిని న్యాయస్థానం స్వయంగా చొరవ తీసుకుని శిక్షించాలి. ప్రభుత్వ బాధ్యతల నిర్వహణ నుంచి తొలగించడమే కాకుండా జరిమానాలు విధించాలి.

ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ చర్య భారత రాజ్యాంగ అధికరణ 25 కింద హామీపడిన మత స్వేచ్ఛపై దాడి కూడా అనడంలో సందేహం లేదు. ముస్లిం మహిళల హిజాబ్ విషయమై భారతీయ న్యాయస్థానాలలో ఏకాభిప్రాయం లేదు. నిజమే, అయితే దేశ చట్టాలలో ఏదైనా హిజాబ్‌ను లాగివేసేందుకు అనుమతిస్తుందా అనే విషయమై పౌరులుగా మనమూ, సమస్త న్యాయవ్యవస్థ నిష్పాక్షికంగా పరిశీలించాలి. హిజాబ్‌ను, దాన్ని ధరించిన మహిళ అనుమతి లేకుండా తొలగించడం లేదా లాగివేయడమనేది విస్తృత పర్యవసానాలకు దారితీసే దురాగతం. ముఖ్యమంత్రి లాంటి ఉన్నతపదవిలో ఉన్న వ్యక్తి అటువంటి చర్యకు పాల్పడితే... అది దుష్ట తలంపులు ఉన్న మూకలు అలాంటి నేరపూరిత చర్యలకు పాల్పడేందుకు ప్రేరణాత్మకం కాదా?

మానవ గౌరవం (హ్యూమన్ డిగ్నిటీ) భారత రాజ్యాంగ ప్రాథమిక, నియమబద్ధమైన ప్రాతిపదిక అని పుట్టుస్వామి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు తీర్పు స్పష్టం చేసింది. మానవ గౌరవం అనేది మానవ హక్కులకు మూలంగా, మార్గదర్శక సూత్రంగా, ఏకీకృతశక్తిగా పనిచేస్తుందని ఆ తీర్పు ఉద్ఘాటించింది. 2017లో తొమ్మిదిమంది న్యాయమూర్తుల సుప్రీంకోర్టు ధర్మాసనం ఏకగ్రీవంగా గోప్యత అనేది అధికరణ 21 కింద హామీపడిన జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛలో అంతర్భాగమని ధ్రువీకరించింది. ఆ తీర్పు ఇంకా ఇలా పేర్కొంది: వ్యక్తిగత గోప్యత లేదా ఏకాంత జీవనహక్కు అనేది ఒక వ్యక్తి గౌరవంలో చాలా విశిష్టమైన విషయం. అది లేకుండా గౌరవం అనేది ఉండదు. అవి అవినాభావ సంబంధమున్న జీవిత విలువలు. మానవ గౌరవం రాజ్యాంగ ఆత్మ. అది రాజ్యాంగాన్ని చైతన్యవంతం చేస్తుంది. చట్టపరమైన నియమాలను, స్వేచ్ఛ సమానత్వ, న్యాయం కోసం బాధ్యతలుగా మారుస్తుంది'. దేశ రాజకీయ పరిస్థితులు అంతకంతకూ మతపరమైన మైనారిటీలకు వ్యతిరేకంగా మారిపోతోన్న ప్రస్తుత తరుణంలో మానవ గౌరవం, ప్రాథమిక హక్కుగా గోప్యతకు సంబంధించిన న్యాయశాస్త్ర సిద్ధాంతాన్ని పునఃపరిశీలించాల్సిన అవసరమున్నది. గోప్యతను చట్టపరమైన భావనగా కాకుండా ప్రజాస్వామ్య సమాజంలో మానవ గౌరవం, వ్యక్తిగత స్వేచ్ఛను సాధించేందుకు ఒక అనివార్యమైన షరతుగా పటిష్ఠపరచాలి. ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ బహిరంగ దుష్ప్రవర్తన పర్యవసానాలను తక్కువగా అంచనా వేయకూడదు. ఆయన చర్య వ్యక్తిగత స్వేచ్ఛపై దాడి. అవును, అది వ్యక్తిగత స్వేచ్ఛపై దాడి. ప్రతి ఒక్కరూ దానిని అలానే అర్థం చేసుకోవాలి.




• కల్పన కన్నబిరాన్
సామాజిక శాస్త్రవేత్త

ప్రజా నాయకుడు 'కాకాని'

నాయకులు చాలా మంది ఉంటారు. ప్రజా నాయకులు కొందరే అవుతారు. కాకాని వెంకటరత్నం అందుకు ఓ ఉదాహరణ. ఆయన చనిపోయి ఐదు దశాబ్దాలకు పైగా అయినా ప్రజలు ఆయనను గుర్తుపెట్టుకోవడమే కాక, ఆయన జ్ఞాపకార్థం కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉన్నారు. ప్రజా పోరాటాలలో నిమగ్నుడైన ఆయనను 'ఉక్కు కాకాని' అని ప్రజలు ప్రేమగా పిలుచుకుంటారు.

కుల మతాలకి అతీతంగా ఆలోచించటం, కార్యక్రమాలు చేపట్టటం, ముఖ్యంగా బీద కుటుంబాల నుంచి వచ్చిన వాళ్లంటే కాకానికి ప్రత్యేక అభిమానం. స్థానిక పనుల కోసం ప్రభుత్వం మీద ప్రజలు ఆధారపడకూడదని, స్థానికంగా ప్రజలు సహకరించుకుంటే ప్రజాస్వామ్యం బలపడుతుందని కాకాని ప్రచారం చేసేవారు. ఆయనది ఎలిమెంటరీ స్కూల్ చదువే, అయినా ఎన్నో వేల మంది పెద్ద చదువులకి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కారకుడయ్యారు. ప్రతి గ్రామంలోనూ గ్రామస్తులే కొద్దో గొప్పో విద్యాలయాల అభివృద్ధికి తోడ్పడే విధంగా కృషి చేశారు.



వ్యవసాయ శాఖ, పాడి పరిశ్రమ మంత్రిగా కాకాని ఆలోచనలు, తీసుకున్న నిర్ణయాలు అమోఘం. గ్రామాల్లో పేదరికాన్ని, ముఖ్యంగా ఒంటరి మహిళ ఆర్థిక స్థితిగతులు మారాలంటే, వాళ్ళ ఆదాయాన్ని పెంచే మార్గాల కోసం పాడి, గుడ్డు ముఖ్యమని గమనించి, ఎన్నో చర్యలు తీసుకున్నారు. పాడిపరిశ్రమలో మధ్యవర్తుల బెడదపోతేగాని బీదరికాన్ని నిర్మూలించలేమని నిర్ణయించుకున్నారు. నేను 1952లో రాజకీయ ఓనమాలు నేర్చుకుంది ఆయన ద్వారానే. గుజరాత్ రాష్ట్రం ఆనంద్‌లో ఉన్న నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీడీబీ) ద్వారా మార్పులు తీసుకురావచ్చు అని భావించారు. ఆ సంస్థ చైర్మన్‌ను అత్యవసరంగా కలవాలి అని బరోడాలో ఉన్న నన్ను కోరారు. కురియన్‌తో గంటసేపు సమావేశం అయ్యాం. పొడిపొడి ఇంగ్లీషులో కురియన్‌ని కాకాని ఎంతో మెప్పించారు. మహిళలని ఎలా ఆదుకోవచ్చో ఆయన చెప్పిన విధానం నాకు ఇప్పటికీ గుర్తు.

కాకాని వ్యవసాయం, పాడి పరిశ్రమల మంత్రిగా మంచి పేరు తెచ్చుకున్నారనేది 50 సంవత్సరాల తర్వాత కూడా రాజకీయ పార్టీల కతీతంగా చెప్పే విషయం. కృష్ణా జిల్లాలో చాలామంది ప్రజలు 80 సంవత్సరాల క్రింద జిల్లా బోర్డు ప్రెసిడెంట్‌గా ఆయన చేసిన అభివృద్ధి పనులు ఇప్పటికీ చెప్పుకుంటారు. ముఖ్యంగా ఆయన విద్య, వ్యవసాయం, రహదారి రంగాల్లో తీసుకున్న శ్రద్ధ... ప్రతి గ్రామంలో పాఠశాలలు పెట్టించిన విధానం... స్థానికులను ఏ విధంగా పురికొల్పి, పాల కేంద్రాల ఏర్పాటులో పాత్రధారులను చేశారు అనేవి గొప్ప విషయాలు.

గ్రామాల్లో ఆయన సాధించిన విజయాలు చూసి జమీందార్లు, ఎంతోమంది భూ కామందులు కలిసి కాకానికి వ్యతిరేకంగా కుట్రలు పన్నారు, ఆయన శాసనసభ్యుడిగా ఎన్నిక కాకుండా ప్రయత్నించారు. అయినా కాకాని ప్రజానాయకుడుగా పేరొందారు. సిద్ధాంతాలని వ్యతిరేకించి, రైతు కూలీలకు కాకాని వెంకటరత్నం నమ్మే నాయకుడు అవ్వడం కమ్యూనిస్టులకి నచ్చలేదు. వాళ్ళ పార్టీ భవిష్యత్తు, మనుగడకే ఆయన ముప్పు అని భావించారు. కమ్యూనిస్టు పార్టీ కాకాని మీద కత్తి కట్టి, ఆయన్ని చంపే ప్రయత్నాలు కూడా చేసింది. అయితే వాళ్లెవరూ కాకాని లంచగొండి అని శంకించకపోగా, ఆయన కార్యదీక్ష, క్రమశిక్షణను మెచ్చుకున్న వాళ్లే.


కాకాని వెంకటరత్నం రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రిగా ఉంటూ కూడా 1972లో 'జై ఆంధ్ర' ఉద్యమానికి నాయకత్వం వహించి, ప్రత్యేక రాష్ట్రం వస్తే ఏ విధంగా అభివృద్ధి చెందుతుందో, యువకులకు ఏ విధంగా అవకాశాలు వస్తాయో చెప్పి, ఉద్యమాన్ని ఉధృత స్థితికి తీసుకువెళ్లారు. ఉద్యమాన్ని అణగదొక్కే ప్రయత్నాల్ని, వ్యతిరేకిస్తూ గన్నవరం విమానాశ్రమంలో ముఖ్యమంత్రి పీవీ నరసింహారావు విమానం ఆగకుండా జరిగిన కాండలో యువకుల మీద పోలీసులు జరిపిన కాల్పులను తట్టుకోలేక కాకాని చివరకు ప్రాణాలే విడిచారు.

కాకాని ఆశించిన ప్రత్యేక రాష్ట్రం 40 సంవత్సరాల తర్వాత వచ్చింది. ప్రత్యేక రాష్ట్రం వచ్చి పది సంవత్సరాలయినా ఇంతవరకు ఆయన జ్ఞాపకార్థం ఏ అభివృద్ధి కార్యక్రమం, స్ఫూర్తి చిహ్నం చేపట్టలేదు. అంతకు ముందెప్పుడో పెట్టిన కాకాని విగ్రహాన్ని కూడా తొలగించారు. విజయవాడలో ఆ సర్కిల్‌ని కాకాని పేరుతో కాకుండా 'బెంజ్ సర్కిల్' అనే పిలుస్తున్నారు. ఎట్టకేలకు కాకాని విగ్రహాన్ని బ్రిడ్జి కింద అతి కష్టం మీద మళ్లీ పెట్టారు, అదీ జిల్లా ప్రముఖుల పట్టుదల వల్ల. కనీసం ఈ 54వ వర్ధంతికైనా కాకాని వెంకటరత్నం పేరు మీద 'అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు'కు పేరు పెట్టాలి.

■ డాక్టర్ నాగులపల్లి భాస్కర్‌రావు
వ్యవస్థాపకులు, సెంటర్ ఫర్ మీడియా స్టడీస్
(నేడు కాకాని వర్ధంతి)

సుపరిపాలనకు చిరునామా 'అటల్–మోదీ'


భారతదేశ రాజకీయ యవనికపై తనదైన ముద్ర వేసిన అరుదైన రాజనీతిజ్ఞుడు, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాలు దేశవ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన 'అటల్–మోదీ సుపరిపాలన యాత్ర' రాష్ట్ర రాజకీయాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ ఆధ్వర్యంలో అటల్‌జీ ఆశయాలను, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమలు చేస్తున్న అభివృద్ధి విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడమే లక్ష్యంగా సాగిన ఈ యాత్రలో పాల్గొన్న మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామి, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు అటల్‌జీ పాలనాదక్షత, సుపరిపాలన, సేవా తత్పరతను కీర్తించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ఒక స్పష్టమైన అవగాహనను కల్పించారు.



ఈ యాత్రలో ప్రసంగించిన వక్తలందరూ ఒక ప్రధాన అంశాన్ని బలంగా వినిపించారు. "భారతదేశ ప్రగతికి అటల్‌బిహారీ వాజ్‌పేయి బలమైన పునాది వేస్తే, ఆ పునాదిపై ప్రధాని నరేంద్ర మోదీ 'ఆత్మనిర్భర్ భారత్' అనే మహోన్నత సౌధాన్ని నిర్మిస్తున్నారు'. వాజ్‌పేయి నాడు నాటిన అభివృద్ధి విత్తనం నేడు మోదీ రూపంలో వటవృక్షమై దేశానికి నీడనిస్తోందని నాయకులు అభివర్ణించారు. నాడు వాజ్‌పేయి ప్రారంభించిన సంస్కరణలు, నేడు మోదీ హయాంలో సాంకేతికత, సంస్కృతి, సంక్షేమం అనే మూడు స్తంభాలపై నిలబడి భారత్‌ను విశ్వగురు స్థానానికి తీసుకువెళుతున్నాయి.

ఈ యాత్ర రాజకీయంగా కూటమి ఐక్యతను చాటిచెప్పింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, కూటమి నేతలు ఒకే వేదికపైకి వచ్చి వాజ్‌పేయిని స్మరించుకోవడం, మోదీ పాలనను సమర్థించడం వారి మధ్య ఉన్న బలమైన బంధానికి నిదర్శనం. రాష్ట్ర రాజధాని అమరావతిలో ఈ ప్రతిష్ఠాత్మక సుపరిపాలన యాత్ర ముగింపు సభ అటల్‌జీ జయంతి రోజు(డిసెంబర్ 25) జరగనుంది. కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కూటమిలోని ఇతర ముఖ్య నేతలు ఈ సభలో పాల్గొననుండడం విశేషం. 12 అడుగుల ఎత్తైన అటల్‌బిహారీ వాజ్‌పేయి కాంస్య విగ్రహాన్ని అతిథులు ఆవిష్కరించనున్నారు.

– నాగోతు రమేష్ నాయుడు
కన్వీనర్, అటల్–మోదీ సుపరిపాలన యాత్ర









గుంటూరులోని ఓ చర్చి క్యాండిల్స్ వెలిగిస్తున్న భక్తులు

హ్యాపీ హ్యాపీ.. మెర్రీ క్రిస్మస్

గుంటూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వెలుగుల్లో చర్చిలు, ప్రార్థనా మందిరాలు కాంతులీనుతుండగా.. బుధవారం అర్ధరాత్రి క్రిస్మస్ పర్వదినానికి క్రైస్తవులు ఘనంగా స్వాగతం పలికారు. హ్యాపీ హ్యాపీ.. మెర్రీ క్రిస్మస్ అంటూ కేక్‌లు కట్ చేసి క్యాండిల్స్ వెలిగించి సందడి చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో క్రిస్మస్ సందడి వాతావరణం నెలకొంది. కాగా పలు చర్చిల్లో జరిగిన అర్ధరాత్రి ప్రార్థనలకు పెద్దసంఖ్యలో క్రైస్తవులు తరలివచ్చారు. బాలయేసు జనన్నాన్ని స్వాగతిస్తూ భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత సామరస్యాన్ని చాటి చెప్పేలా వివిధ మతాలకు చెందిన వారు కూడా అర్ధరాత్రి ప్రార్థనలకు హాజరై క్రీస్తును ఆశీస్సుల కోసం కొనియాడారు. గుంటూరు మేత్రాసన బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య ఫిరంగిపురంలోని ఆలయంలో ప్రత్యేక పూజలతో క్రిస్మస్ వేడుకలను ప్రారంభించారు. అనంతరం భక్తులకు దైవ సందేశం ఇచ్చారు.



ఫిరంగిపురం బాలయేసు చర్చిలో క్రిస్మస్ సందేశమిస్తున్న బిషప్ భాగ్యయ్య



నాగేశ్వరమ్మ కుటుంబ సభ్యులతో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

అమ్మా పెద్ద కొడుకును వచ్చా

- మాటిచ్చినట్లు నాగేశ్వరమ్మను కలిసిన పవన్‌కల్యాణ్
- ఉపముఖ్యమంత్రి రాకతో వృద్ధురాలి భావోద్వేగం
- జనసేనాని పర్యటనతో ఇప్పటంలో సందడి..

4

నేడు వాజపేయి విగ్రహావిష్కరణ

- ప్రారంభించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- వెంకటపాలెంలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్

4

రాజధానిలో ప్రత్యామ్నాయ భూమి ఇవ్వండి : మక్కెన

ముగిసిన పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్

అల్గారిథమ్స్‌తో ఇంజినీరింగ్ విద్యలో విప్లవాత్మక మార్పులు

కుడి కన్ను అదురుతోంది..!

- జనలవనరుల శాఖ మేల్కోకుంటే ఆపదే!
- సాగర్ కుడి కాలువ నీటి సరఫరాపై కొరవడిన పర్యవేక్షణ
- వృథాగా పోతున్నా.. పట్టించుకోని అధికారులు
- వాటా కింద ఉన్నది 26 టీఎంసీలే
- మార్చి ఆఖరు వరకు సాగునీరు ఇవ్వాలి
- ఇందులో తాగు నీటికి 10 టీఎంసీలు కేటాయింపు

కృష్ణమ్మ కుడి కన్ను అదురుతోంది. నాగార్జునసాగర్ కుడికాలువ ఆయకట్టుదారులకు సాగునీటి ఆపదను సూచిస్తోంది. జలవనరుల శాఖ నిర్లక్ష్యం.. రైతులకు అపశకునం పలుకుతోంది. కుడికాలువ నిర్వహణపై అధికారులు ప్రదర్శిస్తున్న ఉదాసీనత.. అన్నదాతల పాలిట శాపంగా మారబోతోంది. సాగు నీటి సరఫరాపై కొరవడిన ప్రణాళిక రాబోయే విపత్తును ఘోషిస్తోంది. వరుణుడు కరుణించి కృష్ణా నది పరీవాహక ప్రాంతంలో సమృద్ధిగా వర్షాలు కురవడంతో సాగర్ జలాశయం నిండింది. కుడి కాలువ పరిధిలో పుష్కలంగా నీటి సరఫరా జరుగుతోంది. కానీ, నీటి సరఫరాపై పర్యవేక్షణ కొరవడడంతో.. చివరి భూములకు నీరు అందకపోతుండగా.. ఎగువ ప్రాంతంలో నీరు వృథా అవుతోంది.



రొంపిచర్ల : అన్నవరం వద్ద ఓగేరు వాగులో భారీగా ప్రవహిస్తున్న నీరు



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) నాగార్జున సాగర్ కుడి కాలువ నీటి సరఫరాలో నియంత్రణ లేమితో సాగు నీరు వృథాగా వాగుల్లోకి ప్రవహిస్తోంది. దీనిని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవడం లేదు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన సాగునీటి సలహా మండలి సమావేశం మొక్కుబడిగా తంతుగా మారిందని.. రైతుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేఆర్ఎంబీ కేటాయింపుల ప్రకారం ఇంకా కుడి కాలువకు 26 టీఎంసీల నీరు మాత్రమే మిగిలింది. ఈ నీటిని మార్చి ఆఖరు వరకు పంటలకు, తాగు అవసరాలకు కోసం వినియోగించాల్సి ఉంది. ఈ నీరు (మిగతా 4వ పేజీలో)

కేఆర్ఎంబీ కుడి కాలువకు ఖరీఫ్, రబీ పంటలకు సాగు నీరు, తాగు అవసరాలకు 132 టీఎంసీలు కేటాయించడం జరిగింది. ఇందులో ఇప్పటికే 106 టీఎంసీల నీటిని వినియోగించారు. ఇంకా మిగిలి ఉంది 26 టీఎంసీలే. దీనిలోనే తాగుకు 10 టీఎంసీలు కేటాయించాల్సి ఉంది. పంటలకు నికరంగా మిగిలింది 16 టీఎంసీలు మాత్రమే. ఇప్పటికైనా ప్రణాళికాబద్ధంగా సాగు నీటి సరఫరా చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి. జ్యోతిష శాస్త్రం ప్రకారం మహిళలకు కుడి కన్ను అదరితే రాబోయే ప్రమాదానికి చెడు సంకేతంగా భావిస్తారు. సాగునీటి వృథాతో సాగర్ కుడికాలువ కూడా ఇప్పటి నుంచి విపత్తు ఘంటికలు మోగిస్తోంది.. జలవనరుల శాఖ మేల్కొకుంటే సాగు నీటి కొరత తప్పదు.

ఆర్‌అండ్‌బీ రోడ్లు.. జీఎంసీకి

నిర్వహణ బాధ్యత ఇక కార్పొరేషన్‌దే

గుంటూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని రోడ్లు, భవనాల శాఖకు చెందిన రహదారుల నిర్వహణ బాధ్యతలను ఇక నుంచి గుంటూరు నగరపాలకసంస్థకు ప్రభుత్వం కేటాయించింది. వర్షాకాలంలో ఛిద్రమౌతోన్న ఆర్ అండ్‌బీ రోడ్లకు మరమ్మతులు చేయడానికి ఆ శాఖ నెలల తరబడి సమయం తీసుకుంటుంది. దీంతో వాహన దారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్లపై నగరపాలక సంస్థ మరమ్మతులు చేపట్టడానికి నిబంధనలు అంగీకరించవు. దీనిని పరిగణనలోకి తీసుకున్న కలెక్టర్ ఇటీవల నగర పరిధిలోని ఆర్ అండ్‌బీ రోడ్ల నిర్వహణను మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ చేయాలని స్పెషల్ చీఫ్ సెక్రెటరి మొవ్వా తిరుమల కృష్ణబాబుకు లేఖ రాశారు. దీనిపై ప్రభుత్వం స్పందించి బుధవారం కలెక్టర్ లేఖలోని ప్రతిపాదనలను ఆమోదిస్తూ ఉత్వర్వులు జారీ చేసింది.

తొమ్మిది రహదారులు కార్పొరేషన్‌కు స్వాధీనం

పరిధి మారనున్న రోడ్లు ఇవే..

మద్రాసు - కోల్‌కత్తా రోడ్డు(జీటీఎండీ 105)ని చుట్టుగుంట సర్కిల్ నుంచి ఆటోనగర్ వరకు 8.450 కిలోమీటర్ల పొడవునా జీఎంసీకి స్వాధీనపరిచింది.

- జేకేసీ కళాశాల నుంచి పొన్నెకల్లు రోడ్డు(జీటీఎండీ 028)లో శ్రీమౌర్య కన్వెన్షన్ నుంచి టాప్‌కిడ్స్ స్కూల్ వరకు 4 కిలోమీటర్లు
- జీఎంసీ హద్దు నుంచి ఎన్ఎస్‌పీ కెనాల్ వరకు వయా పెదపలకలూరు, మల్లవరం, బండారుపల్లిరోడ్డులో రత్నగిరినగర్ నుంచి పెదపలకలూరు వరకు 3 కిలోమీటర్లు.
- ఎంసీ రోడ్డు నుంచి జీపీ లింకు రోడ్డు (జీటీఎండీ 032)లో ఎత్తురోడ్డు - నల్లచెరువు మూడుబొమ్మల సెంటర్ వరకు 1.1245 కిలోమీటర్లు.
- జీఎంసీ పరిధిలో రెడ్డిపాలెం నుంచి భాష్యం హైస్కూల్ రామసేతు క్యాంపస్ వరకు 2.200 కిలోమీటర్లను ఆర్‌అండ్‌బీ బదిలీ చేసింది.
- గుంటూరు - చీరాల స్టేట్ హైవే రోడ్డులో బీఆర్ స్టేడియం నుంచి ఎన్‌హెచ్ -16 బుడంపాడు జంక్షన్ వరకు 3.400 కిలోమీటర్లు
- గుంటూరు - పర్చూరు రోడ్డులో పట్నంబజార్ నుంచి ఎన్‌హెచ్-16 ఏటుకూరు రోడ్డు జంక్షన్ వరకు 2.400 కిలోమీటర్లు
- గుంటూరు - అమరావతి రోడ్డులో జీఎంసీ కార్యాలయం నుంచి హోసన్నామందిరం గోరంట్ల వరకు 7 కిలోమీటర్లు
- గుంటూరు - హనుమాన్‌పాలెం రోడ్డులో ఎన్‌టీఆర్ సర్కిల్ నుంచి మానస సరోవరం వరకు 2.880 కిలోమీటర్ల స్టేట్ హైవేలను కార్పొరేషన్ పరిధిలోకి తీసుకొచ్చారు.



జిన్నాటవర్ సెంటర్ వద్ద ఉన్న ఆర్ అండ్ బీ రోడ్డు



నగర పరిధిలో ఆర్‌అండ్‌బీకి చెందిన నల్లచెరువు మెయిన్‌రోడ్డు

పండగకు కానుకలేవి?

- గతంలో చంద్రన్న కానుక పేరుతో సరుకులు
- గత ప్రభుత్వంలో ఆగిపోయిన పథకం
- కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా అదే పరిస్థితి

గుంటూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నప్పుడు రాష్ట్ర ప్రజలకు పండుగ కానుకలు అందించేది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారికి రేషన్ కార్డుల ఆధారంగా ఈ కానుకలు పంపిణీ జరిగేది. ముస్లింలకు రంజాన్‌తోఫా, క్రైస్తవులకు క్రిస్మస్ కానుక, హిందువులకు సంక్రాంతి కానుక పేరుతో సరుకులు సరఫరా చేసేవారు. 2017- 19కి మధ్య కాలంలో అమలైన ఈ పథకం సామాన్యులపై పండగ భారాన్ని ఎంతో కొంత తగ్గించింది.

● పండగ సరుకులు ఇలా..

ఉమ్మడి గుంటూరు జిల్లా లో 17 లక్షల రైస్ కార్డులు ఉన్నాయి. వారందరికీ పండుగల సందర్భంగా కానుకల పేరుతో పలు రకాల నిత్యావసర సరుకులు ప్రభుత్వం పంపిణీ చేసేది. ఒక్కో కార్డుపై రూ. 220 విలువ చేసే కేజీ గోధుమ పిండి, కేజీ పామాయిల్, అరకేజీ శనగలు, అరకేజీ బెల్లం, 100 గ్రాముల నెయ్యి, అరకిలో



కందిపప్పు అందించేవారు. కాగా 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పథకాన్ని నిలిపివేసింది. కూటమి నేతలు అధికారంలోకి వచ్చాక పండుగ కానుకలను పునరుద్ధరిస్తామని ఎన్నికల సమయంలో ప్రకటించారు. కానీ ఇప్పటి వరకూ ఈ పథకాన్ని పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వంలో ఇప్పటికి రెండు సార్లు రంజాన్, క్రిస్మస్ పండుగలు వచ్చాయి. సంక్రాంతి పండుగ కూడా రాబోతోంది. కానీ, కానుకలు మాత్రం పేదలకు దక్కలేదు.

టీడీపీ జిల్లా కమిటీ ఏర్పాటు

- ఏడు నియోజకవర్గాల నుంచి 42 మంది నియామకం

గుంటూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా కమిటీని అధిష్ఠానం బుధవారం ప్రకటించింది. జిల్లాలోని ఏడు నియోజక వర్గాల నుంచి మొత్తం 42 మంది సభ్యుల తో కొత్త కమిటీ ఏర్పాటైంది. జిల్లా అధ్యక్షుడిగా ప్రతిపాడు నియోజకవర్గానికి చెందిన పిల్లి మాణిక్యరావు, ప్రధాన కార్యదర్శిగా మంగళగిరి నియోజకవర్గానికి చెందిన పోతినేని శ్రీనివాసరావు పేర్లు ఇంతకుముందే ఖరారయ్యాయి. కాగా జిల్లా ఉపాధ్యక్షులు, కార్యనిర్వాహక కార్యదర్శులు, అధికారప్రతినిధులు, కార్య దర్శులను తొమ్మిది మంది చొప్పున ఎంపిక చేశారు. గుంటూరు తూర్పు నియోజకవర్గం నుంచి కొనకళ్ల సత్యనారాయణ కోశాధికారిగా, కార్యాలయ కార్యదర్శిగా తాడికొండ నుంచి కంచర్ల శివరామయ్య ఎంపికయ్యారు.

గుంటూరు తూర్పు : జిల్లా ఉపాధ్యక్షుడిగా గోళ్ళ ప్రభాకరరావు, కార్య నిర్వాహక కార్యదర్శిగా శనక్కాయల రాజకుమారి, అధికార ప్రతినిధిగా ఎస్‌కే సంషీర్‌జదా, కార్యదర్శిగా పెదకొండ్ల కోటేశ్వరరావు, కొనకళ్ల సత్యనారాయణ నియమితులయ్యారు.

గుంటూరు పశ్చిమ: జిల్లా ఉపాధ్యక్షుడిగా షేక్ అబ్దుల్‌రహీం, కార్యనిర్వాహక కార్యదర్శులుగా పర్చూరి సంజీవరావు, గోన సాల్మన్‌రాజు, నీలం వెంకటేశ్వరరావు, అధికార ప్రతినిధిగా గుర్రం ప్రసాద్, కార్యదర్శిగా గంటా మౌళికను నియమించారు.

శంకర్‌విలాస్ ఆర్వోబీకి.. నిర్బంధ భూసేకరణ

రేపు అత్యవసర కౌన్సిల్ సమావేశంలో చర్చించి తీర్మానం

గుంటూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శంకర్‌విలాస్ ఆర్వోబీ నిర్మాణానికి అడ్డంకిగా మారిన భూసేకరణ సమస్య పరిష్కారానికి నగరపాలకసంస్థ వేగవంతంగా అడుగులు వేస్తోన్నది. గత వారం కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సమన్వయ సమావేశంలో దాదాపుగా 43 మంది భవన యజమానులు భూమిని ఇవ్వడం లేదని కమిషనర్ పులి శ్రీనివాసులు నివేదించారు. వారు భూమి ఇవ్వకపోతే ప్రాజెక్టు నిర్మాణాన్ని అర్ధంతరంగా నిలిపేస్తారా అని మంత్రి ప్రశ్నించారు. భూమిని ఇచ్చేందుకు ఆమోదం తెలపకపోతే నిర్బంధ భూసేకరణ చేపట్టొచ్చని కమిషనర్ శ్రీనివాసులు, జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఖాజావలి చెప్పారు. సత్వరమే ఆ ప్రక్రియని చేపట్టాలని పెమ్మసాని వారిని ఆదేశించారు. స్పెషల్ కౌన్సిల్ మీటింగ్‌ని నిర్వహించాల్సిన అవసరం ఉందని ఇటీవల కలెక్టరేట్‌కు కమిషనర్ నివేదించారు. ఈ క్రమంలో శుక్రవారం మేయర్ కోవెలమూడి రవీంద్ర అధ్యక్షతన సమావేశం నిర్వహించి నిర్బంధ భూసేకరణ అంశంపై చర్చించి తీర్మానం చేస్తామని కమిషన్ తెలిపారు. ఆ తీర్మానాన్ని మున్సిపల్ పరిపాలన శాఖకు నివేదించి ఆమోదం తీసుకుని ఆ తర్వాత ఎల్‌ఏ ప్రతిపాదనలను పంపిస్తామని చెప్పారు. ప్రభుత్వ ఆమోదం లభించి తప్పనిసరి భూసేకరణ నోటిఫికేషన్ వెలువడే సరికి 10 నుంచి 15 రోజుల సమయం పట్టే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు.

దంపతుల మధ్య గొడవ

- చెరువులో దూకి భార్య ఆత్మహత్య

గుంటూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దంపతుల మధ్య గొడవ చివరకు భార్య ఆత్మహత్యకు కారణమైంది. ఇందుకు సంబంధించి నల్లపాడు పోలీసులు తెలిపిన వివరాలు.. హనుమాన్‌నగర్‌కు చెందిన నారబోయిన నాగేశ్వరరావు, నాగేంద్రమ్మ కుమార్తె సాయిలక్ష్మి(25) ఏడున్నరేళ్ల క్రితం చల్లవారిపాలేనికి చెందిన పంతంగి ఉమామహేశ్వరరావును ప్రేమించి పెళ్లి చేసుకుంది. వారికి ఇద్దరు కుమారులు సంతానం. కాగా కుటుంబ విషయంలో వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 23న భార్యాభర్తలు గొడవపడి నల్లపాడు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా పోలీసులు సర్ది చెప్పి పంపారు. వారు గుజ్జనగుండ్ల సెంటర్‌కు వచ్చేసరికి మరోసారి గొడవపడ్డారు. దీంతో ద్విచక్ర వాహనాన్ని వదిలి మళ్లీ భార్యాభర్తలు నల్లపాడు పోలీస్‌స్టేషన్‌కి వెళ్లారు. ఆ తర్వాత ద్విచక్రవాహనం తెచ్చుకుంటానని ఉమామహేశ్వరరావు గుజ్జనగుండ్ల సెంటర్‌కి వచ్చాడు. వాహనం తీసుకుని తిరిగి స్టేషన్‌కు వెళ్తుండగా సమ్మర్‌పేట వద్దకు వచ్చే సరికి అక్కడ జనం ఉన్నారు. సాయిలక్ష్మి చెరువులోకి దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు గమనించిన స్థానికులు మృతదేహాన్ని వెలికితీశారు. మృతురాలు తండ్రి నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు.

అమ్మా పెద్ద కొడుకును వచ్చా

● మాటిచ్చినట్లు నాగేశ్వరమ్మను కలిసిన పవన్‌కల్యాణ్ ● ఉప ముఖ్యమంత్రి రాకతో వృద్ధురాలి భావోద్వేగం

తాడేపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అమ్మా నీ పెద్ద కొడుకును వచ్చా.. అంటూ బుధవారం ఇప్పటం గ్రామానికి చెందిన వృద్ధురాలు ఇండ్ల నాగేశ్వరమ్మను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కలిశారు. గత ప్రభుత్వంలో వైసీపీ దాష్టీకాలను ఎదిరించిన వృద్ధురాలికి ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటంలో పవన్ పర్యటించారు. పవన్ రాకతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. నాగేశ్వరమ్మ ఇంటికి ఉదయం 10.35లకు విచ్చేసిన పవన్ 11 గంటలకు తిరిగి వెళ్లారు. ఎన్నికల సమయంలో హామీ ఇవ్వగా.. పవన్‌కల్యాణ్ తన ఇంటికి వస్తాడని ఎదురు చూస్తున్న నాగేశ్వరమ్మ కల నెరవేర్చారు. కాగా పవన్ రాకతో గ్రామం మొత్తం అభిమానులు, జనసైనికులతో నిండిపోయింది. కొలనుకొండ, ఇప్పటం గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా ప్రజలు నిలబడి పవన్‌కు స్వాగతం పలికారు. పూలతోటల్లో పనిచేస్తున్న కూలీలను పలకరించారు. కొలనుకొండ వద్ద నిర్మల అనే మహిళ కరెంటు పోల్ కావాలని అడుగగా తక్షణం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పింఛన్లు ఇప్పించాలని పలువురు విన్నవించగా పరిష్కరించే బాధ్యత పేషీ అధికారులకు అప్పగించారు.


ఇప్పటంలో ప్రజలకు అభివాదం చేస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

వైసీపీ దాష్టీకాలను ఎదిరించిన నాగేశ్వరమ్మ

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జనసేన ఆవిర్భావ సభకు భూములు ఇచ్చారన్న అక్కసుతో ఇప్పటంలో రోడ్డు విస్తరణ పేరుతో ఇళ్లు కూల్చివేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో నాటి పాలకుల దాష్టీకాలను గ్రామానికి చెందిన వృద్ధురాలి నాగేశ్వరమ్మ ఎదిరించింది. నా బిడ్డ పవన్‌కల్యాణ్ వస్తారు.. మీ బెదిరింపులకు భయపడనంటూ రోడ్డెక్కారు. ఆ తర్వాత ఎన్నికల సమయంలో పవన్‌కల్యాణ్ ఇప్పటం వెళ్లి నాగేశ్వరమ్మను కలిసి ఇంటి కొడుకుగా అండగా ఉంటాను అని హా ఇచ్చారు. గెలిచిన తర్వాత తన ఇంటికి రావాలని నాగేశ్వరమ్మ అప్పుడు కోరారు. అప్పుడు ఇచ్చిన మాటప్రకారం బుధవారం పవన్ నాగేశ్వరమ్మ ఇంటికి వెళ్లి ఆమె యోగక్షేమాలు అడిగి తెలుసుకుని కుటుంబసభ్యులను పేరు పేరునా పలకరించారు. ఆప్యాయంగా మాట్లాడడంతో నాగేశ్వరమ్మ ఉద్వేగానికిలోనై పవన్ కల్యాణ్‌ను హత్తుకున్నారు. అధైర్యపడొద్దు.. అండగా ఉంటానంటూ ఆమెకు భరోసా ఇచ్చారు.

సంక్రాంతి కానుకగా చీర.. నగదు

ఆ ఇంటి కుమారుడిగా పవన్ నాగేశ్వరమ్మకు సంక్రాంతి పండుగ కానుకగా చీర బహూకరించారు. ఖర్చుల నిమిత్తం మరో రూ.50 వేలు అందజేశారు. కుటుంబ పోషణ నిమిత్తం వృద్ధాప్యంలోనూ పొలం పనులకు వెళుతున్నానని నాగేశ్వరమ్మ చెప్పడంతో ప్రతి నెలా తన జీతం నుంచి రూ.5 వేలు పోషణ నిమిత్తం పంపుతానని చెప్పారు. దివ్యాంగుడైన నాగేశ్వరమ్మ మనుమడు మనోజ్‌సాయి చదువు నిమిత్తం రూ.లక్ష సాయం అందజేశారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆమె కుమారుడు కొండయ్యకు చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.3 లక్షలు అందజేశారు. నీ ఆరోగ్యం జాగ్రత్త అమ్మ అంటూ చెప్పి అక్కడ నుంచి పవన్ వెనుదిరిగారు.

మానవత్వం చాటుకున్న పవన్ : పిడుగు హరిప్రసాద్

డిప్యూటీ సీఎం పవన్‌కు ఇప్పటం గ్రామంతో మంచి అనుబంధం ఉందని శాసనమండలి విప్ పిడుగు హరిప్రసాద్ తెలిపారు. 2022 మార్చి 14న జనసేన ఆవిర్భావ సభ కోసం భూములు ఇచ్చారని వైసీపీ ప్రభుత్వం నాడు వారిపై కక్ష కట్టి 50కు పైగా ఇళ్లు కూల్చిందన్నారు. ఆ నాడు బాధితులను పరామర్శించి, మరోసారి ఇంటికి వస్తానని నాగేశ్వరమ్మకు పవన్‌కల్యాణ్ మాటిచ్చారన్నారు. ఆ మాట ప్రకారం ఆమె కుటుంబాన్ని పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకుని మానవత్వం చాటుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కళ్యాణ శివశ్రీనివాస్, పార్టీ నేత గంజి చిరంజీవి, సబ్ కలెక్టర్ సంజనా సిన్హా, జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

అల్గారిథమ్స్‌తో ఇంజినీరింగ్ విద్యలో విప్లవాత్మక మార్పులు

● ఐఐపీఈ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ హేమంత్ కుమార్


మాట్లాడుతున్న హేమంత్ కుమార్

గుంటూరు (విద్య) డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆధునిక మెషిన్ లెర్నింగ్ అల్గారిథమ్స్ ద్వారా ఇంజినీరింగ్ విద్యలో గణనీయమైన మార్పులు చోటు చేసుకోనున్నాయని విశాఖపట్నంలోని ఐఐపీఈ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ) అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.హేమంత్ కుమార్ అన్నారు. విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న సదస్సు బుధవారం ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ హేమంత్ కుమార్ మాట్లాడుతూ.. యువ ఇంజినీర్లు కేవలం అల్గారిథమ్స్ నేర్చుకోవడానికే పరిమితం కాకుండా.. వాటిని వాస్తవ ప్రపంచ సమస్యలకు అన్వయించగల సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేయడంలో డేటా అనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ కీలక పాత్ర పోషిస్తున్నాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ తిరుపతి ప్రొఫెసర్ కేటీ అరుణ్ , ప్రముఖ ఐటీ సంస్థ సైనెక్రాన్‌లో డేటా సైంటిస్ట్ ఇ.వంశీకృష్ణ వివిధ విభాగాలు హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

జగన్ బానిస అంబటి, పేర్నికి బడితపూజే : కనపర్తి


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

గుంటూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్‌రెడ్డికి అనుక్షణం ఊడిగం చేస్తూ.. ఆయనకు బానిసలుగా బతుకుతున్న మాజీ మంత్రులు అంబటి రాంబాబు, పేర్ని నాని నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడకపోతే కూటమి నేతల చేతుల్లో బడితపూజ తప్పదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు హెచ్చరించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం హోదాలో నా వెంట్రుక కూడా పీకలేరని మాట్లాడిన జగన్‌రెడ్డి భాషను అంబటి, పేర్ని అప్పుడే మర్చిపోతే ఎలా అని ఆయన ప్రశ్నించారు. కూటమి కలిసుంటే అంతరించి పోయిన ప్రాంతీయ పార్టీల జాబితాలో వైసీపీకి చోటు దక్కడం ఖాయమన్న భయంతో జగన్ పదేపదే కులాలను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. అంబటి, నాని లాంటి పిట్టలదొరలు అరెస్టు కోసం తహతహలాడుతూ రెచ్చి పోయి మాట్లాడుతున్నారన్నారు. జగన్ అండతో లోకేశ్, పవన్‌లను దూషించినవారు రెడ్‌బుక్ దెబ్బకు నిద్రలేని రాత్రులు గడుపుతూ అనారోగ్యం పాలవుతున్నారని కనపర్తి ఎద్దేవా చేశారు. సమావేశంలో అడకా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కుడికన్ను అదురుతోంది..!

(3వ పేజీ తరువాయి)

సరిపోయే పరిస్థితులు లేవు. పల్నాడు, గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో దాదాపు 9 లక్షల ఎకరాల్లో పంటలు ఉన్నాయి. ఉన్న నీటిని ఏఏ ప్రాంతాల్లో ఏ మేరకు అవసరాలు ఉన్నాయో గుర్తించి నీటిని సరఫరా చేస్తేనే పంటలు గట్టేకే పరిస్థితి నెలకొంది.

శాఖల సమన్వయలోపం..

11 లక్షల ఎకరాల అయకట్టు కలిగిన కుడికాలువ నీటి సరఫరాలో అడగడుగునా అలసత్వం తాండవిస్తోంది. సాగునీటి సంఘాలు, అధికారుల మధ్య సమన్వయం కొరవడింది. కుడి కాలువకు కీలక పోస్టు ఎస్ఈని నియమించడంలో జలవనరుల శాఖ పట్టీపట్టనట్లు వ్యవహరిస్తోంది. రబీ సీజన్ ప్రారంభమైన రెండు నెలల తర్వాత సాగునీటి సలహా మండలి సమావేశం మొక్కుబడిగా నిర్వహించారే తప్ప సాగు నీటి సరఫరాలో జరుగుతున్న లోపాలు, కాలువలపై నెలకొన్న సమస్యలపై దృష్టి సారించలేదని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఉన్న నీటిని ఎలా వినియోగించాలన్న అంశంపై చర్చించకపోవడం అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తోంది. ఎగువ భూముల్లో వరి పంట నూర్పిడిలు పూర్తి కావస్తున్నాయి. పత్తి పంట కూడా పూర్తి కావచ్చింది. మొక్కజొన్న, శనగ, వరి, కంది పంటలను రైతులు సాగు చేస్తున్నారు. రెండో పంట కింద వరి నాట్లు మమ్మరంగా సాగుతున్నాయి. వరికి సాగు నీరు అవసరం అధికంగా ఉంటుంది. నీటి సరఫరాపై నియంత్రణ చేపట్టకపోతే మార్చి నెలలో సాగు నీటి ఎద్దడి తలెత్తే పరిస్థితులు రానున్నాయి. సాగు నీటి సరఫరా నియంత్రణకు లష్కర్ల కొరత నెలకొంది. కొన్ని కాలువకు షట్టర్లు కూడా లేవు. దీంతో అవసరం లేని కాలువలకు కూడా నీటి సరఫరా జరుగుతోంది. మేజర్ కాలువల వారీగా ఏఏ పంటలు సాగులో ఉన్నాయి. ఏ మేరకు నీరు అవసరం అవుతుందో ఇప్పుడే అంచనా వేయాల్సి ఉంది. పంటలు లేని కాలువకు నీటి సరఫరాను నిలిపివేసేందుకు జలవనరుల శాఖ ప్రత్యేక దృష్టి సారించాలి. లేకుంటే తరుముకొచ్చే నీటి ఎద్దడికి ఆ శాఖ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుంది. మిరప, శనగ, మొక్కజొన్న, కంది పంటలకు ఆరుతడులు విధానంలో నీటి సరఫరా సరిపోతుంది. సాగులోని పంటల విస్తీర్ణం వివరాలు వ్యవసాయ, జనవనరుల శాఖలు సమన్వయం చేసుకొని సేకరించాలి. దీని ఆధారంగా నీటి సరఫరా చేస్తే నీటి వృథాను అరికట్టే అవకాశం ఉంటుంది. వర్షాలు కురవక చాలా రోజులైంది. అయినా వాగులో పుష్కలంగా నీరు ప్రవహిస్తోంది. అంటే కాలువలకు సరఫరా చేస్తున్న నీరు వృథాగా వాగుల్లోకి పోతోంది.

సాగర్ నీటి నిల్వ 250.05 టీఎంసీలు

నాగార్జున సాగర్‌లో నీటి నిల్వ 250.05 టీఎంసీలు ఉంది. జలాశయం డెడ్ స్టోరేజ్ నిల్వ సామర్థ్యం 112.18 టీఎంసీలు. ఈ నీటి నిల్వ పోను వినియోగానికి 137.87 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఈ నీటిని రెండు రాష్ట్రాలకు కేటాయిస్తారు. అయితే కేఆర్ఎంబీ కుడి కాలవకు 132 టీఎంసీలు కేటాయించగా.. 106 టీఎంసీ నీటిని వినియాగించుకోవడం జరగింది. ఉన్న నీటి నిల్వలో కుడి కాలువ వాటా 26 టీఎంసీల నీరు ఉంది. తెలంగాణ వాటా కింద 132 టీఎంసీలు కేటాయించగా.. 72 టీఎంసీలు వినియోగించుకున్నారు. ఇంకా 60 టీఎంసీలు నీరు వారికి ఉంది. రెండు రాష్ట్రాలు కేటాయించిన నీటిని తీసివేస్తే ఇంకా 86 టీఎంసీలు నీటి నిల్వ ఉంటుంది. అంటే ఈ నీరు పోను 51 టీఎంసీల నీటి నిల్వ అందుబాటులో ఉంటుంది. ఈ నీటిని కేఆర్ఎంబీ ఇరు రాష్టాలకు పంచాల్సి ఉంది. సగం కుడి కాలువకు కేటాయిస్తే 25.5 టీఎంసీలు వినియోగించుకునే అవకాశం ఉంటుంది. ఈ నీటిని మళ్లీ వరదలు వచ్చి జలాశయం నిండే వరకు తాగు అవసరాలకు వినియోగించుకొవాల్సి ఉంటుంది. సాగర్ జలాశయంలో నీటి లెక్కలను పరిశీలిస్తే ఉన్న నీటిని పొదుపుగా వాడుకోకపోతే సాగుకే కాదు తాగుకు ఎద్దడి ఏర్పడే అవకాశాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. ఇప్పటికైనా నీటి వృథాను అరికట్టేందుకు జలవనరుల శాఖ తక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంది. కుడి కాలువకు జలాశయం నుంచి 9,500 క్యూసెక్కులు బుధవారం సరఫరా చేశారు. బుగ్గవాగు నుంచి 8,742 కూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

రాజధానిలో ప్రత్యామ్నాయ భూమి ఇవ్వండి

● సీఆర్‌డీఏకు జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన విజ్ఞప్తి


సీఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్ భార్గవ్‌తేజకు వినతిపత్రం అందజేస్తున్న ఛైర్మన్ మక్కెన తదితరులు

గుంటూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మందడం గ్రామానికి చెందిన ఆలూరి సర్వేశ్వరరావు ఇటీవల మందడం గ్రామంలోని తన 11 సెంట్ల భూమిని జీడీసీసీ బ్యాంకుకు దానం చేయడంపై బ్యాంకు ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు అభినందనలు తెలియజేశారు. మందడం బ్రాంచ్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖాతాదారులకు నాణ్యమైన, పారదర్శకమైన సేవలందించాలని సూచించారు. బ్యాంకుకు భూమి దానం చేసిన సర్వేశ్వరరావును కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం సీఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్ ఎ.భార్గవ్‌తేజను ప్రత్యేకంగా కలుసుకున్నారు. బ్యాంకుకు దానం చేసిన భూమిలో పాలవాగు ప్రవహిస్తోందని.. దాని స్థానంలో రాజధాని ప్రాంతంలో భూమిని కేటాయించాలని కోరారు. బ్యాంకు సీఈవో వీవీఎస్ ఫణికుమార్, ఏజీఎం కె.బాలాజీ ప్రసాద్ తదితరులున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.7.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	147, 156, 167
చికెన్ విత్ స్కిన్(కిలో)	284.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	294.00

మిర్చియార్డు సమాచారం

(బుధవారం ధరలు)

వచ్చిన బస్తాలు	53,531
అమ్మకాలు	51,884
నిల్వ	14,278

నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10000	17000
నెంబరు. 5	12000	15200
273	11500	14000
341	11000	17000
4884	----	----
సూపర్ 10	12000	16500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	16500
షార్క్-1	-----	----
బ్యాడిగి	11000	17000
దేవనూరు డీలక్స్	11000	17500
ఆర్మూరు	10000	12700
ఏసీ కామన్ వెరైటీ		
334	10500	16700
నెంబరు. 5	11000	15000
273	----	----
341	11000	16500
4884	12000	14000
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15000
బ్యాడిగి 355	10000	16500
దేవనూరు డీలక్స్	10500	16200
తాలుకాయలు	5000	7700

ముగిసిన పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్

● ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ఎంబీటీఎస్ కైవసం


ట్రోఫీతో క్రీడాకారులు

గుంటూరు (విద్య), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లపాడులోని మద్ది బాల త్రిపుర సుందరమ్మ (ఎంబీటీఎస్) పాలిటెక్నిక్ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న పాలిటెక్నిక్ కళాశాలల స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ మంగళవారం రాత్రి ముగిసింది. ఈ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను ఎంబీటీఎస్ కళాశాల విద్యార్థులు కైవసం చేసుకున్నారు. గెలుపొందిన విద్యార్థులకు కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ టి.శేఖర్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి అఫ్రోజ్ ఖాన్ బహుమతులు అందజేశారు. గెలుపొందిన విద్యార్థులు జనవరి 28, 29, 30వ తేదీలలో తిరుపతిలో జరిగే ఫైనల్స్‌లో పాల్గొంటారని నిర్వాహకులు వెల్లడించారు.


నేడు వాజపేయి విగ్రహావిష్కరణ


సీఎం సభా వేదిక

తుళ్లూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా రాజధాని అమరావతిలో స్వర్గీయ మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహావిష్కరణ గురువారం జరగనుంది. వెంకటపాలెం రెవెన్యూలో ఎన్-4, ఈ-4 జంక్షన్‌లో వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాల సందర్భంగా విగ్రహం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం 2 ఎకరాలను కేటాయించింది. ఇందులో 13 అడుగుల వాజ్‌పేయి కాంస్య విగ్రహంతో పాటు ఆయన స్మృతి వనం ఏర్పాటు చేస్తారు. సీఎం చంద్రబాబు విగ్రహ ఆవిష్కరణ చేస్తారు. అనంతరం సభలో మాట్లాడతారు. అందుకు కావాల్సిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్, ఏర్పాట్లను పరిశీలించారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, అధికార ప్రతినిధి జయప్రకాష్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కమార్ యాదవ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కూడా బుధవారం ఏర్పాట్లను పర్యవేక్షించారు. సీఎంతో పాటు కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహన్, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేష్, సత్యకుమార్ యాదవ్ పాల్గొననున్నారు. ఏర్పాట్లు పక్కాగా ఉండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఆర్డీఏ అదనపు కమిషనర్ భార్గవ తేజ, అదనపుఎస్పీలు హనుమంతు, ఏటీవీ రవి కుమార్, రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసరావు, రహదారులు భవనాల శాఖ పర్యవేక్షణ ఇంజనీర్ శ్రీనివాసమూర్తి, జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలిపద్మ, తహసీల్దార్ హరిబాబు, సీపీడీసీఎల్ పర్యవేక్షణ ఇంజనీర్‌లు పాల్గొన్నారు. కాగా, ఈ ప్రాంగణానికి అటల్ స్మృతి వనంగా నామకరణం చేస్తునట్టు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మాధవ్ చెప్పారు. రాజధాని ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల వారు, కూటమి నాయకులు కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారని తెలిపారు.

హక్కులతో పాటు బాధ్యతలు తెలుసుకోవాలి

● జేసీ అశుతోష్ శ్రీవాస్తవ


గెలుపొందిన విద్యార్థులతో జేసీ శ్రీవాస్తవ

గుంటూరు(విద్య) డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులు హక్కులతో పాటు బాధ్యతలు తెలుసుకోవాలని జేసీ అశుతోష్ శ్రీవాస్తవ విజ్ఞప్తి చేశారు. బుధవారం పాత బస్టాండ్ వద్ద పరీక్ష భవన్‌లో జరిగిన జాతీయ వినియోగదారుల దినోత్సవంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. మార్కెట్లో నకిలీ వస్తువుల అప్రమత్తంగా ఉండాలని సూచిం చారు. జిల్లా జడ్జి విజయలక్ష్మి మాట్లాడుతూ వినియోగదారులు ఐఎస్ఐ, హాల్‌మార్క్ చిహ్నాలు ఉన్న వస్తువులను కొనుగోలు చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో డీఈవో డాక్టర్ షేక్ సలీం బాషా, జిల్లా సైన్స్ కో-ఆర్డినేటర్ గౌసుల్ మీరా, ఎంఈఓలు కుద్దూస్, హవేలా, నాగేంద్రమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గుంటూరులోని ఆక్సఫర్డ్, నారాకోడూరు ఉన్నత పాఠశాలల విద్యార్థులు భవిత, కృష్ణ తులసి, వక్తృత్వంలో మంగళగిరి మున్సిపల్, నారాకోడూరు పాఠశాలల విద్యార్థులు కనకపుట్లమ్మ, సాక్షి విజేతలుగా నిలిచారు.

బీసీలకు రాజ్యాధికారమే అంతిమ లక్ష్యం

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన


నియామక పత్రాలు అందజేస్తున్న కేసన శంకరరావు

మంగళగిరి సిటీ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): బీసీలకు రాజ్యాధి కారమే అంతిమ లక్ష్యంగా నూతన కమిటీల బాధ్యులు పనిచే యాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు సూచించా రు. తిరుపతి జిల్లాకు చెం దిన పలువురు నాయకులకు జిల్లా, రాష్ట్రస్థాయి పదవులను కేటాయిస్తూ బుధవారం మంగళగిరిలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో నియామక పత్రాలను అందజేశారు. రాష్ట్ర అధికార ప్రతినిధిగా కల్లూరి నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా మొబ్బినేని రఘు పతి, ఉపాధ్యక్షులుగా ఆర్కే యాదవ్, కార్యవర్గ సభ్యుడిగా సోమశేఖర్ ఆచారి, జిల్లా అధ్యక్షుడిగా కంభం లోకయ్య, ప్రధాన కార్యదర్శి మధు మార్గాచార్యులను నియమిం చారు. శంకరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బీసీ సంక్షేమ సంఘం నిర్మాణం పటిష్టంగా ఉందన్నారు. గ్రామ గ్రామాన బీసీ జెండా ఎగిరేలా సంఘం బలోపేతానికి మరింత కృషి చేయాలన్నారు. అవసరమైతే ప్రజా సంఘాన్ని రాజకీ య పార్టీగా మలిచి, 2029 ఎన్నికల్లో బీసీల రాజ్యాధికార సాధనకు పాటుపడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల వాగ్దానం మేరకు చట్టసభల్లో 33 శాతం, స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లను చట్టబద్ధంగా అమలు చేయాలని, రాజ్యాంగ - చట్టపర అవరోధాలను అధిగమించేందుకు డెడికేటెడ్ కమిషన్ ద్వారా సమగ్ర కులగణన జరిపించి.. బీసీలకు జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు అమలు జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్, నేతలు శివరాం బాబాజీ, కేసన కోటేశ్వరరావు, దానా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హత్యకేసులో నిందితుల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ

తాడేపల్లి టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంజిరెడ్డి కాలనీలో ఈ నెల 18న జరిగిన హత్య కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం మీడియా ముందు నిందితులను హాజరుపరిచి డీఎస్పీ మురళీకృష్ణ వివరాలు వెల్లడించారు. అంజిరెడ్డి కాలనీ అరటి తోట సమీపంలో రోడ్డుపై మలినేని సాయిభవాని, వేమూరి మహేష్‌బాబు, సాయి అతని స్నేహితులతో కలిసి పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటున్నారు. ఇల్లచెరువు వెంకటరావు (32) ఆటోను యువకులవైపు పోనిచ్చి క్రాస్‌గా కట్ చేశాడు. దీంతో అక్కడ ఉన్న యువకులకు వెంకట రావుకు మధ్య ఘర్షణ జరిగింది. అనంతరం అంజిరెడ్డి కాలనీకి వెళ్లిన వెంకటరావు అదే మార్గంలో వస్తూ మళ్లీ ఆటోను కట్ చేశాడు. పూర్తిగా మద్యం సేవించి ఉన్న యువకులు కోపంతో బైక్‌పై ఆటోను వెంబడించి.. నిలుపుదల చేశారు. తమమీదకే ఆటో రానిస్తావా అంటూ సాయి భవాని, మహేష్‌బాబు రాళ్లతో విచక్షణా రహితంగా అతని తల, ముఖంపై దాడి చేశారు. దీంతో వెంకటరావు అక్కడికక్కడే మృతి చెందాడు. సీఐ వీరేంద్రబాబు నేతృత్వంలో తాడేపల్లి ఎస్ఐ ఎస్కే ఖాజా వలి, ప్రదీప్, కానిస్టేబుల్స్ రవికుమార్, జోసఫ్ ప్రసాద రావు బృందంగా.. నిందితులను బుధవారం ఎయిమ్స్ వైద్యశాల రోడ్డులో అదుపులోకి తీసుకున్నారు. సిబ్బందికి రివార్డులు అందజేశారు.



నసీర్ అహ్మద్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

అలరించిన మ్యూజికల్ నైట్



రఫీ పాటలను ఆలపిస్తున్న గాయకుడు

గుంటూరు (తూర్పు), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో బుధవారం ఏర్పాటు చేసిన మహ్మద్ రఫీ పాటల సంగీత విభావరి అలరించింది. తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ఆధ్వర్యంలో ఎం పవర్ ఫౌండేషన్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. హైదరాబాద్ ఆర్కెస్ట్రా వారి నేపథ్య సంగీతంలో సాగిన పాటల కచేరి ఆద్యంతం రసభరితంగా సాగింది. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ, అన్ని విభాగాల్లో పాటలు పాడి అలరించిన మహ్మద్ రఫీ జీవితం చిరస్మరణీయమని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్, మాజీ ఎమ్మెల్యే నంబూరు సుభాని, షకూరు, ఆదం, పొత్తూరి రంగారావును నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేయర్ కోవెలమూడి నాని, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర్లు, కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆహ్లాదానికి కేరాఫ్ ఎగ్జిబిషన్లు

నగరంలో ఆహ్లాదాన్ని అందించేలా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్లు ఆకట్టుకుంటున్నాయని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. నగరంలోని గుంటగ్రౌండ్, కాకాని రోడ్డులోని గోల్డెన్ టుబాకో కంపెనీ వద్ద ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ, క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి సందర్భంగా విద్యార్థులకు సెలవులు రావడంతో కుటుంబ సమేతంగా ఎగ్జిబిషన్‌కు వెళ్లవచ్చని అన్నారు. ఉరుకుల పరుగుల జీవితంలో ఆహ్లాద, ఆనందం అవసరమని పేర్కొన్నారు.

స్థానిక సమస్యలపై స్పందనకు పురమిత్ర యాప్

● కమిషనర్ పులి శ్రీనివాసులు



భవనాల కొలతలను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు (కార్పొరేషన్), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలు తమ స్థానిక సమస్యలపై తక్షణ స్పందనకు పురమిత్ర యాప్‌ని వినియోగించుకోవచ్చని నగర కమిష నర్ పులి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆర్టీసీ కాలనీ, ఐపీడీ కాలనీ, ఎల్ఆర్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి పీజీఆర్ఎస్, డీవైసీలో అందిన ఫిర్యాదులను, పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించి, సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేసి, ప్రజ లతో పురమిత్ర యాప్‌ని డౌన్‌లోడ్ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడు తూ పురమిత్ర యాప్ ద్వారా 122 రకాల పురపాలక సేవలు, గ్రీవెన్స్‌లు, చెల్లింపులను చేతిలోని ఫోన్ ద్వారానే పొందవచ్చన్నారు. పర్యటనలో డీఈఈ శ్రీనివాస్, కార్పొరేటర్ రంగారెడ్డి, ఎస్ఎస్‌లు సాంబయ్య, అయూబ్ ఖాన్, ఇంజనీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

రోడ్లపై ఉన్న ఆవులు గోశాలకు తరలింపు

గుంటూరు నగరంలో ప్రధాన రోడ్లపై ట్రాఫిక్‌కి ఆటంకం కల్గిస్తూ, ప్రమాదాలకు కార ణంగా ఉంటున్న ఆవులను, ఎద్దులను 3 బృందాల ద్వారా గోశాలకు తరలిస్తారని, తర లించిన వాటిని ఎట్టి పరిస్థితుల్లో తిరిగి ఇవ్వరని, తరలింపుని అడ్డుకుంటే పోలీసు కేసులు నమోదు చేస్తామని కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. బుధవారం ఎల్ఆర్ కాలనీ, ఏటుకూరు రోడ్ ప్రాంతాల్లో రోడ్ల మీద ఉన్న ఆవులను గోశాలకు తరలింపులో కమిషనర్ నేరుగా పాల్గొన్నారు.

వక్ఫ్ భూములను పేద ముస్లింలకు ఇవ్వాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి, తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో చినకాకాని సమీపంలో ఉన్న 71.57 ఎకరాల వక్ఫ్ భూమిని ఇళ్ళు లేని పేద ముస్లింలకు ఇళ్ల స్థలాలుగా ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై నేతాజీ కోరారు. స్థానిక బ్రాడీపేట, ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాశం రామారావు అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ విస్తృత సమావేశంలో నేతాజీ మాట్లాడారు. పారిశ్రామిక అవసరాలకు ఈ స్థలాన్ని వినియోగించవద్దని కోరారు. ఎన్నికల సందర్భంగా పట్టణ ప్రాంత పేదలకు 2 సెంట్లు, ఇళ్ల స్థలం ఇచ్చి ఇళ్లు నిర్మిస్తామని కూటమి హామీ ఇచ్చిందన్నారు. ఇచ్చిన హామీ మేరకు ఆ స్థలాన్ని ముస్లింలతో పాటు ఇతర పేదలకు ఇంటి స్థలాలుగా మార్చి వారికి పంపిణీ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఈమని అప్పా రావు, ఎం.రవి, బి.వెంకటేశ్వర్లు, వి.జవహర్‌లాల్, కె.జెకుమార్, వెంగన్న, పి.కృష్ణ, బి.ముత్యాలరావు, ఎం.శాంసన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలి

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించాలని, నూతన 2025 ఉపాధి చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ 26న జరిగే రౌండ్ టేబుల్ సమావేశంలో రాజకీయ పార్టీలు, దళిత, ప్రజాసంఘాలు పాల్గొని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై నేతాజీ ఒక ప్రకటనలో కోరారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో రాజకీయ పార్టీలు, దళిత, ప్రజాసంఘాల నాయకులు పాల్గొనాలని కోరారు.

పీపీపీ పద్ధతి నిర్వహణకు స్వస్తి పలకండి

● ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ వెల్లడి



మాట్లాడుతున్న లక్ష్మణరావు తదితరులు

గుంటూరు(కార్పొరేషన్), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 10 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పీపీపీ పద్ధతిలో ప్రైవేటీకరణ చేయడంపై రాజకీయ పార్టీలు, పౌర సంఘాలు, విద్యార్థి సంఘాలు పెద్దఎత్తున నిరసన తెలియజేయడం ద్వారా ప్రజాభిప్రాయాన్ని గుర్తించి [illegible] ప్రభుత్వ మెడికల్ కళాశాల పరిరక్షణ కమిటీ గౌరవ కన్వీనరు, శాసనమండలి మాజీ సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు, జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు కొరివి వినయ్‌కుమార్ అన్నారు. గుంటూరులోని జనచైతన్య వేదిక హాల్లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేట్ పరం చేయాలనే ఆలోచనను వ్యతిరేకించాలని అన్ని రాజకీయ పార్టీలు, విద్యార్థి యువజన సంఘాలు, ప్రజా సంఘాలతో విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద జనవరి 9న సామూహిక నిరసన దీక్ష నిర్వహిస్తామని ప్రకటించారు. పేదలకు మెరుగైన వైద్యం అందించాలని భావించే అందరూ సామూహిక నిరసన దీక్షలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

చలమయ్య డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

గుంటూరు విద్య డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన ఇంటర్ కళాశాల బాడీ బిల్డింగ్ పోటీల్లో నంగిడిపాలెంలోని చలమయ్య డిగ్రీ కళాశాల విద్యార్థులు బహుమతులు సాధించారని కళాశాల కార్యదర్శి కర్నూరపు సూర్య నారాయణ బుధవారం ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు పి.మనోహర్ 80 కేజీల విభాగంలో బంగారు పతకం, వెయిట్ లిఫ్టింగ్‌లో కాంస్య పతకాన్ని సాధించాడు. టి.నాగజ్యోతి వెయిట్ లిఫ్టింగ్ 77 కేజీల విభాగంలో సిల్వర్ పతకం సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ మహాకాళి శ్రీనివాసరావు అభినందించారు.

పీఎంవీబీఆర్‌వై ప్రయోజనాలు అందించాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



పీఎంవీబీఆర్‌వైపై కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ అన్సారియా

గుంటూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వ్యాపార, పారిశ్రామిక రంగానికి చెందిన ఉద్యోగులు, యజమానులకు ప్రధాన మంత్రి విక్షిత్ భారత్ రోజ్‌గార్ యోజన (పీఎంవీబీఆర్‌వై) ప్రయోజనాలు అందించేలా సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు. కలెక్టరేట్‌లో పీఎంవీబీఆర్‌వై పై ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ, కార్మిక శాఖ, పరిశ్రమల శాఖ, ఈఎస్ఐ అధికారులతో బుధవారం కలెక్టర్ సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ సేవ, తయారీ రంగ పరిశ్రమలలో ఉద్యోగాల సృష్టికి ప్రధాని మోదీ ఈ పథకం ద్వారా కార్మికులు, యజమానులకు ప్రత్యేక ప్రయోజనాలను అందిస్తున్నారని తెలిపారు. ఈపీఎఫ్‌లో నమోదు చేసుకున్న మొదటిసారి ఉద్యోగులకు రూ.15,000 వరకు ప్రోత్సాహకం రెండు విడతల్లో అందిస్తారన్నారు. రూ. లక్ష వరకు స్థూల జీతం ఉన్న ఉద్యోగులందరూ ఈ పథకానికి అర్హత ఉందని చెప్పారు. నూతనంగా ఈపీఎఫ్‌లో నమోదు చేసిన అదనపు ఉద్యోగికి సేవా రంగ సంస్థలకు రెండు సంవత్సరాల వరకు, తయారీ రంగ సంస్థలకు నాలుగు సంవత్సరాల వరకు ప్రతి నెల రూ. 3 వేల వరకు ప్రయోజనాలు అందుతాయన్నారు. 2025 ఆగస్టు 1వ తేదీ నుంచి 2027 జూలై 31వ తేదీ మధ్యకాలంలో నమోదైన ఉద్యోగులకు మాత్రమే ఈ ప్రయోజనాలు అందుతాయని చెప్పారు. ఇప్పటికీ ఈఎస్ఐసీలో నమోదు కాని కార్మికులను ఎలాంటి చందాలు, జరిమానాలు లేకుండా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ఏ గాయత్రి, అసిస్టెంట్ కమిషనర్ కె.శ్రీనివాసరావు, అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ పి.గోపాల్ సింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ నాగేశ్వరరావు, ఈఎస్ఐ అధికారి కె.చెన్నకేశవులు, ఫ్యాక్టరీస్ శాఖ అధికారి బి.శిరీష, ఇండస్ట్రీస్ అధికారి మణికుమారి, ఏపీఎఫ్‌సీకే ప్రతినిధి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.


మెరుగైన విద్యా ప్రమాణాల కోసం 'మనబడి మన బాధ్యత'

గుంటూరు(విద్య), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయిలో మెరుగైన విద్యా ప్రమాణాల కోసం 'మనబడి మనబాధ్యత' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ తమీం అన్సారియా వెల్లడించారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. తొమ్మిది, పదో తరగతి విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి, ఉన్నత విద్యా, ఉద్యోగావకాశాలపై అవగాహన కల్పించడం తద్వారా పది పరీక్షల్లో వందశాతం ఫలితాలు సాధించడం లక్ష్యం గా 'మనబడి - మనబాధ్యత' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 185 ఉన్నత పాఠశాలలకు జిల్లా అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించి ఆయా పా ఠశాలల పర్యవేక్షణ బాధ్యతను అప్పగించనున్నట్లు వెల్లడించారు. ప్రధానంగా తొమ్మిది, పది విద్యార్థుల్లో మానసిక ఆందోళన తగ్గించడం, చదువుపై ఏకాగ్రత కలిగించడం, విద్యార్థులు ఏ సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారో గుర్తించి వాటిలో శిక్షణ ఇవ్వడం, విద్యార్థుల్లో నెలకొన్న భయాలను తొలగించడం చేస్తామన్నారు.

మిర్చి నాటు వేసే యంత్రం ఆవిష్కరణ

● ఆర్వీఆర్‌జేసీ పూర్వ విద్యార్థి రూపకల్పన

గుంటూరు (విద్య), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మిర్చి నాటు వేసే ప్రోటోటైప్ యంత్రాన్ని ఆర్వీఆర్‌జేసీ కళాశాల పూర్వ విద్యార్థి వెంకటేశ్ లింగిశెట్టి ఆవిష్కరించారు. ఈ యంత్రాన్ని ఆవిష్కరించినందుకుగాను జాతీయ కిసాన్ దివస్ ఎక్స్‌పో, నేషనల్ అగ్రిటెక్ హ్యాకథాన్‌లో ఆయన నగదు బహుమతిని అందుకున్నారు. నూతన యంత్ర ఆవిష్కర్త తమ కళాశాల పూర్వ విద్యార్థి కావడం అభినందనీయమని ఆర్వీఆర్ కళాశాల అధ్యక్షుడు డా. రాయపాటి శ్రీనివాస్, కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ పేర్కొన్నారు. వెంకటేశ్ ప్రస్తుతం తెలంగాణలోని టీ వర్క్స్‌లో ఫెలోషిప్ ఉద్యోగిగా పనిచేస్తూ, రైతాంగం కోసం నూతన సాంకేతికత అభివృద్ధి దిశగా వినూత్న ఆలోచనలు చేయడం అభినందనీయమని రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. వెంకటేశ్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, వివిధ విభాగాల హెచ్‌వోడీలు అభినందించారు.



డాక్టర్ యలమంచిలి శివాజీ నుంచి ప్రోత్సాహక బహుమతి అందుకుంటున్న వెంకటేష్ లింగిశెట్టి

ఘనంగా రాయపాటి శ్రీనివాస్ జన్మదినోత్సవం

గుంటూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ జన్మదిన వేడుకలు ఆయన కార్యాలయంలో బుధవారం ఘనంగా జరిగాయి. రాయపాటి యువసేన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు నాయకులు, అభిమానుల సమక్షంలో ఆయన కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర (నాని), తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ రాజపుత్ర సత్యంసింగ్, రాష్ట్ర ఆర్ఎంపీ డాక్టర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు రాజా సిద్ధార్థ, నాయకులు కేశవ యాదవ్, మర్రి శివయ్య, సూర్యదేవర రవి, షేక్ మీరావలి, పార్థసారధి, ప్రసాద్, పాతూరి రమేష్, కిలారి తదితరులున్నారు. అలానే రాజపుత్ర సత్యంసింగ్ ఆధ్వర్యంలో బ్రాడీపేటలోనున్న షిర్డీసాయి దీన జన సేవా సమితిలో విభిన్న ప్రతిభావంతులకు పండ్లు పంపిణీ చేసి కేక్ కట్ చేశారు.



రాయపాటి శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న మేయర్ నాని, టీడీపీ నేతలు, అభిమానులు

ర్యాష్ డ్రైవింగ్‌పై పోలీసుల కొరడా



వాహన తనిఖీలను పర్యవేక్షిస్తున్న సౌత్ డీఎస్పీ భానోదయ

గుంటూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాలకు కారణమవుతున్న ఆకతాయిలపై పోలీసులు కొరడా ఝుళిపించారు. నగరంలోని ప్రధాన రహదారులు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో కొంతమంది యువకులు బైక్‌లు ర్యాష్ డ్రైవ్ చేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో 44 ద్విచక్ర వాహనాలు సీజ్ చేశారు. వాహన తనిఖీలు ప్రతిరోజూ కొనసాగిస్తామని పోలీస్ అధికారులు హెచ్చరించారు.

మాదక ద్రవ్య రహిత జిల్లానే లక్ష్యం : ఎస్పీ

గుంటూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్య రహిత జిల్లాగా గుంటూరును చేయడమే తన లక్ష్యమని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. దీనిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సీతారామయ్య హైస్కూల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు

గుంటూరు(కార్పొరేషన్), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురంలోని శ్రీపాటి బండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలలో బుధవారం సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు క్రీస్తు జనన ప్రదర్శన, ప్రేమ, దయ, కరుణాత త్యాగ్ని పెంపొందించే క్రీస్తు సందేశాత్మక నాటికలు ప్రదర్శించారు. పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్, పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ దోసకా యల దుర్గాశ్యామ్, సీనియర్ కోఆర్డినేటర్ ఘట్టమనేని రాధామాధవి, ప్రైమరీ కోఆర్డినేటర్ సయ్యద్ దిల్ జహన్, ప్రీ-ప్రైమరీ కోఆర్డినేటర్ తిరువీధుల శ్రీదేవి, ఇన్‌చార్జి కొమ్మినేని హరిప్రియ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీపూజితలో ....

గుంటూరు(విద్య), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిపురంలోని శ్రీ పూజిత పబ్లిక్ స్కూల్లో బుధవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కంచర్ల పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

నేడు మిర్చియార్డుకు సెలవు

గుంటూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండగ సందర్భంగా గురువారం గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ(మిర్చియార్డు)కు సెలవుదినమని ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు యార్డుకు మిర్చిని తీసుకురావొద్దని విజ్ఞప్తి చేశారు.

వైభవంగా కల్యాణ మహోత్సవాలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక గోరంట్ల, అన్నపూర్ణ నగర్‌లో పద్మావతీ, అండాళ్ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో దశావతార కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం పరశురామ అవతారంలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకులు వైభవంగా జరిపారు.

క్రిస్మస్ వేడుకలు ప్రారంభం



భక్తిగీతాలు ఆలపిస్తున్న మహిళలు

గుంటూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆర్‌సీఎం దేవాలయాల్లో బుధవారం అర్ధరాత్రి భక్తులు క్రిస్మస్ వేడుకల్లో భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాస్టర్లు దైవ సందేశం ఇచ్చారు. చర్చిలు భక్తులతో కిటకిటలాడాయి. నగరంలోని ఏసీ కళాశాల ఎదురుగా ఉన్న పునీత ఆగ్నేసమ్మ దేవాలయంలో, రింగ్ రోడ్డులో గల నిత్య సహాయ మాత ఆలయంలో, స్తంభాలగరువులోని ఆగ్జిలియం స్కూల్‌లో గల దివ్య బాలయేసు దేవాలయంలో, నగరంపాలెంలోని పునీత అంతోనివారి దేవాలయంలో, గోరంట్లలోని ఆరోగ్య మాత ఆలయంలో, అమరావతి రోడ్డులోని వెలాంగినిరోడ్డులో గల వెలాంగిణి మాత ఆలయంలో, బొంగరాలబీడు, కాకాని రోడ్డులోని మంగళదాస్‌నగర్ లూర్దుమాత ఆలయాల్లో అర్ధరాత్రి పూజలు జరిగాయి. భక్తులు కాండిల్స్ వెలిగించి దేవుడిని ప్రార్థించారు.



ఏసీ కాలేజి ఎదురు పునీత ఆగ్నేయసమ్మ దేవాలయంలో దివ్యబలి పూజలో సందేశం ఇస్తున్న డాక్టర్ మద్దు బాలస్వామి

జిల్లా ప్రజలకు ఎస్పీ క్రిస్మస్ శుభాకాంక్షలు

శాంతి, సహనం, ప్రేమే క్రిస్మస్ అని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా ప్రజలందరికీ, పోలీసు అధికారులు, సిబ్బందికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ శాంతి, సమాధానాలతో, ఆనందోత్సాహాలతో క్రిస్మస్ పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రధాన చర్చిలు, ప్రార్థనా మందిరాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.



డాన్‌బాస్కో చర్చిలో ప్రార్థనలు చేస్తున్న ఫాదర్స్ థామస్, మ్యాథ్యూ, లాయిస్, అనూప్, పాల్గొన్న భక్తులు



సమావేశమైన మేయర్ రవీంద్ర, ఎమ్మెల్యేలు నసీర్, మాధవి, రామాంజనేయులు, కమిషనర్ తదితరులు

సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించాలి

● నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు(కార్పొరేషన్), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జనవరి 2026లో జరగనున్న సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. బుధవారం గుంటూరు తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు మహమ్మద్ నసీర్, గళ్ళా మాధవి, బూర్ల రామాంజనేయులు, నగర కమిషనర్ పులి శ్రీనువాసులుతో ఆయన ఛాంబర్‌లో సమావేశం నిర్వహించి, సంక్రాంతి సంబరాలు, నగరంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చాక గుంటూరు నగరంలో వేగవంతంగా జరుగుతున్నాయని, ఇప్పటికే 500 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు నిర్వహించడానికి అనుమతులు ఇచ్చారన్నారు. అలాగే ప్రతి సంవత్సరంలాగానే ఈ సంవత్స రం కూడా సంక్రాంతి సంబరాలను నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిం చడానికి అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. నగరంలో అనధికారికంగా నిర్వహిస్తున్న హోల్‌సేల్ మార్కెట్ తొలగించుటకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే సంక్రాంతి పండుగ అనంతరం ఎన్టీఆర్ స్టేడియం పాలకవర్గ ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, సిటీ ప్లానర్ రాంబాబు, ఇన్‌చార్జ్ ఎస్ఈ సుందరరామిరెడ్డి, సీఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, మేనేజర్ బాలాజీబాషా పాల్గొన్నారు.

వాజ్‌పేయి విగ్రహావిష్కరణ మరపురాని ఘట్టం

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో గురువారం ఒక చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతం కాబోతోందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. మాజీ ప్రధాని, రాజకీయాల్లో అజాత శత్రువుగా పేరుగాంచిన అటల్ బిహారీ వాజ్‌పేయి కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ చేతుల మీదుగా ఆవిష్కరిస్తున్నారని తెలిపారు. వాజ్‌పేయి విగ్రహాన్ని అమరావతి లో ఏర్పాటు చేయడం, రాష్ట్రానికి, అమరావతి భవిష్యత్తుకు ఎంతో గర్వకారణమని ఆమె చెప్పారు. కార్యక్రమానికి కూటమి నేతలు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పిలు పునిచ్చారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ నేతృత్వంలో నియోజకవర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆమె కోరారు.

క్రిస్మస్ పండుగ సంతోషాలు నింపాలి : డేగల ప్రభాకర్

ప్రేమభావం, సేవాతత్పరత, క్షమాగుణాన్ని బోధించిన క్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పండుగను క్రైస్తవులంతా సంతోషంగా జరుపుకోవాలని ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్ కోరుకున్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆయన ప్రజలకు శుభాకాంక్షలు తెలి యజేశారు. ఏసుప్రభువు చూపిన శాంతి, సహనం, ప్రేమ మార్గాల్లో ప్రతి ఒక్కరూ నడవాలని ఆకాంక్షించారు.

మాదకద్రవ్యాలపై అప్రమత్తంగా ఉండాలి

గుంటూరు(విద్య), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలపై యువత అప్ర మత్తంగా ఉండాలని, వీటి బారిన పడితే భవిష్యత్తు అంధకారమేనని డీఎస్పీలు అరవింద్, శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. బ్రాడీపేటలోని మాస్టర్ మైండ్స్ కళాశాలలో బుధవారం మాదకద్రవ్యాల వినియోగం వల్ల వచ్చే నష్టాలపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. డ్రగ్స్ వినియోగంపై విద్యార్థులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ ఆరోగ్యరాజు, మాస్టర్ మైండ్ డైరెక్టర్ మట్టుపల్లి మోహన్ పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రమాణం చేయిస్తున్న డీఎస్పీలు అరవింద్, శ్రీనివాసరెడ్డి

సాంఘిక దురాచారాలపై పెరియర్ రామస్వామి పోరాటం

గుంటూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని సాంఘిక దురాచారాలపై దశాబ్దాల కిందటే పెరియార్ రామస్వామి పోరాటం చేశారని ఏపీ రజక జన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు తెలిపారు. లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం పెరియార్ రామస్వామి 52వ వర్ధంతి జరిగింది. ఆయన మాట్లాడుతూ, సమాజంలో అణిగారిన వర్గాల హక్కుల కోసం, సాంఘిక సమానత్వం కోసం ఉద్యమించిన గొప్ప సంఘ సంస్కర్త పెరియార్ అని కొనియాడారు.

వినియోగదారుల రక్షణ చట్టం అమల్లో అలసత్వం

● సంఘం ప్రధాన కార్యదర్శి టీవీ కృష్ణమూర్తి

గుంటూరు(విద్య) డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల రక్షణ చట్టం అమల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అలసత్వం స్పష్టంగా కనబడుతోం దని గుంటూరు వినియోగదారుల సంఘం ప్రధాన కార్యదర్శి టీవీ కృష్ణ మూర్తి విమర్శించారు. జాతీయ వినియోగదారుల రక్షణ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక నగరంపాలెం ప్రజ్ఞా పాఠశాలలో వినియోగదారుల సమావేశం నిర్వహించారు. కృష్ణమూర్తి మాట్లాడుతూ కందిపప్పు దగ్గర నుంచి పెట్రోలు ఉత్పత్తుల వరకు నిత్యజీవితంలో మనిషి వాడు కునే ప్రతి వస్తువు నాణ్యత, తూనిక కొలతల్లో పారదర్శకత లోపిస్తున్నదన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షురాలు జూపూడి హైమావతి, ప్రజ్ఞ స్కూల్ కరస్పాండెంట్ నాయుడు చక్రనాగ్, డైరెక్టర్ నాయుడు కోటేశ్వరరావు, మేడూరి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

క్రికెట్ చాంపియన్ గుంటూరు జిల్లా జట్టు

విజయవాడ (స్పోర్ట్స్), డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్కూల్స్ గేమ్స్ ఫెడ రేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నున్నలోని గ్రీన్ హిల్స్ మైదానంలో జరుగుతున్న అండర్-17 బాలికల అంతర్ జిల్లాల క్రికెట్ చాంపియన్‌షిప్ లో గుంటూరు జిల్లా జట్టు విజేతగా నిలిచింది. చిత్తూరు ద్వితీయ, కర్నూ లు జట్టు మూడో స్థానంలో నిలిచాయి. బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్ లో గుంటూరు జట్టు చిత్తూరుపై 16పరుగుల తేడాతో విజయం సాధిం చింది. అనంతరం జరిగిన బహుమతులు ప్రదానోత్సవంలో వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ కార్యదరిశ, కరస్పాండెంట్ నారెడ్ల సత్యనారాయణ రెడ్డి పాల్గొని అందజేశారు. కార్యక్రమంలో వికాస్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ నక్కబోయిన గోపాలకృష్ణ, జిల్లా కార్యదర్శి టి.శ్రీలత, కృష్ణా జిల్లా కార్యదర్శి జి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆ రెండు పదాలు వాడడం తప్పే





శివాజీ

'దండోరా' చిత్రం ప్రీ రిలీజ్ వేడుకలో నేను ఆ రెండు పదాలు వాడి ఉండకూడదు. ఆ రోజు వేదికపై ఉన్న నా తోటి నటీనటులు, ఆడబిడ్డలకు క్షమాపణలు. నేనలా మాట్లాడిన కాసేపటికే నా తప్పు తెలుసుకున్నాను. వెంటనే నా భార్య, కొడుకుకి సారీ చెబుతూ మెసేజ్ చేశాను. అయితే, హీరోయిన్ల వస్త్రధారణపై నేను మాట్లాడిన మాటలకు కట్టుబడి ఉన్నాను' అని నటుడు శివాజీ అన్నారు. ఇటీవల 'దండోరా' ప్రీ రిలీజ్ వేడుకలో చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై బుధవారం చిత్ర బృందం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో వివరణ ఇచ్చారు శివాజీ. 'ఫలానా డ్రెస్‌లు మాత్రమే వేసుకోవాలని చెప్పడానికి నేనెవర్ని. సినిమాల వల్లే చెడిపోతున్నారని అంటారు, సినిమాను ఎవ్వరూ తప్పుగా అనకూడదనే ఉద్దేశంతోనే అలా మాట్లాడాల్సి వచ్చింది. షాపింగ్ మాల్స్ దగ్గర ఇబ్బంది పడ్డ నిధి అగర్వాల్, సమంత గురించే అలా మాట్లాడాను. నా మాటలను కొందరు మహిళా కమిషన్ వరకూ తీసుకెళ్లారు. నేను మరోసారి క్షమాపణలు చెప్పమన్నా చెప్తాను. ఈ నెల 27న వెళ్లి క్షమాపణ లేఖ కూడా ఇస్తాను. చిత్ర పరిశ్రమలో నేను వాడిన పదాల కంటే పెద్దవి ఎవరూ వాడలేదా? అసలు అనసూయ ఈ విషయంలోకి ఎందుకు వచ్చారు? నేను ఆమెను ఒక్క మాట కూడా అనలేదు కదా. త్వరలోనే మీ రుణం తీర్చుకునే అవకాశం నాక్కూడా రావాలని కోరుకుంటున్నాను. సమాజంలో ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు నేను తప్పకుండా స్పందిస్తాను. నన్ను దోషిగా సమాజం ముందు నిలబెట్టాలనుకున్న వాళ్లకు క్షమాపణలు' అని అన్నారు.

తప్పు నాది కాదు మీ ఆలోచనది

హైదరాబాద్‌లోని లులు మాల్‌లో నిధి అగర్వాల్‌ను అభిమానులు చుట్టుముట్టిన ఘటనను శివాజీ తన మాటల్లో పదే పదే ప్రస్తావిస్తూ చర్చలోకి లాగుతున్నారు. 'ఒక వేళ ఆ సమయంలో ఆమె బట్టలు జారితే, ఆ వీడియోలు ఇంటర్నెట్‌లో జీవితాంతం ఉండిపోవా?' అని ప్రశ్నిస్తుండడంతో ఆయన మాటలు బాధితురాలినే దోషిగా నిలబెట్టేలా ఉన్నాయనే విమర్శలు వచ్చాయి. బుధవారం శివాజీ వ్యాఖ్యలకు నిధి అగర్వాల్ ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ ద్వారా పరోక్షంగా, చాలా స్పష్టంగా కౌంటర్ ఇచ్చారు. జరిగిన తప్పును సరిదిద్దాల్సింది పోయి, బాధితులను నిందించడం అనేది ఒక రకమైన మోసపూరిత ధోరణి అని ఆమె అభిప్రాయపడ్డారు. దుస్తులు అనేవి వ్యక్తిగత అభిరుచిని ప్రతిబింబిస్తాయి, ఎవరో చేసిన తప్పుకు మహిళల వస్త్రధారణను సాకుగా చూపడం సరికాదని పేర్కొన్నారు. ఇండస్ట్రీలో ఇటువంటి తిరోగమన ఆలోచనలు ఎదురైనప్పుడు మహిళా లోకం తరపున గొంతు వినిపించడం అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు.

మీ సాయం నాకు అక్కర్లేదు: అనసూయ

శివాజీ తనపై చేసిన వ్యాఖ్యలపై అనసూయ స్పందించారు. 'మీ సాయం నాకు అక్కర్లేదు. ప్రీ రిలీజ్ వేడుకలో మీరు మాట్లాడిందే మీ నిజ స్వరూపం. ఇప్పుడు కేవలం సానుభూతి పొందడానికి ప్రయత్నిస్తున్నారు. నాపై కామెంట్ చేసిన వారితో పాటు ప్రెస్‌మీట్‌లో మాట్లాడిన పెద్ద వ్యక్తికి కూడా నా లాయర్ నుంచి నోటీసులు వస్తాయి' అని పోస్టు పెట్టారు.

సినిమా టికెట్ రేట్లకు ఒకే జీవో



ఏపీ మంత్రి దుర్గేశ్

టికెట్ ధరల పెంపునకు సంబంధించి అన్ని సినిమాలకు వర్తించేలా ఒకే సమగ్ర జీవోను త్వరలో తీసుకురావాలని భావిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. బుధవారం అమరావతి సచివాలయంలో జరిగిన సినిమా టికెట్ ధరల హేతుబద్ధీకరణ కమిటీ సమీక్షా సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇప్పటి వరకు పాత జీవో, సినిమా బడ్జెట్ ప్రకారం టికెట్ రేట్లు పెంచుతున్నామని, ఇక నుంచి అలా కాకుండా ఒక నూతన విధానాన్ని రూపొందించాలని నిర్ణయించామన్నారు. ప్రతి సినిమా బడ్జెట్‌ను బట్టి విడివిడిగా జీవోలు ఇచ్చే పద్ధతికి స్వస్తి పలికి, ఒకే విధానం కింద టికెట్ ధరలు ఉంటేలా చర్యలు తీసుకుంటామన్నారు. *అమరావతి (ఆంధ్రజ్యోతి)*

ఈషా మిమ్మల్ని వెంటాడుతుంది



శ్రీవిష్ణు

'హారర్ సినిమాలు ఇచ్చే అనుభూతి చాలా కాలం గుర్తుండిపోతుంది. 'ఈషా' చిత్రం కూడా మిమ్మల్ని చాలా కాలం వెంటాడుతుంది' అని కథానాయకుడు శ్రీవిష్ణు అన్నారు. త్రిగుణ్, అఖిల్ రాజ్, హెబ్బా పటేల్ నటించిన 'ఈషా' నేడు విడుదలవుతోంది. శ్రీనివాస్ మన్నె దర్శకత్వంలో ఫిల్మ్ ఛాంబర్ కార్యదర్శి కేఎల్ దామోదరప్రసాద్ సమర్పణలో హేమ వేంకటేశ్వర రావు నిర్మించారు. బన్నీ వాసు, వంశీ నందిపాటి థియేట్రికల్‌గా విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో శ్రీవిష్ణు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

గుర్తుండిపోయేలా ఉంటుంది



ప్రదీప్ అద్వైతం

'చరిత్రలోని బైరాన్‌పల్లి ఘట్టాన్ని సినిమాటిక్‌గా చూపించాలని చేసిన ప్రయత్నమే 'ఛాంపియన్' అని ప్రదీప్ అద్వైతం అన్నారు. శ్రీకాంత్ తనయుడు రోషన్ కథానాయకుడిగా ఆయన తెరకెక్కించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. జీ స్టూడియోస్ సమర్పణలో ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్, స్వప్న సినిమాస్ బ్యానర్లు నిర్మించాయి. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను మీడియాతో ముచ్చటించారు ప్రదీప్ అద్వైతం. 'చరిత్రకు కొంచెం ఫిక్షన్‌ను జతచేసి చేసిన చిత్రమే 'ఛాంపియన్'. కథ మొత్తం కథానాయకుడు మైఖేల్ పాయింట్ ఆఫ్ వ్యూలో సాగుతుంది. చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఇందులో నటించడం కోసం ఆయన మూడేళ్లు నిరీక్షించారు. తన నటన అద్భుతంగా ఉండబోతోంది. చాలా కాలం గుర్తుండిపోయేలా చిత్రం ఉంటుంది' అని చెప్పారు.

పోలవరం.. 2027 జూన్‌కల్లా పూర్తికావాలి

» పీపీఏ సీఈవో యోగేశ్ నిర్దేశం

అమరావతి/పోలవరం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టును 2027 జూన్‌నాటికి పూర్తి చేయాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ) ముఖ్య కార్యనిర్వహణాధికారి(సీఈవో) యోగేశ్ పైథాంకర్ దిశానిర్దేశం చేశా రు. సీఈవోగా బాధ్యతలు స్వీకరించాక తొలిసారిగా బుధవారం ప్రాజెక్టు ప్రాంతంలో ఆయన పర్యటించారు. నేరు గా ముంపు ప్రాంతాలకు వెళ్లారు. నిర్వాసితులతో మాట్లాడారు. సహాయ పునరావాసం అందుతున్న తీరును వారిని, అధికారులను కూడా అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో రెండు దఫాలుగా దాదాపు రూ.2వేల కోట్లను నిర్వాసితుల ఖాతాల్లో ప్రాజెక్టు అధికారులు ఆయనకు తెలిపారు. ఆ తర్వాత యోగేశ్ బృందం ప్రాజెక్టు ప్రాంతానికి చేరుకుంది. మధ్యాహ్నం రెండు గంటలకు ప్రాజెక్టు స్పిల్‌వే, గ్యాప్-1, 2 ప్రాంతాలను.. ఎగువ, దిగువ కాఫర్ డ్యాంల వద్ద బట్రస్ డ్యాం, డయాఫ్రం వాల్ నిర్మాణాన్ని, కాంక్రీటు నాణ్యత ల్యాబ్‌లను బృందం సభ్యులు పరిశీలించారు. డయాఫ్రం వాల్ పనులు 83 శాతం పూర్తి కావడం.. ఎర్త్ కమ్ రాక్‌ఫిల్(ఈసీఆర్‌ఎఫ్) డ్యాం పనులు 14 శాతం దాకా జరగడంపై యోగేశ్ సంతృప్తి వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు ఢిల్లీ వచ్చిన ప్రతిసారీ పోలవ రం ప్రాజెక్టును 2027 జూన్ నాటికి పూర్తి చేస్తామని స్పష్టం చేస్తున్నారని గుర్తుచేశారు. కేంద్రం సైతం ప్రాజెక్టును త్వరగా పూర్తిచేసే ఉద్దేశంతో ఉందన్నారు. డయా ఫ్రం వాల్‌కు సంబంధించి ఇంకో 17 శాతం పనులే మిగిలి ఉన్నందున.. మరోవైపు సమాంతరంగా ఈసీఆర్‌ఎఫ్ డ్యాం పనులూ చేపడుతున్నందున 2027 జూన్ లక్ష్యాన్ని చేరుకోవలసిందేనని స్పష్టం చేశారు. అనంతరం పోలవరం జల విద్యుత్కేంద్రాన్ని సందర్శించారు. ఇప్పటికే మూడు యూ నిట్లు సిద్ధమయ్యాయని.. మిగిలిన పనులన్నీ 2027 నాటికి పూర్తి చేస్తామని కాంట్రాక్టు సంస్థ వెల్లడించింది. అదేవిధంగా కుడి, ఎడమ ప్రధాన కాలువల కనెక్టివిటీ టన్నెళ్ల పనులనూ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి పనినీ పూర్తి చేసేందుకు నిర్దేశించిన గడువు, ఇతర వివరాలను, నిర్మాణాల పురోగతిని మేఘా సీవోవో వివరించారు. 2027లో గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్టు పూర్తి చేయాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకుని పను లు వేగవంతం చేస్తున్నామని తెలిపారు. కేం ద్రం పోలవరాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని.. ఎలాంటి జాప్యం లేకుండా నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం పనులు పూర్తి చేయాలని అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులకు సీఈవో సూచించారు.

నాడు జగన్ చేతులెత్తేశారు: నిర్వాసితులు

మొదట పీపీఏ సీఈవో యోగేశ్ బృందం పునరావాస గ్రామాలను సందర్శించింది. ఎల్ఎన్‌డీపేట సమీపంలో ఉన్న కొండ్రుకోట కాలనీలో మౌలిక వసతులను.. పాఠశాల, అంగన్వాడీ సెంటర్, సచివాలయ భవనాలను పరిశీలించి నిర్వాసితులతో మాట్లాడారు. వైసీపీ హయాంలో పరిహా రం చెల్లించకపోవడంపై యోగేశ్ ఆరా తీశారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు గోదావరి వరదల సమయంలో ముం పు ప్రాంతాలను సందర్శించారని.. కొంత మంది నిర్వాసితులను మాత్రమే కలిశారని వారు తెలిపారు. కేంద్రం నిధులిస్తేనే పరిహారం చెల్లించగలనని.. లేదంటే తానేమీ చేయలేనంటూ ఆయన చేతులెత్తేశారని చెప్పారు.

గిరిజనుల హక్కులకు రాజ్యాంగ రక్షణ

» 'పెసా' మహోత్సవ్ ముగింపు సభలో

కేంద్ర పంచాయతీరాజ్ సహాయ మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్



అలరించిన సాంస్కృతిక కార్యక్రమం




వర్చువల్‌గా మాట్లాడుతున్న కేంద్ర మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్

విశాఖపట్నం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల హక్కులకు రాజ్యాంగ రక్షణ ఉందని కేంద్ర పంచాయతీరాజ్ సహా య మంత్రి ఆచార్య ఎస్.పి.సింగ్ బఘేల్ అన్నారు. గిరిజనులకు రాజ్యాంగం ద్వారా లభించిన హక్కుల పరిరక్షణకు క్షేత్రస్థాయిలో కేంద్రం అన్నిరకాల చర్యలు తీసుకుంటుందన్నారు. 'పెసా' మహోత్సవ్ ముగింపు కార్య్ర కమం బుధవారం విశాఖ పోర్టు స్టేడియంలో నిర్వహించగా...కేంద్రమంత్రి వర్చువల్‌గా పాల్గొని మాట్లాడుతూ నీరు, అడవులు, భూమి, సహజ వనరులపై గిరిజనులకు ఉన్న హక్కులకు రాజ్యాంగం రక్షణ కల్పిస్తుందన్నారు. గ్రామస్థాయిలో తయారుచేసిన ప్రణాళికలో స్థానిక అవసరాలు, సంప్రదాయాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. వికసిత్ భారత్-2047 సాధించడానికి గిరిజన సమాజం పురోగతి చాలా కీలకమని పేర్కొన్నారు. కేంద్ర పంచాయతీరాజ్ కార్యదర్శి వివేక్ భరద్వాజ్ ప్రత్యక్షంగా పాల్గొని మాట్లాడుతూ స్థానిక సంస్థలకు సాధికారత కల్పించడం ద్వారా సమాజం నేతృత్వంలోని నిర్ణయాలు తీసుకునేందుకు పెసా చట్టం దీర్ఘకాలంగా పనిచేస్తోందన్నారు. పెసా గ్రామ సభల్లో తీసుకున్న నిర్ణయాలు దేశంలోని ప్రజాస్వామ్య స్వరూపాన్ని ప్రతిబింబిస్తాయన్నారు. రాష్ట్ర పంచా యతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ మాట్లాడు తూ షెడ్యూల్డ్ ప్రాం తాల వారికి సాధికారిత కల్పించి, వారి జీవితాలను మెరుగుపర్చడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ సందర్భంగా పెసా శిక్షణ మార్గదర్శకాలు, హిమాచల్ ప్రదేశ్‌లోని కిన్నౌరి జిల్లాపై ముద్రించిన పుస్తకాలను భరద్వాజ్, శశిభూషణ్‌కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేంద్ర పంచాయతీరాజ్ సంయుక్త కార్యదర్శి ముక్తా శేఖర్, రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ, రాష్ట్ర ఐఆర్‌డీ, పీఆర్ కమిషనర్ రేవు ము త్యాలరాజు, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం జిల్లాల కలెక్టర్లు దినేష్‌కుమార్, హరేంధిరప్రసాద్, ఇతర అధికారులు మాట్లాడారు. పెసా మహోత్సవ్ లో భాగంగా పది రా ష్ట్రాలకు చెందిన గిరిజన కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కబడ్డీ, విలువిద్య, 10కే రన్ విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు.

స్క్రబ్ టైఫస్‌తో బాపట్ల జిల్లాలో యువకుడు మృతి

కర్లపాలెం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్క్రబ్ టైఫస్ వ్యాధితో బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం పెదపులుగువారిపాలెం పంచాయతీ పరిధిలోని చిలకలకాలనీకి చెందిన ఉప్పు నాగబాబు(21) అనే యువకుడు మంగళవారం మృతి చెందాడు. వ్యవసాయం పనులు చేస్తూ జీవనం సాగించే నాగబాబు ఈ నెల 17న జ్వరం బారిన పడ్డాడు. తొలుత స్థానికంగా ఉన్న ఆర్ఎంపీ వద్ద చికిత్స పొందినా ఫలితం లేకపోవడంతో..ఈ నెల 21న కుటుంబసభ్యులు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ నిర్వహించిన వైద్య పరీక్షల్లో నాగబాబుకు స్క్రబ్ టైఫస్‌గా నిర్ధారించారు. చికిత్స పొందుతూ నాగబాబు మృతి చెందిన విషయం తెలిసి బుధవారం డీఎంహెచ్‌వో విజయమ్మ కాలనీని సందర్శించారు. వ్యాధిపై ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వ వైద్యాధికారులను సంప్రదిస్తే ప్రాణాపాయం లేకుండా నయం చేసుకోవచ్చని ప్రజలకు అవగాహన కల్పించారు.







ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
గురువారం • 25 డిసెంబరు 2025



అతిథులకు ఆహ్వానం

క్రిస్మస్ శుభాకాంక్షలు చెప్పేందుకు స్నేహితులు, బంధువులు ఇంటికి వస్తుంటారు. కాబట్టి అతిథులను సాదరంగా ఆహ్వానించేందుకు చేయాల్సిన ఏర్పాట్లతోపాటు ఇంటిని అందంగా ఎలా అలంకరించాలో తెలుసుకుందాం...



ఇల్లు అందంగా ఇలా..

- క్రిస్మస్ శోభ ఉట్టిపడేలా శాంటాక్లాజ్, రెయిన్ డీర్, స్నోమెన్, స్నోఫ్లేక్స్ క్యాండీ కేన్స్, బెల్స్, స్టార్స్, ఏంజెల్స్ లాంటివాటితో ఇంటిని అలంకరించాలి. వీటిలో ఎక్కువగా ఎరుపు, ఆకుపచ్చ, నీలం, సిల్వర్ వైట్, గోల్డెన్ ఎల్లో రంగులు ఉండేలా చూసుకోవాలి.
- ఇంట్లో అక్కడక్కడా రంగు రంగుల క్యాండిల్స్ ఏర్పాటు చేయాలి. ప్లెయిన్, సెంటెడ్, నావెల్టీ క్యాండిల్స్... ఇంటిని రిచ్‌గా మారుస్తాయి. కిటికీల్లో, అరల్లో ఎలక్ట్రిక్ క్యాండిల్స్‌ను పెట్టవచ్చు. క్యాండిల్ ట్రీ లైట్స్ కూడా ఇంటికి అదనపు శోభనిస్తాయి.
- ఇంటి సింహద్వారానికి క్రిస్మస్ గార్లండ్‌ను తగిలిస్తే చూడడానికి బాగుంటుంది. కాస్త ఖరీదు ఎక్కువైనప్పటికీ లైవ్ గ్రీనరీ గార్లండ్‌ను తెచ్చుకుంటే ప్రత్యేకంగా ఉంటుంది. అదే ఆర్టిఫీషియల్ గార్లండ్స్ అయితే ఏటా వాడుకోవచ్చు. వీటికి లైట్ స్ట్రింగ్స్‌ను కూడా జోడించవచ్చు. గార్లండ్‌కు గోల్డ్ రోపింగ్‌ను జతచేస్తే మరింత ఆకర్షణీయంగా కనిపిస్తుంది.
- గుమ్మానికి ఇరుపక్కలా రంగు రంగుల ఫాయిల్ పేపర్లతో చుట్టిన పొయిన్సెటియా పాట్‌లను పెడితే అందంగా ఉంటుంది. అలాగే ఇంటి ముందు పెద్ద స్టార్‌ను వేలాడదీస్తే కళగా ఉంటుంది.
- ఇంటికి క్రిస్మస్ కళను పెంచడంలో రీత్స్ ముందుంటాయి. ప్రస్తుతం ఎన్నో రకాల రీత్స్ లభ్యమవుతున్నాయి. తలుపులకు, కిటికీలకు, మ్యాంటిల్ మీద రీత్స్‌ను తగిలిస్తే అహ్లాదకరంగా ఉంటుంది. వీటిని రంగు రంగుల రిబ్బన్స్‌తో అలంకరిస్తే అందరి దృష్టి వాటిమీదే ఉంటుంది. అలాగే ఇంట్లో అక్కడక్కడ క్రిస్మస్ స్వాగ్స్‌ను అలంకరిస్తే పండుగ శోభ ఉట్టిపడుతుంది.

క్రిస్మస్ ట్రీ...

- హాల్లో అందరికీ కనిపించేలా క్రిస్మస్ ట్రీని ఏర్పాటు చేయాలి. దానికి గుండ్రని గ్లాస్ బాల్స్ రంగురంగుల స్టార్స్, నావెల్టీ ఆర్నమెంట్స్ అలంకరించాలి. వివిధ సైజుల్లో వెండి, బంగారు వర్ణాల్లో ఉండే ఆర్నమెంట్స్.. క్రిస్మస్ ట్రీకి గ్రాండ్ లుక్‌నిస్తాయి. చుట్టూరా ఫాదర్ జోసెఫ్, మేరీ మాత, బేబీ జీసెస్, దేవదూతలు, మేకలు, గొర్రెలు, పవువుల కాపరుల బొమ్మలు అరేంజ్ చేయవచ్చు. ఎదురుగా ఎరుపు, ఆకుపచ్చ ఫాయిల్ పేపర్లతో ఉన్న పోయిన్సెటియా పాట్‌లు పెడితే అందంగా ఉంటుంది. క్రిస్మస్ ట్రీకి లైటింగ్‌ను కూడా అరేంజ్ చేస్తే రాత్రిపూట చూడడానికి బాగుంటుంది.

ఆతిథ్యం...

- పండుగ రోజున ఇంటికి వచ్చిన బంధు మిత్రులకు కేక్‌లు, కుకీలు, హెల్దీ డ్రింక్‌లతో స్వాగతం చెప్పవచ్చు. అందుకు తగ్గ ఏర్పాట్లను ముందుగానే చేసుకోవాలి.
- డైనింగ్ టేబుల్ మీద అతిథులకు వడ్డించాల్సిన మీల్స్, వాటర్ బాటిల్స్, ఫ్రూట్స్, స్వీట్స్‌ను అందంగా సర్దాలి. మధ్య మధ్యలో పూల గుత్తులు, క్యాండిల్స్ అమరిస్తే ప్రత్యేకంగా ఉంటుంది.



బహుమతులు

- అతిథులకు ఇవ్వాల్సిన బహుమతులను ముందుగానే అందంగా ప్యాక్ చేసి క్రిస్మస్ ట్రీ వద్ద సర్దిపెట్టాలి. అందరికీ ఉపయోగపడేవాటిని మాత్రమే బహుమతులుగా ఎంపిక చేసుకోవాలి. న్యూ ఇయర్ క్యాలెండర్స్, డైరీస్, డ్రై ఫ్రూట్స్ బాక్స్‌లు, మంచి పుస్తకాలు, పెర్ఫ్యూమ్ బాటిల్స్, అందమైన పెన్స్, రంగురంగుల పౌచ్‌లు ఇవ్వవచ్చు. చిన్న పిల్లలకు హెల్దీ చాక్లెట్ బార్స్, కలర్ పెన్సిల్స్, డ్రాయింగ్ బుక్స్, కామిక్స్, స్టోరీ బుక్స్ లాంటివి ఇస్తే బాగుంటుంది.

మోకాళ్ల నలుపును వదిలించండిలా...

బడికి వెళ్లే పిల్లలకు మోకాళ్లు నల్లగా మారడం చూస్తూ ఉంటాం. ఈ సమస్యను తీర్చే ఇంటి చిట్కాలివే...

- రోజూ మోకాళ్ల మీద కొద్దిగా షియా బటర్ లేదంటే మామూలు వెన్న రాసి సున్నితంగా మర్దన చేయాలి. దీనివల్ల రక్తప్రసరణ మెరుగై మోకాళ్ల రంగు తిరుగుతాయి.
- కలబంద జెల్‌తో మోకాళ్ల మీద మర్దన చేస్తే అక్కడ పేరుకున్న మృతకణాలు తొలగి మంచి ఫలితం కనిపిస్తుంది.
- పిల్లలకు బిగుతుగా ఉండే ప్యాంట్లు, లెగ్గింగ్స్ వేయకూడదు. వీటివల్ల మోకాళ్లమీద చర్మం రాపిడికి గురై నల్లబడే అవకాశం ఉంటుంది.
- చిన్న గిన్నెలో నాలుగు చెంచాల కొబ్బరి నూనె లేదా నువ్వుల నూనె తీసుకుని గోరువెచ్చగా వేడిచేయాలి. పిల్లలు రాత్రి పడుకునేముందు మోకాళ్లమీద ఈ నూనెను రాసి సున్నింతంగా రుద్దాలి. రెండు రోజుల్లో మోకాళ్లు ఛాయగా మారతాయి. ఇలా ఆలివ్ ఆయిల్‌ను కూడా రాయవచ్చు.
- ఒక కప్పు పుల్లటి పెరుగులో ఒక చెంచా శనగ పిండిని కలిపి మోకాళ్లకు పట్టించాలి. పావుగంటసేపు ఆరనిచ్చి తరువాత మెల్లగా మర్దన చేస్తూ పిండిని తొలగించాలి. ఆపైన గోరువెచ్చని నీటితో కడిగేస్తే మోకాళ్ల నలుపుదనం తగ్గుతుంది.
- మోకాళ్ల మీద తరచూ గ్రీన్ టీ లేదా బ్లాక్ టీ నీళ్లు చిలకరించి మర్దన చేసినా ప్రయోజనం కనిపిస్తుంది.
- చిన్న గిన్నెలో రెండు చెంచాల ఓట్‌మీల్ పొడి, రెండు చెంచాల ఫ్రెష్ క్రీమ్, ఒక చెంచా తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని మోకాళ్ల మీద రాసి సున్నితంగా మర్దన చేయాలి. ఆపైన గోరువెచ్చని నీటితో కడిగేస్తే సమస్య తీరుతుంది.
- పిల్లలు బడికి లేదా ఆడుకోడానికి బయటికి వెళ్లేటప్పుడు మోకాళ్ల మీద కొద్దిగా మాయిశ్చరైజర్ రాసినా ఫలితం ఉంటుంది.



స్ఫూర్తి

బడి రాత మార్చారు

ఎక్కడ చూసినా చెత్తచెదారం... పశువుల సంచారం... బుర్రా వెంకటనాగలక్ష్మి బదిలీపై వచ్చేనాటికి ప్రకాశం జిల్లా తోటవెంగన్నపాలెం మండల ప్రజాపరిషత్ పాఠశాల దుస్థితి ఇది. ఆరుగురే విద్యార్థులు... అధ్వాన్నమైన పరిసరాలు... చూసి చలించిన ఆమె... మూతపడే దశలో ఉన్న పాఠశాల ముఖచిత్రాన్నే మార్చేశారు. సొంత డబ్బు ఖర్చు చేసి... వసతులు కల్పించడమే కాదు... విద్యార్థుల సంఖ్యను కూడా పెంచి... ఆదర్శంగా నిలిచిన ఈ ఉపాధ్యాయురాలిని 'నవ్య' పలుకరించింది.



“నేను గతంలో ప్రకాశం జిల్లా కందులూరు పాఠశాలలో పనిచేసే దాన్ని. ఈ ఏడాది జూన్ మాసంలోనే తాళ్లూరు మండలం తోటవెంగన్నపాలెంలోని 'మండల ప్రజాపరిషత్ పాఠశాల'కు బదిలీ అయ్యాను. ఇక్కడకు వచ్చినప్పుడు బడి పరిస్థితి చూసి చాలా బాధపడ్డాను. ప్రహరీ, సరైన మరుగుదొడ్లు లేవు. అపరిశుభ్రమైన పరిసరాలు, తరచూ వచ్చిపోయే పశువులు. అన్నిటికీ మించి విద్యార్థుల సంఖ్య నన్ను కలవరపెట్టింది. నేను వచ్చేనాటికి ఇక్కడ కనిపించింది ఆరుగురే విద్యార్థులు. మూతపడే స్థితిలో ఉంది ఈ బడి. పట్టించుకొనేవారే లేరు. ఆ రోజే నిర్ణయించుకున్నా... ఈ పరిస్థితిలో మార్పు తేవాలని. పాఠశాలను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు నావంతు కృషి చేయాలని.

సొంత నిధులతో...

మండలంలో మారుమూల గ్రామం... తోటవెంగన్నపాలెం. తమ పిల్లలను బడికి పంపడానికి తల్లిదండ్రులు ఇష్టపడేవారు కాదు. స్థానికంగా ఐదో తరగతి లోపు పిల్లలను గుర్తించి, వారి తల్లిదండ్రులతో మాట్లాడాను. 'మీ పిల్లల బాధ్యత నాది' అని చెప్పి వారిని ఒప్పించాను. పిల్లలు రావాలన్నా, ప్రశాంతంగా చదువుకోవాలన్నా ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలి. దాని కోసం యాభై వేలకు పైగా సొంత డబ్బుతో... ముందుగా పశువులు రాకుండా చుట్టూ ఇనుప కంచె వేయించాను. గేటు పెట్టించాను. గోడలకు సున్నాలు కొట్టించాను. నిరుపయోగంగా పడివున్న మరుగుదొడ్లకు తలుపులు ఏర్పాటు చేయించాను. ఈ అభివృద్ధి పనులవల్ల పాఠశాల కొత్త కాంతులు అద్దుకుంది.

క్రమశిక్షణ నేర్పి...

బడిలో మారిన వాతావరణం చూసి, తల్లిదండ్రులు తమ పిల్లలను పంపడం ప్రారంభించారు. విద్యార్థులకు క్రమశిక్షణ అలవాటు చేసి, క్రమం తప్పకుండా పాఠాలు బోధిస్తున్నాను. ఇది సత్ఫలితాలను ఇచ్చింది. విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరిగింది. నాడు ఆరుగురు విద్యార్థులున్న పాఠశాలలో నేడు ఆ సంఖ్య 24కు పెరిగింది. ఇది నా ఒక్కరివల్ల సాధ్యమైనది కాదు. దీని వెనుక స్థానిక ప్రజలు, తలిలదండ్రులు, విద్యార్థుల సమష్టి కృషి ఉంది. ప్రైవేటు బడులకు దీటుగా దీన్ని నిలబెట్టాలనేది నా ధ్యేయం. అందుకు నిరంతరం శ్రమిస్తున్నాను. గతంలో స్థానికులు కొందరు తమ పిల్లలను సమీపంలోని తూర్పుగంగవరం పాఠశాలకు పంపేవారు. కొందరు ప్రైవేటు బడులను ఎంచుకున్నారు. అలాంటి పిల్లలను గుర్తించి, వచ్చే విద్యా సంవత్సరంలో మా పాఠశాలలోనే వారిని చేర్పించేలా తల్లిదండ్రులను ఒప్పించాను.



ఆవరణలో పచ్చదనం...

అంతేకాదు... పాఠశాల ఆవరణ మరింత ఆహ్లాదంగా ఉండేందుకు, పర్యావరణంపై చిన్నారులకు అవగాహన కల్పించేందుకు పలు రకాల పండ్ల మొక్కలు నాటించాను. వాటిని సంరక్షించే బాధ్యత విద్యార్థులకు అప్పగించాను. నిరుపయోగంగా ఉన్న బోరుకు మోటార్ బిగించి, స్కూల్లో నీటి వసతిని పునరుద్ధరించగలిగాను. సరైన వసతులు, ప్రశాంతమైన వాతావరణం ఉంటేనే పిల్లలకు మనం చెప్పే పాఠాలు ఒంటబడతాయి. దీని కోసం నావంతు ప్రయత్నం చేస్తున్నాను. సేవగా కాకుండా... దీన్ని ఒక బాధ్యతగా భావిస్తున్నాను. ప్రభుత్వంతో పాటు ప్రజల సహకారం, ఉపాధ్యాయుల అంకితభావం తోడైతే... ప్రభుత్వ బడులు కూడా ప్రైవేటు వాటికి దీటుగా నిలబడతాయి.”

• సుసర్ల నాగేంద్రనాథ్, తాళ్లూరు.

తేగలు తిందాం

చలికాలంలో విరివిగా లభించే తేగల్లో ఎన్నో పోషకాలు ఉంటాయి. తేగలు తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఇవే...

- తేగల్లో పీచుపదార్థాలు ఎక్కువ. ఇవి శీతాకాలంలో మందగించే జీర్ణ శక్తిని పెంచుతాయి. మలబద్ధకాన్ని నివారిస్తాయి. పేగులను శుభ్రం చేస్తాయి. పైల్స్ సమస్యతో ఇబ్బందిపడే వారికి ఇవి ఔషధంలా పనిచేస్తాయి.
- తేగల్లో పొటాషియం, మెగ్నీషియం, కాల్షియం, పాస్ఫరస్, ఐరన్ లాంటి పోషకాలతోపాటు బి, సి విటమిన్లు; యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీరంలో చెడు కొలెస్ట్రాల్‌ను తొలగించి గుండె జబ్బులు రాకుండా చేస్తాయి. రోగనిరోధక శక్తిని పెంపొందించి క్యాన్సర్ కారకాల నుంచి కాపాడతాయి.
- తేగలు తింటుంటే దంతాల మీద పేరుకున్న గార తొలగిపోతుంది. పెద్దల్లో ఎముకలు పెళుసుబారకుండా ఉంటాయి.
- తేగలవల్ల శరీరానికి కావాల్సిన ప్రొటీన్ అందుతుంది. దీంతో కండరాలు బలోపేతమవుతాయి. శరీరంలో హార్మోన్లు, ఎంజైమ్‌లు తగు పాళ్లలో ఉత్పత్తి అవుతాయి. తక్షణ శక్తి లభిస్తుంది.
- తేగల్లో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువ. మధుమేహం ఉన్న వారు కూడా తినవచ్చు. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించి రక్తపోటును తగ్గిస్తాయి.



ప్రసవం తరువాత పొట్ట తగ్గేదెలా..?

కొంతమంది మహిళలకు ప్రసవం తరువాత కూడా పొట్ట ఎత్తుగా కనిపిస్తూ ఉంటుంది. చిన్న చిట్కాలతో దీన్ని తగ్గించుకోవచ్చంటున్నారు నిపుణులు.

- నవజాత శిశువుకు పాలివ్వడం వల్ల తల్లి ఈ సమస్య నుంచి బయటపడవచ్చు. అలాగే వైద్యులు సూచించిన ప్రకారం పొత్తి కడుపునకు బెల్టు పెట్టుకోవడం మంచిది.
- ప్రసవం తరువాత వీలైనంత త్వరగా నడవడానికి ప్రయత్నించాలి. మొదట నెమ్మదిగా నిలబడి అడుగులు వేస్తూ క్రమంగా వేగం పెంచాలి. బిడ్డను ఎత్తుకుని నడవడం వల్ల మంచి ఫలితం కనిపిస్తుంది.
- తరచూ వాము నీళ్లు తాగుతూ ఉంటే పొట్ట త్వరగా కరుగుతుంది. గర్భిణిగా ఉన్నప్పుడు పెరిగిన బరువు కూడా తగ్గుతారు. సోంపు నీళ్లు, జీలకర్ర నీళ్లు కూడా తాగవచ్చు.
- గ్రీన్ టీ, హైబిస్కస్ టీ, చమోమిలే టీ లాంటి హెర్బల్ టీలు తాగడం వల్ల వాటిలోని యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలోని వ్యర్థాలను బయటికి పంపడమే కాకుండా జీవక్రియలను వేగవంతం చేస్తాయి. దీనివల్ల మునుపటి రూపం సొంతమవుతుంది.



ప్రకృతి పాఠాలు



“ఎవరో వచ్చి, ఏదో చేస్తారనే ఎదురుచూపులు వ్యర్థం. మన సమస్యల్ని మనమే పరిష్కరించుకోవాలి” అని చెప్పడమే కాదు... ఆ దిశగా వందలమందికి మార్గనిర్దేశం చేస్తున్నారు పర్యావరణ ఉద్యమకారిణి భావన మీనన్. పులుల భయంతో జనం అనుక్షణం బిక్కుబిక్కుమంటూ గిడపే బంధవ్‌గఢ్ ప్రాంతంలో... విద్యార్థుల్లో చైతన్యం రగిలించి... అడవుల పరిరక్షణకు దోహదం చేస్తున్నారు.

“బడికి వెళ్లడం ప్రాణాలతో చెలగాటమైన ప్రాంతం మధ్యప్రదేశ్‌లోని బంధవ్‌గఢ్. సంజయ్ దుబ్రీ (బంధవ్‌గఢ్) నేషనల్ పార్క్‌ను ఆనుకొని ఉన్న గ్రామాల్లో... పులుల దాడిలో మరణించిన లేదా గాయపడినవారు ప్రతి కుటుంబంలో ఒక్కరైనా ఉంటారు. పదకొండేళ్ల కుమారుణ్ణి పులి దాడిలో కోల్పోయిన ఒక కుటుంబాన్ని కొన్నేళ్ల క్రితం కలిశాను. “మీకు కలిగిన ఈ నష్టానికి బాధ్యత ఎవరిదనుకుంటున్నారు?” అని అడిగాను. “మేము అడవిని నిందించం. అది మాకు ఎంతో ఇస్తోంది” అని ఆ బాలుడి తల్లిదండ్రులు జవాబు ఇచ్చారు. అక్కడ ప్రజలకు అడవి మీద ద్వేషం లేదు. కానీ పులుల దాడులనుంచి తమను ఎలా కాపాడుకోవాలో తెలియని నిస్సహాయత. నేను మూడేళ్ల క్రితం ఆ ప్రాంతంలో అడుగుపెట్టినప్పుడు ఉన్న పరిస్థితి ఇది.

పూల సేకరణ కోసం...

నా స్వస్థలం మహారాష్ట్రలోని పుణే. చదువు పూర్తయిన తరువాత... సుమారు పదేళ్ల నుంచి దేశంలోని వివిధ అటవీ ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణ కోసం పని చేస్తున్నాను. టైగర్ రిజర్వ్ అయిన బంధవ్‌గఢ్ నేషనల్ పార్కును సందర్శించినప్పుడు... ప్రకృతి సౌందర్యం ఎంతగానో నన్ను ఆకర్షించింది. అలాగే ప్రజల దుస్థితిపై తీవ్రమైన ఆవేదన కూడా కలిగింది. 2001 నుంచి 2021 మధ్య దాదాపు 200 మంది పులుల దాడుల్లో ప్రాణాలు పోగొట్టుకున్నారు. రెండువేలకు పైగా పశువులు బలయ్యాయి. బిక్కుబిక్కుమని బతుకుతున్న ప్రజల్లో భయాన్ని పోగొట్టడానికి, భద్రత కల్పించడానికి ఏం చెయ్యాలి? ఇదే ఆలోచన. సమస్య మూలం ఏమిటో గుర్తించడానికి ప్రయత్నించాను. మహువా పువ్వుల సేకరణ ఆ గ్రామ ప్రజలకు ప్రధాన జీవనోపాధి. ఆ పువ్వులు సాధారణ నేల మీద స్పష్టంగా కనిపించవు. కాబట్టి వాటిని సేకరించడం సులువవుతుందనే కారణంతో అడవి నేల మీద మంటలు వేసి కాల్చేస్తూ ఉంటారు. అది పెద్ద ప్రమాదాలకు కూడా కారణమవుతోంది. కొన్నేళ్ళుగా మధ్యప్రదేశ్ అడవుల్లో సంభవించిన 28 వేల కార్చిచ్చుల్లో దాదాపు 77 వేల చదరపు కిలోమీటర్లు నాశనమైంది. అగ్నిప్రమాద భయం వల్ల, అడవులు నాశనం కావడం వల్ల పులులు జనావాసాల మీద పడుతున్నాయి. మనుషులను, పశువులను చంపేస్తున్నాయి.




చైతన్యం కలిగించేలా...

దీనికి అడ్డుకట్ట వేయాలి. ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఎదురుచూడడం కన్నా స్థానికులే తమ సమస్య పరిష్కారానికి పోరాడాలి. అది భవిష్యత్తులో కొనసాగాలంటే పిల్లలు దానిలో ప్రధాన పాత్ర వహించాలి. ఈ ఆలోచనతో... 2024లో ప్రకృతి పాఠశాలను ప్రారంభించాను. బంధవ్‌గఢ్ చుట్టుపక్కల గ్రామాల్లోని విద్యార్థులను భాగస్వాముల్ని చేశాను. నేను, మరికొందరు వాలంటీర్లు... పులుల దాడుల వల్ల నష్టపోయిన కుటుంబాలవారికి కౌన్సెలింగ్ ఇచ్చాం. వారి పిల్లల చదువుకోసం ఆర్థిక సాయం అందించాం. విస్తృతంగా మొక్కల నాటేలా ప్రోత్సహించాం. నేచర్ ఎడ్యుకేషన్ క్యాంపులు, ఫారెస్ట్ వాక్స్, ఇంటింటి అవగాహన కార్యక్రమాలు లాంటివి నిర్వహించాం. ప్రకృతి పాఠశాలలో ప్రకృతి పరిరక్షణ గురించి నేర్చుకున్న పిల్లలను గ్రామాల్లో చైతన్యం కలిగించేలా తీర్చిదిద్దాం.

జూనియర్ ఫైర్ వాచర్స్ స్క్వాడ్...

అడవుల్ని తగలబెట్టడాన్ని నిరోధించడానికి అదే ఏడాది 'జూనియర్ ఫైర్ వాచర్స్ స్క్వాడ్' ఏర్పాటు చేశాం. ఎక్కడైనా మంటలు వేసినట్టు గుర్తిస్తే... వెంటనే స్క్వాడ్‌లోని ఇతర సభ్యులను, తోటి విద్యార్థులను వారు అప్రమత్తం చేస్తారు. మరోవైపు మొహువా పువ్వుల సేకరణలో పాత పద్ధతులను విడిచిపెట్టాలనీ, చెట్ల కింద వస్త్రాలను పరిచి పువ్వులు సేకరించాలనీ, మంటలు పెట్టడం మానాలనీ వారి ద్వారా ప్రచారం చేయిస్తున్నాం. ఈ చర్యలన్నీ మంచి ఫలితాలు ఇచ్చాయి. తమ పిల్లలు చెప్పిన మాటలు తల్లిదండ్రులను ఆలోచింపజేశాయి. అడవుల్లో మంటలు పెట్టే చర్యలు 99 శాతం తగ్గాయని స్వయంగా టైగర్ రిజర్వ్ అధికారులే చెబుతున్నారు. అలాగే ఈ రెండేళ్లలో కొన్ని వేల మొక్కలు నాటించాం. ప్రకృతి పాఠశాలలో రెండో ప్రాజెక్టును ఈ ఏడాది ప్రారంభించాం. ప్రస్తుతం పాతిక గ్రామాలకు చెందిన 326 మంది విద్యార్థులు, 26 మంది టీచర్లు ఈ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. ప్రకృతి శిబిరాలను కూడా వారే నిర్వహిస్తున్నారు. ఇదివరకటిలా పులుల దాడులు దాదాపుగా జరగడం లేదు. దీనికి నావంతుగా దోహదం చేసినందుకు సంతృప్తిగా ఉంది. ఈ స్ఫూర్తిని విద్యార్థులు ఇలాగే కొనసాగిస్తారనీ, అడవులను, తమ భావితరాలను కాపాడుకుంటారనీ నా గట్టి నమ్మకం.”

> 2024లో ప్రకృతి పాఠశాలను ప్రారంభించాను. బంధవ్‌గఢ్ చుట్టుపక్కల గ్రామాల్లోని విద్యార్థులను భాగస్వాముల్ని చేశాను. నేను, మరికొందరు వాలంటీర్లు... పులుల దాడుల వల్ల నష్టపోయిన కుటుంబాలవారికి కౌన్సెలింగ్ ఇచ్చాం. వారి పిల్లల చదువుకోసం ఆర్థిక సాయం అందించాం. విస్తృతంగా మొక్కల నాటేలా ప్రోత్సహించాం.



ముత్యాల ముగ్గు

16 చుక్కలు
2 వరసలు
2 వచ్చేవరకు





బత్తిన సుజాత,
వసంతరాయపురం,
గుంటూరు

మీరు ముగ్గులు బాగా వేస్తారా? అయితే చక్కటి చుక్కల ముగ్గులను కాగితంపై గీసి, రంగులు వేసి మాకు పంపండి! ఎన్ని చుక్కలు, ఎన్ని వరుసలు లాంటి వివరాలను కూడా రాయండి. మీ పేరు, మీ పూర్తి అడ్రస్, పాస్‌పోర్టు సైజు ఫొటో పంపడం తప్పనిసరి. అందమైన ముగ్గులను 'నవ్య'లో ప్రచురిస్తాం.

మా చిరునామా...
నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం,
రోడ్ నం. 70, హుడా హైట్స్, జూబ్లీహిల్స్, హైదరాబాద్ - 33
ఈ-మెయిల్ : features@andhrajyothy.com

పలు విశేషాలు..

- హై స్పీడ్ సెల్యూలర్ బ్రాడ్ బ్యాండ్.
- స్మార్ట్‌ఫోన్‌కు నేరుగా సిగ్నళ్లు.
- వ్యాపార, ప్రభుత్వ అవసరాలకు వినియోగం.
- ర్యాకెట్ పొడవు: 43.5 మీటర్లు
- ఉపగ్రహం బరువు: 6,000 కిలోలు
- 15 నిమిషాల్లోనే నిర్దేశిత లక్ష్యం చేరిక
- భారత భూభాగంలో చేసిన భారీ ప్రయోగం.
- ప్రపంచ అత్యుత్తమ ప్రయోగాల్లో ఇదొకటి.
- మూడు దశల్లో దీనిని చేపట్టారు.
- ఎస్200 బూస్టర్ల నాజిల్స్‌ను నియంత్రించేందుకు ఇస్రో తొలిసారి ఎలక్ట్రో-మెకానికల్ ఆక్టేటర్స్‌ను వినియోగించింది.
- ఇప్పటి వరకు హైడ్రాలిక్ వ్యవస్థను వినియోగించారు.
- కొత్త విధానంతో ఉపగ్రహాలను తేలికగా అంతరిక్షంలోకి చేర్చచ్చు.
- ఎల్‌వీఎం3 ముద్దుపేరు.. 'బాహుబలి'
- ఎల్‌వీఎం3.. 100 శాతం సక్సెస్ రేటు సాధించింది.

ప్రపంచ మార్కెట్‌లోకి భారత్!

తాజా ప్రయోగంతో భారీ వాణిజ్య ఉపగ్రహాల ప్రపంచ మార్కెట్‌లోకి భారత్ ప్రవేశించినట్టయింది. అంతేకాదు, స్పేస్‌ఎక్స్, ఏరియానేస్పేస్, రోస్కోస్మోస్ వంటి దిగ్గజ సంస్థల బిలియన్ డాలర్ల వ్యాపారానికి కూడా భారత్ గట్టి పోటీ ఇవ్వనుంది.



బాహుబలి గ్రాండ్ సక్సెస్!

నిప్పులు చిమ్ముతూ ఎల్‌వీఎం3-ఎం6 నింగికి

భారత అంతరిక్ష రంగ చరిత్రలో 6,000 కేజీల బరువైన అతి భారీ శాటిలైట్ ప్రయోగం ఇదే



సూళ్లూరుపేట, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) చారిత్రక మైలురాయిని తాకింది. వాణిజ్య ఉపగ్రహ ప్రయోగాల్లో అత్యంత భారీ బరువైన ఎల్‌వీఎం3-ఎం6(బాహుబలి)ను విజయవంతంగా ప్రయోగించి రికార్డు సృష్టించింది. అమెరికాకు చెందిన ఏఎస్‌టీ స్పేస్ మొబైల్ సంస్థ కోసం దాదాపు 6,000 కిలోల 'బ్లూబర్డ్ బ్లాక్-2' ఉపగ్రహాన్ని తిరుపతి జిల్లా శ్రీహరికోటలో ఉన్న సతీశ్‌ధవన్ అంతరిక్ష కేంద్రం నుంచి బుధవారం 'లో ఎర్త్ ఆర్బిట్(ఎల్‌ఈవో)లోకి విజయవంతంగా ప్రవేశపెట్టింది. ఈ క్రమంలో ఇస్రో ఎల్వీఎం 3 రాకెట్ ప్రయోగాల్లో తొమ్మిదో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. కాగా, భారత భూభాగం నుంచి ప్రయోగించిన అతిపెద్ద వాణిజ్య ర్యాకెట్ ఇదేనని, ఇది ఈ 'సీజన్ గిఫ్ట్' అని ఇస్రో ఛైర్మన్ నారాయణన్ అభివర్ణించారు. ఈ ఉపగ్రహం ద్వారా ప్రపంచంలో ఎక్కడున్నా.. అంతరిక్షం నుంచే 4జీ, 5జీ వాయిస్, వీడియో కాల్స్, సందేశాలు, స్ట్రీమింగ్, డేటా వంటివాటిని ఎవరైనా.. ఏ సమయంలో అయినా పొందేందుకు అవకాశం ఉంటుంది. అమెరికాకు చెందిన ఏఎస్‌టీ స్పేస్ మొబైల్, ఇస్రోకు చెందిన వాణిజ్య విభాగం న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్(ఎన్ఎస్ఐఎల్‌)ల మధ్య కుదిరిన ఒప్పందం మేరకు ఈ ప్రయోగాన్ని చేపట్టారు. ఎల్‌వీఎం3-ఎం6 ర్యాకెట్.. బుధవారం ఉదయం 8.55 గంటల సమయంలో నిప్పులు చిమ్ముతూ నింగి లోకి దూసుకుపోయింది.

'బ్లూబర్డ్' పేరే ఎందుకు?

ఏఎస్‌టీ స్పేస్‌మొబైల్ సంస్థకు చెందిన ఉపగ్రహానికి బ్లూబర్డ్ బ్లాక్-2 పేరును నిర్ధారించడం వెనుక ఆసక్తికర విషయం ఉంది. గగనంలో విహరించే పక్షులకు హద్దులు లేనట్టే.. ఈ ఉపగ్రహం ద్వారా వచ్చే పుంజాలకు కూడా ఎలాంటి గౌండ్ టెర్మినళ్లు, ప్రత్యేక ఏర్పాట్లు అవసరం లేదు. అంతేకాదు.. పక్షులకు ఎలాంటి స్వేచ్ఛ ఉంటుందో.. అదేవిధంగా ఈ ఉపగ్రహం ప్రపంచ కమ్యూనికేషన్ కనెక్టివిటీకి స్వేచ్ఛగా సిగ్నళ్లను పంపిస్తుంది. అందుకే.. 'బ్లూబర్డ్' పేరు పెట్టారు.



52 రోజుల్లో రెండోది!

'ఎల్ఎంవీ' ఉపగ్రహాల ప్రయోగంలో ఇస్రో వంద శాతం విజయవంతమైంది. నవంబరులో చేపట్టిన తొలి ఎల్‌వీఎం3-ఎం5 ఉపగ్రహం బరువు 4,400 కిలోలు. దీనిని విజయవంతంగా జియోసింక్రనైజ్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్(జీటీవో)లోకి ప్రవేశపెట్టారు. తాజా ఎల్ఎంవీ3-ఎం6 ఉపగ్రహం బరువు 6000 కిలోలు కావడం, కక్ష్యలోకి విజయవంతంగా చేరుకోవడం విశేషం. దీంతో కేవలం 52 రోజుల్లోనే ఇస్రో రెండు ఎల్ఎంవీలు చేపట్టిన ఘనతను సొంతం చేసుకుంది.

90 సెకన్ల ఆలస్యం వెనుక..

వాహక నౌక ఎల్‌వీఎం3-ఎం6ను బుధవారం ఉదయం 8.54 గంటలకే ప్రయోగించాలని ఇస్రో నిర్ణయించింది. అయితే.. సాంకేతికపరమైన కారణాలతో ఈ ప్రయోగం 90 సెకన్లపాటు ఆలస్యమైంది. అనంతరం.. 8.55.30 గంటలకు ప్రయోగాన్ని చేపట్టింది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగానే ఈ జాప్యం జరిగినట్టు ఇస్రో వర్గాలు తెలిపాయి. వాహక నౌక ప్రయాణ మార్గంలో శిథిలాలు, ఇతర ఉపగ్రహాల సంయోగాలు ఉండడంతో ఢీకొనే అవకాశం ఉందని అంచనా వేశామని, అందుకే 90 సెకన్ల ఆలస్యంగా ప్రయోగం చేపట్టినట్టు పేర్కొన్నాయి. ఈ జాప్యం అసాధారణం కాదని, శ్రీహరికోట గగనతలంలో వేల కొద్దీ ఉపగ్రహాలు నిరంతరం ప్రయాణిస్తుంటాయని వివరించాయి.

తగ్గనున్న డిజిటల్ అంతరం!

బ్లూబర్డ్ బ్లాక్-2 ఉపగ్రహంతో ప్రపంచంలోని ఏమూలకైనా బ్రాడ్ బ్యాండ్ సిగ్నళ్లు అందుతాయి. అంతేకాదు.. భవిష్యత్తులో ప్రపంచ దేశాల మధ్య కనెక్టివిటీ మరింత పెరుగుతుంది. మారుమూల ప్రాంతాల నుంచి విశ్వసనీయ కనెక్టివిటీ లేని ప్రాంతాలకు కూడా ఈ ఉపగ్రహం సేవలందించనుంది. అంతేకాదు.. ఈ సేవల కారణంగా ప్రపంచ వ్యాప్తంగా డిజిటల్ అంతరం తగ్గిపోనుంది. అదేవిధంగా అధునాతన ఉపగ్రహ సాంకేతికతతో ప్రపంచ సమాచార వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు రానున్నాయి.

అంతరిక్షం నుంచి నేరుగా..

అమెరికాలోని టెక్సాస్‌కు చెందిన ఏఎస్‌టీ స్పేస్ మొబైల్ సంస్థ బెంగళూరు కేంద్రంగా భారత్‌లో పనిచేస్తోంది. బ్రాడ్ బ్యాండ్ పుంజాలను మధ్యలో ఎలాంటి ప్రత్యేక ఏర్పాటు లేకుండా.. అంతరిక్షం నుంచి నేరుగా స్మార్ట్ ఫోన్లకు అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నేపథ్యంలోనే బ్లూబర్డ్ బ్లాక్-2 ఉపగ్రహ ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. దీనిద్వారా హైస్పీడ్ సెల్యూలర్ బ్రాడ్ బ్యాండ్ నేరుగా స్మార్ట్‌ఫోన్లకు అందుతుంది. అంతేకాదు.. ప్రపంచవ్యాప్తంగా మారుమూల ప్రాంతాలకు కూడా సిగ్నళ్లు చేరుకుంటాయి. స్టార్‌లింక్, వన్ వెబ్ వంటి ఉపగ్రహాలకు సంబంధించి ప్రత్యేకమైన గ్రౌండ్ స్టేషన్‌ను, టెర్మిళ్లను ఏర్పాటు చేయాలి. కానీ, బ్లూబర్డ్ సిస్టమ్‌లో ఇలాంటి ఏర్పాటు అవసరం ఉండదు. పైగా అతిపెద్ద వాణిజ్య సమాచార ఉగ్రహం కావడం విశేషం.

ఉపగ్రహ విశేషాలు ఇవీ..

ఉపగ్రహ వాహక నౌకలో రెండు ఎస్200 సాలిడ్ బూస్టర్లను వినియోగించారు. వీటిద్వారా భారీ మొత్తంలో థ్రస్ట్ అందుతుంది. ఈ బూస్టర్‌ను విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ అభివృద్ధి చేసింది. ఏఎస్‌టీ స్పేస్ మొబైల్ ఇండియా లిమిటెడ్ తాత్కాలిక ఛైర్మన్, ఎండీ పి. మోహన్ ప్రకటన మేరకు.. గత ఏడాది సెప్టెంబరులో బ్లూబర్డ్ ఉపగ్రహాలను ఐదు ప్రయోగించారు. వీటి ద్వారా అమెరికా సహా ఎంపిక చేసిన దేశాలకు సేవలు అందిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 50 మొబైల్ ఆపరేటర్లకు సేవలు అందించేందుకు ఇదే తరహా ఉపగ్రహాలను మరిన్ని ప్రయోగించనున్నారు.



మోదీకి ధన్యవాదాలు: ఏఎస్‌టీ

బ్లూబర్డ్6 ఉపగ్రహ ప్రయోగం విజయవంతం కావడం పట్ల అమెరికాకు చెందిన ఏఎస్‌టీ సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో ఎబెల్ ఎవెల్లన్ హర్షం వ్యక్తం చేశారు. భారీ వాణిజ్య పరమైన అంతరిక్ష ప్రయోగానికి సహకరించిన భారత ప్రధాని నరేంద్ర మోదీకి, ఇస్రో శాస్త్రవేత్తలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుతం తాము వాషింగ్టన్ డీసీలోని కమాండ్ కేంద్రం నుంచి సాధారణ టెలీమెట్రీతో బ్లూబర్డ్6 నియంత్రణలో ఉన్నట్టు పేర్కొన్నారు.

లోకం తీరు



గగన్‌యాన్‌కూ ఇదే రాకెట్

"ఎల్వీఎం3 రాకెట్ ప్రయోగాల్లో నూరు శాతం విజయాలు సాధించాం. ఈ విజయం భవిష్యత్తు ప్రయోగాల నిర్వహణకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది. అతి తక్కువ సమయంలో (52 రోజులు) ఈ రాకెట్‌ను రూపొందించి విజయవంతంగా ప్రయోగించడం వెనుక శాస్త్రవేత్తల శ్రమ ఎంతో ఉంది. భారత భూభాగం నుంచి నింగికెగసిన అతి భారీ రాకెట్ ఇదే. ప్రపంచంలోనే అత్యుత్తమ ప్రయోగాల్లో ఇదొకటి. ఇప్పటికి 34 దేశాలకు చెందిన 434 ఉపగ్రహాలను ప్రయోగించాం. గగన్‌యాన్ కోసం సిద్ధమవుతున్న వేళ ఈ విజయం మరింత ఆత్మవిశ్వాసం కలిగించింది. ఎల్వీఎం3 రాకెట్ ద్వారానే గగన్‌యాన్, చంద్రయాన్-4, 5 ప్రయోగాలు చేపడతాం. ఈ విజ యం దేశప్రజలకు క్రిస్మస్, న్యూఇయర్ కానుక."

– డాక్టర్ వి. నారాయణన్, ఇస్రో ఛైర్మన్

సత్తా చాటాం: మోదీ

న్యూఢిల్లీ, డిసెంబరు 24: బాహుబలి రాకెట్ 'ఎల్‌వీఎమ్2-ఎమ్6' విజయవంతం కావడం పట్ల ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. గగనయాన్ వంటి భవిష్యత్తు ప్రయోగాల కోసం గట్టి పునాదులు పడుతున్నాయన్నారు. హెవీ లిఫ్ట్ లాంచింగ్‌లో మన సత్తాను ఇస్రో ప్రయోగం మరోసారి చాటడంతోపాటు, ప్రపంచ వాణిజ్య రాకెట్ ప్రయోగాల్లో (లాంచ్ మార్కెట్) భారత్ స్థానాన్ని శక్తివంతం చేసిందని వ్యాఖ్యానించారు. 'బాహుబలి' ప్రయోగాన్ని విజయవంతం చేసిన ఇస్రో శాస్త్రవేత్తలకు హోం మంత్రి అమిత్‌షా అభినందనలు తెలిపారు. ఎల్‌వీఎం3-ఎం6ని విజయవంతంగా ప్రయోగించినందుకు ఇస్రో బృందానికి సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. అమెరికాకు చెందిన భారీ కమ్యూనికేషన్ శాటిలైట్ బ్లూబర్డ్ బ్లాక్-2ని విజయవతంగా కక్ష్యలోకి చేర్చి ఇస్రో బృందం తమ సత్తాను చాటుకుందని సీఎం అభినందించారు. రాష్ట్ర మంత్రి లోకేశ్ కూడా ఇస్రో బృందానికి అభినందనలు తెలిపారు

బీఎల్‌వోల గౌరవ వేతనం 12 వేలకు పెంపు

అమరావతి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎన్నికల విధుల్లో కీలకంగా వ్యవహరించే బూత్ స్థాయి అధికారులు(బీఎల్‌వోలు), బీఎల్‌వో సూపర్ వైజర్ల వార్షిక గౌరవ వేతనాలను పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. తాజా ఉత్తర్వుల ప్రకారం బీఎల్‌వోలకు రూ.12 వేల వార్షిక కనీస గౌరవ వేతనం, సూపర్‌వైజర్‌కు రూ.18 వేల గౌరవ వేతనంగా నిర్ణయించారు. అదనంగా ఎస్ఎస్ఆర్, ఎస్ఆర్ తదితర ప్రత్యేక కార్యక్రమాల్లో విధులు నిర్వర్తించే బీఎల్‌వోలకు ప్రత్యేక ప్రోత్సాహకంగా రూ.2 వేలు చెల్లించనున్నారు. ఈ పెరిగిన వేతనాలు 2025 ఆగస్టు 1 నుంచి అమల్లోకి వస్తాయి. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) వివేక్ యాదవ్ బుధవారం ఉత్తర్వులిచ్చారు.

యూరియా దారి మళ్లిస్తే క్రిమినల్ కేసులు

» వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎరువుల నిల్వలపై డీలర్లు తప్పనిసరిగా సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీ రాజశేఖర్ ఆదేశించారు. పంటల అవసరాలకు తగ్గట్టు యూరియా సరఫరా చేస్తున్నా... పంపిణీ, అమ్మకాలు సక్రమంగా లేవంటూ మీడియాలో కథనాలు రావడంపై ఆయన స్పందించారు. బుధవారం వ్యవసాయ శాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీతో కలసి, జాయింట్ కలెక్టర్లు, జిల్లా వ్యవసాయ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కొన్ని చోట్ల అధిక ధరలకు అమ్మడం, మరి కొన్ని చోట్ల మొక్కుబడి తనిఖీలతో సరైన చర్యలు లేకపోవడంపై వ్యవసాయ అధికారులను వివరణ కోరారు. మండలాలు, రైతుసేవా కేంద్రాల వారీగా యూరియా దిగుమతి, అమ్మకం, నిల్వలపై ఆరా తీశారు. 'యూరియా ధరలు, నిల్వల వివరాలను డీలర్లు అందరూ విధిగా ప్రదర్శించాలి. యూరియాపై ఐవీఆర్ఎస్ ద్వారా సమాచారం సేకరిస్తున్నాం. సమస్య ఉన్న చోట ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తాం. యూరియాని అధిక ధరలకు విక్రయిస్తున్న, వ్యవసాయేతర అవసరాలకు మళ్లిస్తున్న వారిని అధికారులు గుర్తించి, క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. రైతులు అవసరానికి మించి, ఒకేసారి అధికంగా కొనుగోలు చేయవద్దు. సేంద్రియ పద్ధతులు పాటించి, రసాయన ఎరువుల వినియోగం తగ్గించేలా అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలి' అని రాజశేఖర్ సూచించారు.

రెండు కార్లను ఢీకొన్న బస్సు

» తొమ్మిది మంది మృతి...ముగ్గురికి గాయాలు

» తమిళనాడులోని కడలూరు జిల్లాలో ఘోరం

చెన్నై, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని కడలూరు జిల్లా తిట్టకుడి సమీపంలో ప్రభుత్వ బస్సు రెండుకార్లను ఢీకొట్టిన ఘటనలో తొమ్మిది మంది మృతి చెందారు. బుధవారం రాత్రి తిరుచ్చి నుంచి వేగంగా చెన్నై వస్తున్న ప్రభుత్వ బస్సు ముందు టైరు కడలూరు జిల్లా రామనత్తం వద్ద హఠాత్తుగా పేలిపోయింది. దీంతో అదుపు తప్పిన బస్సు ఎదురుగా వస్తున్న రెండు కార్లను ఢీకొంది. ఈ ఘటనలో రెండు కార్లు నుజ్జునుజ్జవగా, ఆ వాహనాల్లో ప్రయాణిస్తున్న తొమ్మిదిమంది మృతి చెందారు. ముగ్గురు గాయపడ్డారు. మృతులలో ఇద్దరు మహిళలు ఉన్నారు. రామనత్తం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

అమెరికాలో 30 మంది భారతీయుల అరెస్టు

న్యూయార్క్, డిసెంబరు 24: అమెరికాలో అక్రమంగా నివసిస్తూ, నిబంధనలకు విరుద్ధంగా కమర్షియల్ డ్రైవింగ్ లైసెన్స్‌లతో భారీ ట్రక్కులను నడుపుతున్న 30మంది భారతీయులను యూఎస్ బోర్డర్ పెట్రోల్ ఏజెంట్లు అరెస్టు చేశారు. ఇటీవలి కాలంలో అక్రమ వలసదారులు నడుపుతున్న ట్రక్కుల వల్ల ప్రమాదాలు జరుగుతుండడంతో అధికారులు తనిఖీలు చేపట్టారు. కాలిఫోర్నియాలోని ఇమిగ్రేషన్ చెక్‌పోస్టుల వద్ద నవంబరు 23 నుంచి ఈనెల 12 వరకు నిర్వహించిన తనిఖీల్లో 49 మంది అక్రమ వలసదారులను అదుపులోకి తీసుకోగా, వారిలో 30మంది భారతీయులే ఉన్నారు.

కొత్తగా మరో 3ఎయిర్‌లైన్స్

» తాజాగా అల్ హింద్ ఎయిర్, ఫ్లై ఎక్స్‌ప్రెస్ సంస్థలకు అనుమతులు ఇచ్చిన కేంద్రం

» ఇటీవలే శంఖ్ ఎయిర్‌లైన్స్‌కు ఎన్‌వోసీ



న్యూఢిల్లీ, డిసెంబరు 24: దేశ విమానయాన రంగంలో గుత్తాధిపత్యానికి తెరదించేందుకు వీలుగా కొత్తగా రెండు విమానయాన సంస్థలకు కేంద్రం అనుమతి ఇచ్చింది. అల్ హింద్ ఎయిర్, ఫ్లై ఎక్స్‌ప్రెస్ సంస్థలు దేశంలో విమాన సర్వీసులు నిర్వహించేందుకు వీలుగా పౌర విమానయాన శాఖ 'ఎన్‌వోసీ'లు జారీ చేసింది. వీటికితోడు ఇటీవలే శంఖ్ ఎయిర్‌లైన్స్‌కు కూడా అనుమతులు వచ్చాయి. దీనితో వాణిజ్యపరంగా విమాన సర్వీసులు నిర్వహించేందుకు ఈ మూడు సంస్థలకు మార్గం సుగమమైంది. ఇటీవల ఇండిగో వందలాది విమాన సర్వీసులను రద్దు చేయడంతో లక్షలాది మంది విమాన ప్రయాణికులు ఇబ్బందిపడిన విషయం తెలిసిందే. విమానయాన రంగంలో కేవలం రెండు సంస్థలకే ఇండిగో (65%), ఎయిరిండియా (సుమారు 20%) గుత్తాధిపత్యం ఉండటమే ఈ సంక్షోభానికి కారణమనే విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలోనే కొత్త సంస్థలకు అనుమతులు ఇవ్వడం గమనార్హం. కేరళకు చెందిన అల్ హింద్ గ్రూపు అల్‌హింద్ ఎయిర్ సంస్థను ఏర్పాటు చేసింది. కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో ప్రాంతీయ సర్వీసులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇక హైదరాబాద్‌కు చెందిన ఫ్లైఎక్స్‌ప్రెస్ సంస్థ ఇప్పటికే కొరియర్, సరుకు రవాణా సేవల్లో ఉంది. ఇప్పుడు ప్రయాణికుల విభాగంలోకి వస్తోంది. మరోవైపు ఉత్తరప్రదేశ్‌కు చెందిన శంఖ్ ఎయిర్ సంస్థ యూపీతోపాటు పలు ఉత్తరాది రాష్ట్రాల్లో ప్రాంతీయ సర్వీసులు నిర్వహించేందుకు సిద్ధమైంది. కొత్త ఎయిర్‌లైన్స్‌కు అనుమతులపై పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడు 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. "భారత గగనతలంలోకి ప్రవేశించేందుకు సిద్ధమవుతున్న అల్ హింద్ ఎయిర్, ఫ్లై ఎక్స్‌ప్రెస్, శంఖ్ ఎయిర్ సంస్థల ప్రతినిధులతో గత వారం రోజులుగా సమావేశాలు జరపడం సంతోషకరం. శంఖ్ ఎయిర్ ఇప్పటికే ఎన్‌వోసీ పొందగా, తాజాగా అల్ హింద్ ఎయిర్, ఫ్లైఎక్స్‌ప్రెస్ సంస్థలు ఎన్‌వోసీ పొందాయి. మోదీ ప్రభుత్వ విధానాల ఫలితంగా ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న విమానయాన మార్కెట్లలో ఒకటిగా భారత్ మారింది. దేశంలో ప్రాంతీయంగా విమాన అనుసంధానాన్ని పెంచేందుకు చేపట్టిన ఉడాన్ వంటి పథకాలతో స్టార్ ఎయిర్, ఇండియా వన్ ఎయిర్, ఫ్లై 91 వంటి సంస్థలు కీలక భూమిక పోషిస్తున్నాయి. దేశంలో విమానయాన రంగంలో వృద్ధికి భారీ స్థాయిలో అవకాశాలు ఉన్నాయి" అని పేర్కొన్నారు.

హెచ్1బీ, హెచ్4 వీసా గడువు ముగిసేలోగా

అమెరికాకు వచ్చేయండి

» అపాయింట్‌మెంట్ రీషెడ్యూల్ ఐతే ప్రయాణ ప్రణాళికలను మార్చుకోండి

» విదేశాల్లో ఉన్న తమ ఉద్యోగులకు మైక్రోసాఫ్ట్ అడ్వైజరీ



హెచ్1బీ, హెచ్4 వీసా అపాయింట్‌మెంట్లు రీషెడ్యూల్ అవుతుండడం, స్టాంపింగ్ ఆలస్యం అవుతున్న నేపథ్యంలో మైక్రోసాఫ్ట్ సంస్థ తన ఉద్యోగులకు ఒక అడ్వైజరీ జారీ చేసింది. ప్రస్తుతం అమెరికాలో ఉన్న ఉద్యోగులు ఏం చేయాలో, అమెరికా వెలుపల ఉన్న ఉద్యోగులు ఏం చేయాలో అందులో సూచించింది. వేరే దేశాల్లో ఉన్న ఉద్యోగుల వీసా గడువు ఇంకా మిగిలి ఉంటే గనక అది ముగిసేలోగానే అమెరికాకు వచ్చేయాలని సూచించింది. అపాయింట్‌మెంట్ రీషెడ్యూల్ అయినవారు తమ ప్రయాణ ప్రణాళికలను మార్చుకోవాలని పేర్కొంది. డిసెంబరు 15 నుంచి అమల్లోకి వచ్చిన 'ఆన్‌లైన్ ప్రెజెన్స్ రివ్యూ (అంటే సోషల్ మీడియా తనిఖీ)' కారణంగా హెచ్1బీ, హెచ్4 వీసాల రోజువారీ ప్రాసెసింగ్ సామర్థ్యం తగ్గడమే స్టాంపింగ్ ఆలస్యానికి, అపాయింట్‌మెంట్లు రీషెడ్యూల్ అవడానికి కారణమని తెలిపింది. ముఖ్యంగా.. భారత్‌లో చెన్నై, హైదరాబాద్ కాన్సులేట్లలో రీషెడ్యూలింగ్ నోటిఫికేషన్లు ఎక్కువగా జారీ అవుతున్నాయని.. కొత్త అపాయింట్‌మెంట్ తేదీలు 2026 జూన్ దాకా వెళ్లాయని.. మైక్రోసాఫ్ట్ అసోసియేట్ జనరల్ కౌన్సెల్ ఫర్ ఇమ్మిగ్రేషన్ జాక్ చెన్ తెలిపారు. కొంతమంది ఉద్యోగులు కాన్సులేట్‌కు చేరుకున్నాక.. వారి అపాయింట్‌మెంట్ రీషెడ్యూల్ అయినట్టు తెలుసుకున్నారని, కొందరికి బయల్దేరక ముందే రీషెడ్యూలింగ్ నోటీసులు అందాయని ఆయన వెల్లడించారు. వీసా స్టాంపింగ్ అవసరమైన వారు, హెచ్-1బీ వీసా అపాయింట్‌మెంట్ రీషెడ్యూల్ అయినవారిని తామే సంప్రదిస్తామని మైక్రోసాఫ్ట్ తన అడ్వైజరీలో తెలిపింది. అలాగే.. వీసా అపాయింట్‌మెంట్ రీషెడ్యూల్ అయినప్పటికీ, ప్రస్తుత వీసాపై ఇంకా కొంత గడువు ఉంటే అది ముగియక ముందే తిరిగి రావాలని సూచించింది. అమెరికాకు రావాల్సి ఉండి, కొత్త వీసా అవసరమై.. హెచ్1బీ వీసా అపాయింట్‌మెంట్ కొన్ని నెలల తర్వాతకు రీషెడ్యూల్ అయితే.. ప్రయాణ ప్రణాళికలను మార్చుకోవాలని మైక్రోసాఫ్ట్ సూచించింది.

టర్కీలో విమానం కూలి..

లిబియా ఆర్మీ చీఫ్ దుర్మరణం



అంకారా, డిసెంబరు 24: ఒక ప్రైవేటు జెట్ విమానం కుప్పకూలి లిబియా ఆర్మీ చీఫ్ జనరల్ మహమ్మద్ అలీ అహ్మద్ అల్ హద్దాద్, మరో నలుగురు సైనిక ఉన్నతాధికారులు దుర్మరణం పాలయ్యారు. టర్కీలోని అంకారా శివార్లలో మంగళవారం రాత్రి ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. టర్కీతో మిలటరీ సహకారం, పలు రక్షణ అంశాలపై ఉన్నతస్థాయి చర్చల కోసం లిబియా ఆర్మీ చీఫ్ నేతృత్వంలోని బృందం అంకారాకు వచ్చింది. టర్కీ రక్షణ మంత్రి యాసర్ గులర్‌తో చర్చల అనంతరం ఫాల్కన్-50 ప్రైవేటు జెట్ విమానంలో తిరిగి బయలుదేరింది. అంకారా విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయిన కాసేపటికే హైమానా ప్రాంతంలో కూలిపోయింది. ప్రమాదానికి విమానంలో సాంకేతిక సమస్యలే కారణమని, అత్యవసర ల్యాండింగ్ కోసం పైలట్ విజ్ఞప్తి కూడా చేశారని టర్కీ అధికారులు ప్రకటించారు. 2011లో అంతర్యుద్ధం తర్వాత లిబియాలో పాలన పశ్చిమ(నేషనల్ యూనిటీ), తూర్పు(ఎల్ఎన్ఏ)గా చీలిపోయింది. 'నేషనల్ యూనిటీ' ప్రభుత్వానికి అంతర్జాతీయ గుర్తింపు ఉంది. అయితే, పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ సోమవారం ఎల్ఎన్ఏ ఆధీనంలోని బెంఘాజీలో పర్యటించారు. ఆయుధ ఒప్పందం చేసుకున్నారు. ఇది జరిగిన మరునాడే 'నేషనల్ యూనిటీ' ప్రభుత్వ ఆర్మీ చీఫ్ విమాన ప్రమాదంలో చనిపోవడం, అది కూడా పాక్‌కు సన్నిహిత టర్కీలో జరగడం చర్చనీయాంశంగా మారింది.

ఉన్నావ్ దోషి విడుదల సిగ్గుచేటు

» నేరస్థుడికి బెయిల్ ఇచ్చి బాధితులను నేరస్థులుగా చూస్తారా?

» ఇదేనా న్యాయం?: రాహుల్ గాంధీ


న్యూఢిల్లీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉన్నావ్ అత్యాచార కేసు దోషి కుల్దీప్ సింగ్ సెంగార్‌ను విడుదల చేయడం సిగ్గుచేటని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. సెంగర్‌కు బెయిల్ ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ బాధితురాలు, ఆమె తల్లి నిరసన చేస్తున్న క్రమంలో వారితో భద్రతా సిబ్బంది వ్యవహరించిన తీరుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. పోలీసుల బాధితురాలిని లాక్కెళ్తున్న వీడియోను 'ఎక్స్' వేదికగా పంచుకొని కీలక వ్యాఖ్యలు చేశారు. తనకు అన్యాయం జరిగిందంటూ నిరసన చేస్తున్న ఓ అత్యాచార బాధితురాలి పట్ల ఇలా వ్యవహరించడం సమంజసమేనా..? న్యాయం కోసం గళం వినిపించడమే ఆమె చేసిన తప్పా..? అని ప్రశ్నించారు. 'బాధితురాలు పదే పదే వేధింపులకు గురవుతూ భయంతో జీవిస్తోంది. ఈ సమయంలో కేసులో ప్రధాన నిందితుడు(మాజీ బీజేపీ ఎమ్మెల్యే సెంగార్)కు బెయిల్ లభించడం అత్యంత విచారకరం. అత్యాచారం చేసిన వారికి బెయిల్ ఇచ్చి స్వేచ్ఛగా తిరగమని చెప్పడం, బాధితులను నేరస్థులుగా చూడడం.. ఇదేం న్యాయం' అని వ్యాఖ్యానించారు. కాగా, ఉన్నావ్ కేసు బాధితురాలు, ఆమె తల్లి బుధవారం సాయంత్రం రాహుల్‌తో సమావేశమయ్యారు. గంటకు పైగా జరిగిన భేటీలో సోనియాగాంధీ కూడా పాల్గొన్నారు. తమకు జరిగిన అన్యాయాన్ని, పోలీసులు వారి పట్ల వ్యవహరించిన తీరును వివరించారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని రాహుల్ భరోసానిచ్చారు. త్వరలో ప్రధాని మోదీని కూడా కలుస్తామని బాధితురాలు ఈ సందర్భంగా వెల్లడించారు. కాగా, ఉన్నావ్ బాధితురాలు, ఆమె తల్లిని ఢిల్లీలో మీడియాతో మాట్లాడకుండా సీఆర్‌పీఎఫ్ పోలీసులు అడ్డుకోవడం.. బాధితురాలి తల్లిని మోచేతులతో నెట్టేస్తూ దురుసుగా ప్రవర్తించడం షాక్‌కు గురి చేసింది. ఇండియా గేట్ వద్ద నిరసన తెలిపిన బాధితురాలు, ఆమె తల్లిని మంగళవారం రాత్రే బలవంతంగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలి తల్లి మీడియాతో మాట్లాడుతూ.. ఈ తీర్పునకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టును ఆశ్రయించి న్యాయం కోసం పోరాడతామన్నారు.

రొమ్ము క్యాన్సర్‌కు నాన్‌వెజ్, నిద్రలేమే ప్రధాన కారణాలు

» ఐసీఎంఆర్ అధ్యయనంలో వెల్లడి


డాక్టర్ ఎం.శ్రీనివాసులు

హైదరాబాద్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మహిళల్లో రొమ్ము క్యాన్సర్ తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. దేశంలో ఈ మహమ్మారి బారినపడుతోన్న వారి సంఖ్య ఏటా 5.6% మేరకు పెరుగుతూ ఏటా కొత్తగా 50 వేల కేసులు నమోదు అవుతున్నాయి. నాన్‌వెజ్, నిద్రలేమి కారణంగా బ్రెస్ట్ క్యాన్సర్ పెరుగుతున్నట్లు ఐసీఎంఆర్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ప్రాసెస్ చేసిన మాంసం శరీరంలోని ఈస్ట్రోజన్ స్థాయిలను పెంచి క్యాన్సర్‌కు దారితీస్తుందని పేర్కొంది. అలాగే సరిగా నిద్రలేకపోవడం, వేళకు నిద్రపోవకపోవడం, వెలుతురు ఉన్న గదుల్లో నిద్రించడం వల్ల మెలటోనిన్ హార్మోన్ ఉత్పత్తి తగ్గి క్యాన్సర్‌కు కారణమౌతున్నట్లు గుర్తించారు. వీటితో పాటు స్థూలకాయం మరో ప్రధాన సమస్యగా మారింది. రెడ్ మీట్(మటన్, పోర్క్, బీఫ్)తో క్యాన్సర్ ముప్పు ఎక్కువేనని గతంలో పలు అధ్యయనాల్లో వెల్లడైనట్లు సర్జికల్ ఆంకాలజిస్టు, ఎంఎన్‌జే మాజీ డైరెక్టర్ ఎం.శ్రీనివాసులు చెప్పారు. అత్యధిక ఉష్ణోగ్రతల వద్ద మాంసాన్ని వేడి చేయడం వల్ల వాటిలో కేన్సర్ కారక పదార్థాలు విడుదల అవుతాయన్నారు. నిద్ర తక్కువగా పోవడం వల్ల రోగనిరోధక శక్తి తగ్గి క్యాన్సర్ ముప్పు పెరుగుతుందని తెలిపారు.



శశాంక్... సెభాష్

రాష్ట్రానికి చెందిన ఈక్వేస్ట్రేరియన్ ఈవెంటింగ్ క్రీడాకారుడు శశాంక్ కనుమూరి సీఎం చంద్రబాబును కలిశారు. బుధవారం సచివాలయంలో సీఎంని కలిసిన శశాంక్.. గుర్రాలతో హర్డిల్స్ దాటే ఈక్వేస్ట్రేరియన్ క్రీడలో తనకు పదేళ్ల అనుభవం ఉందని, థాయ్ పోలో క్లబర్ ఆధ్వర్యంలో జరిగిన ఈవెంటింగ్ ఏషియన్ చాంపియన్‌షిప్-2025లో తన టీంకి సిల్వర్ మెడల్ వచ్చిందని శశాంక్ వివరించారు. భీమవరానికి చెందిన శశాంక్ కనుమూరిని అభినందించిన సీఎం, ఈక్వేస్ట్రేరియన్‌లో మరింత రాణించాలని ఆకాంక్షించారు.

- అమరావతి, ఆంధ్రజ్యోతి

రూ. కోటి పొలానికి లాటరీ!

- ఒక్కోటీ రూ.500 చొప్పున టోకెన్ల అమ్మకం
- వేలంవెర్రిగా కొనుగోలు చేసిన ఔత్సాహికులు

పెనుగంచిప్రోలు రూరల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): సాధారణంగా ఎవరైనా భూములు అమ్ముకోవాలంటే ఆ విషయాన్ని నలుగురికీ చెబుతారు. కొనుగోలు చేసేందుకు ముందుకొచ్చిన వారితో బేరసారాలాడి తమకు నచ్చిన ధరకు విక్రయిస్తారు. కానీ ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఓ రైతు మాత్రం తన పొలాన్ని అమ్మడానికి లాటరీ పద్ధతిని ఎంచుకొని టికెట్లు విక్రయించారు. పెనుగంచిప్రోలుకు చెందిన రైతు దేవరశెట్టి రాంబాబుకు 95 సెంట్ల వ్యవసాయ భూమి ఉంది. ఇక్కడ ఎకరం రూ.70 లక్షల నుంచి రూ.కోటి వరకూ పలుకుతోంది. తన అవసరాల రీత్యా ఆ భూమిని విక్రయించాలని నిర్ణయించుకున్నారు. లాటరీ టోకెన్లు విక్రయించి డ్రా తీసి గెలుపొందిన వారికి రిజిస్ట్రేషన్ చేసేలా ప్రణాళిక వేసుకున్నారు. అనుకున్నదే తడవుగా సోషల్ మీడియా యాడ్స్ చేసేవారిని రంగంలోకి దించి తిరుపతమ్మ ఆలయం నుంచి పొలం వరకు రహదారులను, పొలాన్ని డ్రోన్‌లతో అందంగా వీడియో తీయించారు. దానికి యాంకర్‌తో వాయిస్ ఓవర్ చెప్పించి, ప్రోమో రూపొందించారు. ఆ ప్రోమోలను సామాజిక మాధ్యమాలు, యూట్యూబ్, వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ చేశారు.



లాటరీ ద్వారా విక్రయానికి పెట్టిన వ్యవసాయ భూమి

ఒక టోకెన్ రూ. 500

ఒక్కో టోకెన్ ధర రూ.500గా నిర్ణయించారు. మొత్తం 30 వేల టోకెన్లు ఆన్‌లైన్ ద్వారా విక్రయాలకు పెట్టారు. దీంతో పాటు 500 మంది ఏజెంట్లను ఏర్పాటు చేశారు. టోకెన్ విక్రయించిన ఏజెంట్‌కు రూ.100 కమీషన్ ఇచ్చారు. పెద్దమొత్తంలో విక్రయించిన వారికి ప్రత్యేక రాయితీలు కూడా ప్రకటించారు. ఏపీ, తెలంగాణలోని పలు జిల్లాల్లో 3,800 టోకెన్లు విక్రయించారు. సంక్రాంతి రోజున డ్రా తీయడానికి సన్నద్ధమయ్యారు. ఈలోగా పోలీసులు రంగప్రవేశం చేసి టోకెన్ల విక్రయాలు ఆపేయాలని స్పష్టం చేయడంతో ఇప్పటి వరకు వాటిని కొనుగోలు చేసినవారికి నగదు వాపసు చేస్తున్నారు.

పాడేరులో డ్రోన్ల ద్వారా మందుల సరఫరా

- 'రెడ్ వింగ్'తో ఆరోగ్యశాఖ ఒప్పందం

అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మారుమూల గిరిజన ప్రాంతాలకు అత్యవసర వైద్య సేవలను చేరువ చేసే లక్ష్యంతో ఆరోగ్యశాఖ 'రెడ్ వింగ్' సంస్థతో కీలక ఒప్పందం చేసుకుంది. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కేంద్రంగా దూరప్రాంతాల్లోని ఆస్పత్రులకు డ్రోన్ల ద్వారా మందులు, బ్లడ్ యూనిట్స్ పంపిణీ చేసేందుకు ఈ ఒప్పందం జరిగింది. ఆ సంస్థ ఇప్పటికే అరుణాచల్‌ప్రదేశ్‌లో విజయవంతంగా సేవలు అందిస్తోంది. రాష్ట్రంలో ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్ కింద ఆరేడు నెలల పాటు ఉచితంగా సేవలు అందించేందుకు అంగీకరించింది. ఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండియన్, రెడ్‌వింగ్ సంస్థ ప్రతినిధి కుందన్ మాదిరెడ్డి మధ్య బుధవారం కమిషనర్ కార్యాలయంలో ఈ ఒప్పందం జరిగింది. ఒక్క డ్రోన్ సుమారు 2కిలోల బరువును మోసుకెళ్ల గలదు. భవిష్యత్తులో విశాఖ కేజీహెచ్ నుంచి పాడేరుకు మందుల రవాణాకు కూడా ఈ సేవలను విస్తరింపచేయాలని భావిస్తున్నట్లు ఆరోగ్యశాఖ కమిషనర్ తెలిపారు.

రామ్‌కో క్వార్ట్జ లీజుకు సీనరేజీ ఖరారు

అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో రామ్‌కో కంపెనీకి ఇచ్చిన సున్నపురాయి లీజుల్లో కొత్తగా క్వార్ట్జ ఖనిజ నిక్షేపాలు వెలుగులోకి వచ్చాయి. ఇదే విషయాన్ని ఆ కంపెనీ ప్రభుత్వానికి తెలియజేసింది. తమకిచ్చిన లీజుల్లో క్వార్ట్జ ఉన్నట్లుగా ఉత్తర్వుల్లో చేర్చాలని ఆ కంపెనీ ప్రభుత్వాన్ని కోరింది. ఇందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కొత్తగా క్వార్ట్జ మైనింగ్‌కు సీనరేజీని ఖరారు చేయాలని గనుల శాఖ డైరెక్టర్ ప్రతిపాదించారు. టన్నుకు రూ.160 సీనరేజీని కంపెనీ నుంచి వసూలు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గనుల శాఖ డైరెక్టర్ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది.

ఫైబర్ నెట్‌లో ఇద్దరు అధికారుల నియామకం

అమరావతి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో నిస్తేజంగా మారిన ఫైబర్ నెట్ కార్పొరేషన్‌లో (ఏపీఎస్ఎఫ్ఎల్) తిరిగి కదలిక మొదలైంది. చీఫ్ టెక్నాలజీ ఆఫీసరుగా వై.రాజకిశోర్‌ను,బిజినెస్ ఆపరేషన్స్ జనరల్ మేనేజర్‌గా ఎల్.హరికృష్ణను నియమిస్తూ బుధవారం ఐ అండ్ ఐ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఫైబర్ నెట్‌లో దిద్దుబాటు చర్యలు ప్రారంభించిన కూటమి ప్రభుత్వం.. అందులో భాగంగా కొత్తగా ఇద్దరు అధికారులను నియమించింది.

ఆన్‌లైన్‌లో వినియోగదారుల ఫిర్యాదులు: డిల్లీరావు

అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): వినియోగదారులు తమ హక్కులపై అవగాహన పెంచుకోవడంతోపాటు సోక్రటీస్ చెప్పినట్లుగా ప్రశ్నించడాన్ని అలవర్చుకోవాలని పౌరసరఫరాల సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా బుధవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. కోర్టు విచారణలకు స్వయంగా కాకుండా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కూడా హాజరు కావచ్చునని పేర్కొన్నారు. వినియోగదారుల కేసుల స్థితిగతులు, ట్రాకింగ్, ఆన్‌లైన్‌లో ఫీజుల చెల్లింపు తదితర అంశాలను ట్రాక్ చేయడానికి ఈ-జాగృతి యాప్ ఉపయోగపడుతుందని చెప్పారు.

జనవరి నుంచి రేషన్‌లో గోధుమపిండి

అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి):ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ కార్డుదారులకు జనవరి నుంచి గోధుమపిండిని సబ్సిడీ ధరపై అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పేదలకు పోషకాహారాన్ని మెరుగుపరచడం కోసం రేషన్ సరుకుల్లో గోధుమపిండిని కూడా రాయితీ ధరపై పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఖర్చులను పరిగణనలోకి తీసుకుని కిలో గోధుమపిండి ధరను రూ.20గా నిర్ణయించినట్లు పౌరసరఫరాల కమిషనర్ సౌరబ్ గౌర్ బుధవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రహదారి పనులకు మరో 205.12 కోట్లు

అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రధాన రహదారులు (ఎండీఆర్), రాష్ట్ర హైవేల నిర్మాణ, నిర్వహణ పనుల కోసం రూ.205.12 కోట్ల విడుదలకు ప్రభుత్వం పరిపాలనా అనుమతి ఇచ్చింది. ఈమేరకు రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు బుధవారం ఉత్తర్వులు(జీఓ-666) జారీ చేశారు. నిజానికి ఎండీఆర్, రాష్ట్ర హైవేల కోసం ప్రభుత్వం రూ.500 కోట్లు కేటాయించింది. ఇందులో నవంబరు 27న రూ.200 కోట్ల విడుదలకు పరిపాలనా అనుమతులు ఇచ్చింది.

మావోయిస్టు నేతల ఎన్‌కౌంటర్‌పై కౌంటర్ వేయండి: హైకోర్టు

అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు నేతలు మడ్వి హిడ్మా, మడ్వి రాజే అలియాస్ రాజక్క, మరో నలుగురు ఎన్‌కౌంటర్ ఘటనపై జ్యుడీషియల్ విచారణకు ఆదేశించాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ పిల్ బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది చల్లా శ్రీనివాసరెడ్డి వాదనలు వినిపించారు.

ట్రేడింగ్ పేరిట సహోద్యోగులకు ఏఎస్ఐ టోకరా

గాజువాక, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): క్రిప్టో కరెన్సీ, షేర్ మార్కెట్‌లో పెట్టుబడుల పేరిట మోసం చేశారంటూ విశాఖపట్నం జిల్లా గాజువాక ట్రాఫిక్ ఏఎస్ఐపై కొంతమంది పోలీస్ సిబ్బంది బుధవారం నగర పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. గాజువాక ట్రాఫిక్ ఏఎస్ఐగా పనిచేస్తున్న మోటుపల్లి నరసింహరాజు తాను క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్, షేర్ మార్కెట్‌లో అత్యధిక లాభాలు ఆర్జిస్తున్నానని, మీరు కూడా పెట్టుబడులు పెడితే డబ్బులు వస్తాయని తన కింది ఉద్యోగులను నమ్మించాడు. ఈ మాటలను నమ్మి ట్రాఫిక్ విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పి.సన్యాసినాయుడు దఫదఫాలుగా రూ.10లక్షల వరకూ ఇచ్చారు. 3నెలల పాటు లాభాలు వచ్చాయంటూ కొంత తిరిగి ఇచ్చారు. తదుపరి నెలలు గడుస్తున్నా ఒక్క రూపాయి ఇవ్వలేదు. గతంలో గాజువాక స్టేషన్‌లో కానిస్టేబుళ్లుగా పనిచేసిన డి.శేఖర్ నుంచి రూ.4,50,000, నానాజీ నుంచి రూ.80,000, హోంగార్డులు త్రినాథ్ నుంచి రూ.2,50,000, రవి నుంచి రూ.3 లక్షలు ఏఎస్ఐ తీసుకున్నట్టు తెలిసింది. ప్రస్తుతం పి.సన్యాసి నాయుడుకు రూ.7లక్షలు, డి.శేఖర్‌కు రూ.4 లక్షలు, నానాజీకి రూ.80,000, త్రినాథ్‌కు రూ.2,50,000, రవికి లక్ష రూ.15,30,000 చెల్లించాల్సి ఉంది. ఈ మేరకు బాధిత సిబ్బంది బుధవారం పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీకి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు

బిడ్ వేసిన సంస్థతో ఒప్పందం

- ఆదోని మెడికల్ కాలేజీ నిర్మాణానికి ముందుకొచ్చిన 'కిమ్స్'కు ఆమోదం
- మిగిలిన బిడ్డర్లతోనూ సంప్రదింపులు
- వైద్య విద్య నాణ్యతలో రాజీ లేదు
- పీపీపీలో పేదలకు నాణ్యమైన వైద్యం
- జిల్లా మొత్తం 'కుప్పం సంజీవని' అమలు
- ఆరోగ్య శాఖకు చంద్రబాబు ఆదేశం



వైద్య ఆరోగ్య శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు, మంత్రి సత్యకుమార్, అధికారులు

అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పేదలకు నాణ్యమైన వైద్య విద్యను, వైద్యాన్ని అందించే విషయంలో ఎక్కడా రాజీపడేది, వెనక్కి తగ్గేది లేదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలో పబ్లిక్-ప్రైవేట్-పార్టనర్‌షిప్(పీపీపీ) విధానంలో చేపట్టిన మెడికల్ కాలేజీల నిర్మాణానికి కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా వయబులిటీ గ్యాప్ ఫండ్(వీజీఎఫ్) సహా ఇతర ప్రోత్సాహకాలు ఇవ్వాలని సూచించారు. ఆదోని మెడికల్ కాలేజీ నిర్మాణానికి ముందుకు వచ్చిన కిమ్స్ సంస్థతో ఒప్పందం చేసుకోవాలన్నారు. కాలేజీ నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. అలాగే మిగిలిన కాలేజీలకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు బిడ్డర్లతో సంప్రదింపులు జరపాలని ఆదేశించారు. బుధవారం సచివాయంలో వైద్య ఆరోగ్య శాఖపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీల నిర్మాణం ప్రస్తావనకు వచ్చింది. దేశ వ్యాప్తంగా పీపీపీ విధానం అమల్లో ఉందని, పేద వర్గాలకు నాణ్యమైన, కార్పొరేట్ వైద్యం అందించే విషయంలో పీపీపీ విధానంలో ముందుకు వెళ్లాలని అధికారులకు చంద్రబాబు సూచించారు. పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలను ముందుకు తీసుకువెళ్లేందుకు అవసరమైన కార్యాచరణతో పని చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు స్పందిస్తూ.. వీపీపీ ప్రాజెక్టుల అమలును ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం, ఆర్థిక వ్యవహారాల విభాగం, ఆర్థిక శాఖ ద్వారా పలు విధానపరమైన అంశాలకు సహకరించేందుకు ఆర్థిక సహాయ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ఈ క్రమంలో అమలులో ఉన్న వీజీఎఫ్ ఆర్థిక చేయూతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో సగం భరించాలని కేంద్రం సూచించిందని వెల్లడించారు. దీనిలో భాగంగా వైద్య రంగంలో వీజీఎఫ్ కింద ఇచ్చే 60 శాతం ఆర్థిక మద్దతులో చెరో 30 శాతం చొప్పున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత తీసుకుంటాయన్నారు. వీజీఎఫ్ ద్వారా అరుణాచల్ ప్రదేశ్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఆసుపత్రులు, వైద్య కళాశాలలు నిర్మించేందుకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల విభాగం ఇప్పటికే అనుమతులు ఇచ్చిందని చెప్పారు. పీపీపీ విధానం ద్వారా వైద్య కళాశాలలు, ఆసుపత్రులు, కీలక ఆరోగ్య మౌలిక వసతుల అభివృద్ధి వేగవంతం అవుతుందని, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని కేంద్రం అభిప్రాయపడినట్లు అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తొలి విడతలో చేపట్టిన ఆదోని, మదనపల్లె, పులివెందుల, మార్కాపురం మెడికల్ కాలేజీలకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను అధికారులు సీఎంకు వివరించారు.

చిత్తూరు వ్యాప్తంగా..

కుప్పంలో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన 'సంజీవని ప్రాజెక్టు' అమలుపైనా సీఎం చంద్రబాబు అధికారులతో చర్చించారు. త్వరలో చిత్తూరు జిల్లా వ్యాప్తంగా సంజీవని ప్రాజెక్టును అమలు చేసేలా అధికారులు ఎలాంటి కసరత్తు చేస్తున్నారని ఆరా తీశారు. కుప్పంలో ఎదురైన అవరోధాలను అధిగమిస్తూ, చిత్తూరు జిల్లా వ్యాప్తంగా సంజీవని ప్రాజెక్టును అమలు చేయాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరికి డిజిటల్ హెల్త్ రికార్డులు ఇచ్చేలా రూపొందించిన ఈ ప్రాజెక్టును ఎప్పటికప్పుడు ఆధునీకరించాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఈ సమీక్షలో ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, సెక్రటరీ సౌరభ్ గౌర్, ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ గిరిషా తదితరులు పాల్గొన్నారు.

ట్రంప్ టారిఫ్‌లతో సహజ క్రిస్మస్ చెట్లకు క్రేజ్

- పెరిగిపోయిన కృత్రిమ చెట్ల ధరలు..

(డాలస్ నుంచి కృష్ణమోహన్ దాసరి)

క్రిస్మస్ వచ్చిందంటే చాలు అమెరికాలో ఎక్కడ చూసినా హడావుడే. ఇళ్లు, ఆఫీసులు, స్కూళ్లు.. ఇలా ఎక్కడ చూసినా పెద్ద పెద్ద క్రిస్మస్ చెట్లను ఏర్పాటు చేసి, విద్యుద్దీపాలతో అలంకరిస్తారు. ఈసారి ట్రంప్ టారిఫ్‌ల దెబ్బతో సీన్ మారిపోయింది. కృత్రిమ క్రిస్మస్ చెట్ల వినియోగం తగ్గిపోయి.. సహజ చెట్లకు డిమాండ్ పెరిగింది. సరైన ఆకారం, పరిమాణంలో ఉండటం, అదనంగా ఏర్పాటు చేయాల్సిన అవసరం లేకుండానే విద్యుద్దీపాలు, వివిధ అలంకరణలు ఉండటంతో కొన్నేళ్లుగా కృత్రిమ క్రిస్మస్ చెట్లను జనం కొనుగోలు చేస్తూ వచ్చారు. ఈ కృత్రిమ చెట్లు, వాటిపై చేసే అలంకరణలన్నీ కూడా చైనా, కెనడా, మెక్సికో నుంచే దిగుమతి అవుతాయి. ట్రంప్ సుంకాల కారణంగా వాటి ధరలు 15-50శాతం దాకా పెరిగిపోయాయి. స్థానిక వ్యాపారులు దిగుమతులు తగ్గించడంతో కొరత కూడా ఏర్పడింది. మరోవైపు ఈ సుంకాల కారణంగా నిత్యావసరాల ధరలు పెరిగి, ప్రజల జీవన వ్యయాలు పెరిగాయి. చాలా కుటుంబాలు ఖర్చులపై జాగ్రత్తపడుతున్నాయి. దీంతో సహజమైన క్రిస్మస్ చెట్లకు డిమాండ్ పెరిగింది. పెద్ద చెట్ల ధరలు 500 డాలర్ల వరకు ఉంటే.. సహజ చెట్లు 150 నుంచి 200 డాలర్లలోపే లభిస్తున్నాయి. ఖర్చులు పెరగడంతో కృత్రిమ క్రిస్మస్ చెట్లు, అలంకరణల దిగుమతులను తగ్గించాల్సి వచ్చిందని కాలిఫోర్నియాకు చెందిన హాలిడే రిటైలర్ సంస్థ బాల్సమ్ హిల్ సీఈవో మ్యాక్ హార్మన్ చెప్పారు. ఈ ఏడాది కస్టమర్ల అభిరుచిలో మార్పు కనిపిస్తోందని, సహజ చెట్లధరలు పెంచకపోవడంతో డిమాండ్ కనిపిస్తోందని ఒరెగాన్‌లోని విలామెట్ వ్యాలీలో 2,700 ఎకరాల్లో క్రిస్మస్ చెట్లను సాగు చేస్తున్న రైతు బిల్ బరోస్ పేర్కొన్నారు. ఈ మార్పు ట్రెండ్‌ను మార్చేసే స్థాయిలో లేదని చెప్పారు.

రెవెన్యూ ప్రక్షాళన!

(మొదటి పేజీ తరువాయి)

కార్యాచరణ ప్రణాళికను త్వరలో సీఎంతో జరిగే భేటీలో అందించనున్నారు.

కలెక్టర్ల సదస్సులో సీఎం అసంతృప్తి

ఆర్టీజీఎస్ సర్వేల్లో రెవెన్యూ శాఖ సేవలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులు, పిటిషన్లలో సింహభాగం రెవెన్యూవే ఉంటున్నాయి. దీంతో ఈ శాఖ పనితీరుపై సీఎం చంద్రబాబు అసంతృప్తిగా ఉన్నారు. అధికారులు కష్టపడి పనిచేస్తున్నా గుర్తింపు ఉండడం లేదని, రెవెన్యూ అంటేనే బ్యాడ్ అని ప్రజలు భావిస్తున్నారని ఇటీవల జరిగిన కలెక్టర్ల సమావేశంలో ఆయన వ్యాఖ్యలు చేశారు. ప్రజల్లో విశ్వసనీయత పెంచుకోవాలంటూ ఏడాది గడువు పెట్టారు. రెవెన్యూ శాఖ ప్రక్షాళనకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఫీల్ బెటర్‌కు తీసుకొచ్చేందుకు అమలు చేయాల్సిన సంస్కరణలపై ఆశాఖ కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా మంత్రి అనగాని బుధవారం కీలక భేటీ నిర్వహించారు. ఆ శాఖ స్పెషల్ సీఎస్ సాయిప్రసాద్, సీసీఎల్‌ఏ జయలక్ష్మి, అదనపు సీసీఎల్ఏ వెంకట మురళి, సర్వే డైరెక్టర్ కూర్మనాథ్, ఇతర సీనియర్ అధికారులు హాజరయ్యారు. రెవెన్యూ సర్వీసుల్లో ప్రజల అసంతృప్తికి ప్రధాన కారణమవుతున్న భూముల సర్వే, మ్యుటేషన్, పాస్‌పుస్తకాల పంపిణీ, పిటిషన్లపై అధికారుల సంతకాలు తీసుకోవాలన్న ఒత్తిళ్లు, ప్రైవేటు పట్టా భూములను 22(ఏ)లో చేర్చడం.. సరిహద్దు వివాదాల పరిష్కారం తదితర అంశాల్లో తీసుకురావలసిన మార్పులపై ప్రతిపాదనలు తయారు చేయాలని ఆయన ఆదేశించారు. జేసీల స్థాయిలో పలు కీలక అధికారాలు ఉంటున్నాయని, వారిపై ఉండే ఒత్తిళ్ల వల్ల సకాలంలో రెవెన్యూ అంశాల్లో సత్వర నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారని, ఫైళ్ల పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతోందని గుర్తించారు. ఈ నేపథ్యంలో జేసీ వద్ద ఉన్న అధికారాల్లో కొన్నింటిని రెవెన్యూ డివిజనల్ అధికారి(ఆర్‌డీవో)కి బదలాయించాలని.. మరికొన్నిటిని తహశీల్దార్‌కు ఇస్తే సరిపోతుందన్న నిర్ణయానికి వచ్చారు. ప్రజలు రెవెన్యూ సేవలు కోరుతూ గ్రామ సచివాలయాల్లో ఇచ్చే పిటిషన్లపై స్థానిక వీఆర్వో లేదా సర్వేయర్ సంతకం ఉండాలన్న నిబంధన వల్ల అవినీతి జరుగుతోందన్న ఫిర్యాదులు అందాయి. ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై ఆర్టీజీఎస్ నిర్వహిస్తున్న సర్వేల్లోనూ ఇదే కీలకంగా ఉంటోంది. సంతకాల పేరిట అవినీతి జరుగుతోందని, ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చోటుచేసుకుంటోందని తేలింది. ఈ నేపథ్యంలో ప్రజలు ఇచ్చే ఫిర్యాదులకు ఏ అధికారి సంతకమూ అవసరం లేదంటూ స్పష్టమైన ఆదేశాలివ్వాలని తాజాగా నిర్ణయించారు.

ఆ భూములకు విముక్తి..

గత ప్రభుత్వంలో అన్యాయంగా, చట్టవిరుద్ధంగా 22(ఏ) జాబితాలో చేర్చిన పట్టా భూములను తొలగించాలని, ప్రజల ఇంటి స్థలాలకూ నిషేధ విముక్తి కల్పించాలని నిర్ణయించారు. జాయింట్ ఎల్‌పీఎమ్‌లు, భూమి విస్తీర్ణంలో తేడాల సవరణ వంటి విన్నపాలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించేలా కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు రెవెన్యూ ప్రక్షాళనకు అవసరమైన రోడ్‌మ్యాప్ సిద్ధం చేయాలన్నారు. దీనిపై స్పెషల్ సీఎస్ సాయిప్రసాద్ నివేదిక రూపొందించనున్నారు. అనంతరం త్వరలో ముఖ్యమంత్రి వద్ద జరిగే భేటీలో కార్యాచరణ ప్రణాళిక అందించాలని నిర్ణయించినట్లు తెలిసింది. శాఖాపరంగా చేపట్టాల్సిన చర్యలపై వెంటనే రెవెన్యూ యంత్రాంగానికి ఆదేశాలివ్వాలని, వాటి అమలుపై ఎప్పటికప్పుడు సమీక్షించాలని సమావేశం నిర్ణయించింది.

టీటీడీ భూ మార్పిడిపై పిల్ కొట్టివేత



అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): తిరుపతి మండలం, పేరూరు పరిధిలో టీటీడీకి చెందిన భూమిని పర్యాటక శాఖతో పరస్పర మార్పిడి చేసుకోవడంతో పాటు ఆ భూమిని పర్యాటక శాఖ ఒబెరాయ్ గ్రూపునకు చెందిన స్వరా హోటల్స్‌కు కేటాయించడాన్ని సవాల్ చేస్తూ తిరుక్షేత్రాల రక్షణ సమితి దాఖలు చేసిన పిల్‌ను హైకోర్టు ధర్మాసనం కొట్టివేసింది. అంతకు ముందు పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపిస్తూ.... అధిక విలువ ఉన్న టీటీడీ భూమిని తక్కువ విలువ ఉన్న పర్యాటక శాఖ భూమితో పరస్పర మార్పిడి చేయడం సరికాదన్నారు. పర్యాటక శాఖ నుంచి తీసుకున్న భూమిని భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగిస్తామని మొదట టీటీడీ ప్రకటించిందన్నారు. తదనంతరం ప్రాజెక్టును మరో ప్రాంతానికి మార్చాలని నిర్ణయించిందన్నారు. టీటీడీ నుండి తీసుకున్న భూమిని పర్యాటక శాఖ హోటల్ నిర్మాణం కోసం ఒబెరాయ్ గ్రూపునకు చెందిన స్వరా హోటల్స్‌కు కేటాయించిందన్నారు. భూమార్పిడి వల్ల టీటీడీకి ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. హోటల్ నిర్మాణం కోసం భారీ చెట్లను కూల్చివేస్తూ వాల్టా చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, టీటీడీ తరఫున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ... 'టీటీడీ, పర్యాటక శాఖ పరస్పరం మార్పిడి చేసుకున్న భూములు రోడ్డుకు ఇరువైపుల ఉంటాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ విలువ వేర్వేరుగా ఉంటుందే తప్ప రెండు భూముల విలువ ఒకటే ఉంటుంది. మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా పర్యాటక శాఖ భూమిని స్వరా హోటల్స్‌కు కేటాయించింది' అని తెలిపారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం... పరస్పరం మార్పిడి చేసుకున్న అనంతరం భూమిని పర్యాటక శాఖ థర్డ్ పార్టీకి అప్పగించిందని గుర్తు చేసింది. భక్తులకు మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్ట్‌ను టీటీడీ మరో చోటకి మార్చిందనే కారణంతో టీటీడీ, పర్యాటక శాఖ మధ్య జరిగిన భూ మార్పిడిని రద్దు చేయలేమని పేర్కొంది. పిల్‌ను కొట్టివేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఆతిథ్యం ఇవ్వనున్న 'రుషికొండ'!



రుషికొండ వినియోగంపై ఏర్పాటైన కమిటీ సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేశ్, అధికారులు

- ప్యాలెస్‌పై రెండు ఫ్లోర్లు వేసి హోటళ్లకు కేటాయింపు
- కేబినెట్ సబ్ కమిటీలో ప్రతిపాదన

అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆతిథ్య రంగ అవసరాలకు విశాఖ రుషికొండ ప్యాలెస్‌ను కేటాయించాలని యోచిస్తున్నామని మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేశ్ వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వంపై భారంపడకుండా, ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా, ప్రభుత్వానికి ఆదాయం కూడా సమకూరేలా త్వరలోనే రుషికొండపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. వైసీపీ హయంలో రూ.వందల కోట్లు ఖర్చుచేసి నిర్మించిన రుషికొండ ప్యాలెస్ వినియోగంపై నిర్ణయంలో జరుగుతున్న జాప్యం పట్ల ఇటీవల కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు అసహనం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇప్పటికే దీనిపై ఏర్పాటైన మంత్రుల సబ్ కమిటీ బుధవారం అమరావతి సచివాలయంలో మూడోసారి భేటీ అయింది. అధికారులు ప్యాలెస్‌కు సంబంధించిన వివరాలను కమిటీకి వివరించారు. సుదీర్ఘ చర్చల అనంతరం ప్యాలెస్ వినియోగంపై పలు ప్రతిపాదనలు ముందుకొచ్చాయి. ప్యాలెస్ నిర్వహణకు తాజ్ లీలా, అట్మాస్ కోర్, ఫెమా సంస్థలు ముందుకు వచ్చినట్లు ఈ సమావేశంలో మంత్రి కేశవ్ తెలిపారు. అయితే, రుషికొండ భవనాలు హోటళ్ల నిర్వహణకు పూర్తి అనుకూలంగా లేవని ఆ సంస్థలు అభిప్రాయపడ్డాయని పేర్కొన్నారు. ప్యాలెస్‌పై అదనంగా భవంతులు నిర్మిస్తే ఎలా ఉంటుందని సబ్ కమిటీ ఆలోచనలు చేసింది. ప్యాలెస్ నిర్మాణంలో కొన్ని మార్పులు చేసి, ఆతిథ్య రంగానికి కేటాయిస్తే బాగుంటుందనే ప్రతిపాదనకు మెజారిటీ మంత్రులు మొగ్గు చూపినట్టు తెలిసింది. అయితే, ఈ నెల 28న ఆన్‌లైన్‌లో భేటీ అయి అన్నిరకాల ప్రతిపాదనలపై మరోసారి చర్చించాలని సబ్ కమిటీ నిర్ణయించింది. కాగా, బీచ్ ఫ్రంట్ వినియోగంపై కూడా కమిటీ సుదీర్ఘ చర్చ జరిపింది. అంతర్జాతీయ ప్రమాణాలను పాటిస్తూ మాల్దీవులు, పుదుచ్చేరి తరహా విధానాలను అనుసరిస్తే బాగుంటుందనే అభిప్రాయం వచ్చింది. ఈ వివరాలను సమావేశానంతరం మీడియాకు పయ్యావుల కేశవ్, దుర్గేశ్ వెల్లడించారు.

ప్రస్తుత నిర్మాణాలు హోటళ్లకు పనికిరావు : కేశవ్

"రుషికొండ కింద ఉన్న తొమ్మిది ఎకరాలను హోటళ్ల కోసం అదనంగా కొంతమంది అడిగారు. అందులో ఏడు ఎకరాల్లో అదనపు భవనాలు, సదుపాయాలు కల్పించే వీలుంది. అయితే, అది సీఆర్‌జడ్ పరిధిలోకి వస్తోంది. అందు వల్ల నిబంధనలు అంగీకరించవు. ఉన్న రెండెకరాలకు అదనంగా భూములేమైనా అందుబాటులో ఉన్నాయేమోనని పరిశీలిస్తున్నాం. ప్రస్తుతం ఉన్న రుషికొండ ప్యాలెస్ నిర్మాణం హోటళ్ల నిర్వహణకు పనికిరాదు. ప్యాలెస్‌పై అదనంగా మరో రెండు ఫ్లోర్లు వేస్తే హోటళ్లకు అనువుగా ఉంటుందనే అభిప్రాయం కమిటీ భేటీలో వచ్చింది.." అని మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. రుషికొండ ప్యాలెస్‌లో చివర ఉన్న రెండు మూడు బ్లాకులు ప్రజలకు ఆర్ట్ గ్యాలరీ, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం ఉంచుతామని, మిగతావి హోటళ్లకు ఇచ్చే యోచన చేస్తున్నామని వివరించారు. గత ప్రభుత్వ నిర్ణయం వల్ల ప్రజా ధనం వృథా అయిందని, రుషికొండ ప్యాలెస్ తెల్ల ఏనుగులా మారిందన్నారు. పర్యాటక శాఖ భూములపై సమగ్ర సర్వే నిర్వహించాలని ఆదేశించామని, నివేదిక వచ్చిన తర్వాత తదుపరి భేటీలో నిర్ణయం తీసుకుంటామని కేశవ్ తెలిపారు.

ఆదాయం పోయింది.. ఖజానాకూ భారం: దుర్గేశ్

రుషికొండ ప్యాలెస్‌పై ప్రభుత్వం తల బద్దలు కొట్టుకోవాల్సిన పరిస్థితిని గత ప్రభుత్వం కల్పించిందని మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. "పర్యాటకశాఖకు ఏటా రూ.7 కోట్ల ఆదాయం తెచ్చిపెట్టే రిసార్ట్స్ స్థానంలో ప్యాలెస్ కట్టారు. దీని వల్ల ఆదాయం కోల్పోవడమే కాకుండా ప్రతి నెల రూ.25 లక్షల నిర్వహణ భారం పర్యాటకశాఖపై పడుతోంది. అందుబాటులో ఉన్న భూముల్లోనే ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా, ప్రజల సందర్శనార్థం ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటాం. సముద్రం ఆటుపోటుల వల్ల రుషికొండ కింద ఉన్న తొమ్మిది ఎకరాల్లో 2 ఎకరాలు మాత్రమే అందుబాటులో ఉంది. వాస్తవానికి అక్కడ 9 ఎకరాలు ఉందని ముందుకొచ్చిన మదుపుదారులు ముందుకొచ్చారు. వారికి ఇప్పుడు ప్రత్యామ్నాయం చూపించాల్సి ఉంది. సీఆర్‌జెడ్ నిబంధనలు పరిశీలించగా, కొండపై 60 వేల చ.అడుగుల్లో నిర్మాణానికి అనుకూలంగా ఉందని గుర్తించాం. దీనికి సంబంధించి పలు సంస్థలు ముందుకు వచ్చాయి. వయబుల్ ప్రాజెక్టుపైనే దృష్టి సారించాం. త్వరలోనే రుషికొండ ప్యాలెస్ వినియోగంపై తుది నిర్ణయం తీసుకుంటా'మని దుర్గేశ్ తెలిపారు.

ఇంజనీరింగ్ ఫీజుల్లో మార్పులు

- హైకోర్టు తుది తీర్పు ఆధారంగా జీవో
- 7 కాలేజీలకు స్వల్పంగా పెరుగుదల

అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కోర్సుల ఫీజుల్లో స్వల్ప మార్పులు జరిగాయి. 2023-24 నుంచి 2025-26 కాలానికి ఫీజులు నిర్ణయించే సమయంలో హైకోర్టులో దాఖలైన పిటిషన్లపై ఇటీవల తుది తీర్పు వచ్చింది. అందుకు అనుగుణంగా ఉన్నత విద్య కమిషన్ కసరత్తు చేసి ఫీజులు సిఫారసు చేయగా, దానిపై ఉన్నత విద్యాశాఖ బుధవారం జీవో విడుదల చేసింది. ఆ జీవో ప్రకారం ఇంజనీరింగ్ కోర్సుల ఫీజులు కనిష్ఠంగా రూ.40 వేలు నుంచి గరిష్ఠంగా రూ.1.05 లక్షల వరకు ఉన్నాయి. ఏడు కాలేజీలకు స్వల్పంగా ఫీజులు పెరిగాయి. 2024-25 నుంచి ప్రస్తుత విద్యా సంవత్సరం వరకు మూడేళ్ల కాలానికి ఇవే ఫీజులు అమలవుతాయి. మేనేజ్‌మెంట్ కోటా విద్యార్థులకు ఈ మార్పులు వర్తించవు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం కింద అడ్మిషన్లు పొంది చదువుకున్నవారికి అమలవుతాయి. ఫలితంగా ప్రభుత్వం కాలేజీలకు చెల్లించాల్సిన ఫీజు బకాయిల్లో కొంత భారం తగ్గుతుంది. గతేడాది కనీస ఫీజు రూ.43వేలుగా ఉంది. తాజా తీర్పు ప్రకారం అది రూ.40వేలకు తగ్గింది. చాలా కాలేజీలు కనీస ఫీజు పరిధిలోనే ఉన్నాయి. ఏడు కాలేజీలకు లబ్ధి చేకూరగా, ఎక్కువ కాలేజీలకు ఫీజులు తగ్గాయి.

తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ


అలిపిరి చెకింగ్ పాయింట్ వద్ద నిలిచిన వాహనాలు

తిరుమల, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ పెరిగింది. క్రిస్మస్ సెలవులతో పాటు 30 నుంచి పది రోజుల పాటు వైకుంఠద్వార దర్శనాల రద్దీ ఉంటుందనే ఉద్దేశంతో...ముందస్తుగా దర్శనం చేసుకోవాలని జనం తిరుమల వస్తున్నారు. మాడవీధులు, అఖిలాండం, లడ్డూ కేంద్రం, అన్నప్రసాద భవనం, వసతి సముదాయాలు, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాలు కిటకిటలాడుతూ కనిపించాయి. వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. అలిపిరిలోనూ వాహనాల రద్దీ అధికంగా కనిపించింది. చెక్‌పాయింట్ నుంచి గరుడ సర్కిల్ వరకు వాహనాలు గంటల కొద్దీ నిలిచిపోయాయి.

ఆ మండలాలు నెల్లూరులోనే?

- ప్రజల అభ్యంతరాలతో రెవెన్యూ శాఖ నిర్ణయం!
- 28వ తేదీన కీలక సమావేశం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో కొత్తగా మదనపల్లె, మార్కాపురం, పోలవరం జిల్లాలను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గతనెల 27న ప్రాథమిక గెజిట్ నోటిఫికేషన్లు విడుదల చేసింది. అలాగే ఆరు కొత్తగా రెవెన్యూ డివిజన్లు, ఒక మండలాన్ని ఏర్పాటు చేశారు. ఈ పునర్వ్యవస్థీకరణపై నెల రోజుల్లో ప్రజలు తమ సూచనలు, సలహాలు, అభ్యంతరాలు తెలియజేయాలని కోరిన సంగతి తెలిసిందే. ఇప్పటి వరకు జిల్లాల కలెక్టర్లకు 500కుపైగా విన్నపాలు, అభ్యంతరాలు వచ్చినట్లు సమాచారం. వీటిలోనూ అత్యధికంగా నెల్లూరు జిల్లా నుంచే ఉన్నాయి. నెల్లూరు జిల్లాలో ఉన్న కలువాయి, సైదాపురం, రాపూరు మండలాలను పునర్వ్యవస్థీకరణలో తిరుపతి జిల్లాలోని గూడూరు డివిజన్‌లో విలీనం చేశారు. ఈ నిర్ణయాన్ని మూడు మండలాల ప్రజలు, ప్రజాప్రతినిధులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. తమను తిరిగి నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలని కోరుతూ గత కొద్దిరోజులుగా అధికార టీడీపీ నేతలు, కార్యకర్తలే పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఇదే అంశంపై వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రభుత్వానికి వరసగా లేఖలు రాశారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను, మంత్రివర్గ ఉపసంఘం సభ్యులను, రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్‌ను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ఈ పరిణామం ప్రభుత్వానికి ఆశ్చర్యం కలిగించింది. ప్రజలు ఇంతలా నిరసన వ్యక్తం చేస్తుంటే.. ఆ మండలాలను ఏ ప్రాతిపదికన తిరుపతిలో కలిపారన్న చర్చ మొదలైంది. దరిమిలా సీఎం చంద్రబాబే ఈ మండలాల పరిస్థితిపై నివేదిక తెప్పించుకున్నట్లు తెలిసింది. ప్రభుత్వ నిర్ణయానికి భిన్నంగా ప్రజలెందుకు స్పందిస్తున్నారు.. వారి ఆందోళనకు కారణాలు, స్థానిక అంశాలు, ఇంకా రాజకీయ పరిస్థితులపై వేర్వేరు నివేదికలు తెప్పించుకున్నారు. ప్రజా స్పందనను పరిగణలోకి తీసుకుని, ఆ తిరుపతిజిల్లాలో విలీనం చేసిన ఆ మూడు మండలాలను తిరిగి నెల్లూరులోనే కొనసాగించాలని ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ నెల 28న జరిగే సమావేశంలో ఈ విషయంపై మరింత స్పష్టత ఇవ్వనున్నారు. ఇంకోవైపు.. కర్నూలు జిల్లా ఆదోని మండలాన్ని విభజించి కొత్తగా 17 గ్రామాలతో పెద్ద హరివాణం మండలాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. దీనిపైనా స్థానికంగా పెద్దఎత్తున నిరసనలు, ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. పెద్ద హరివాణం మండలం వద్దని, ఆదోనిలోనే కొనసాగించాలని పలు గ్రామాల ప్రజలు, సంఘాల ప్రతినిధులు రిలే నిరాహారదీక్షలు కూడా చేపట్టారు. ఇందుకు కారణం.. కొత్తగా ఏర్పాటు చేసిన పెద్ద హరివాణం మండల కేంద్రం సుదూరంగా కర్ణాటక సరిహద్దులో ఉండడమేనని ప్రజలు చెబుతున్నారు. ప్రతిపాదిత మండలంలోని 2-3 గ్రామాలకు మినహా ఎక్కువ గ్రామాలకు పెద్ద హరివాణం కనీసం 30-40 కిమీ దూరంలో ఉంటుందని.. పైగా ఆదోని వచ్చి అక్కడి నుంచి అక్కడకు వెళ్లాల్సి ఉంటుందని అంటున్నారు. అందుచేత తమ గ్రామాలను ఆదోనిలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు.

కలెక్టర్ల నుంచి నివేదికలు..

జిల్లాల పునర్వ్యవస్థీకరణపై ప్రజల నుంచి వచ్చిన విన్నపాలపై రెవెన్యూ శాఖ కలెక్టర్ల నుంచి నివేదికలు తెప్పించుకుంటోంది. ఈ నెల 28న కీలక సమావేశం నిర్వహించనుంది. వారు వ్యతిరేకిస్తున్న నిర్ణయాలను పునఃసమీక్షించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. తిరుపతి జిల్లాలో కలిపిన కలువాయి, రాపూరు, సైదాపురం మండలాలను ప్రజల కోరిక మేరకు తిరిగి నెల్లూరు జిల్లాలోకి తీసుకురావాలని రెవెన్యూశాఖ ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఆదోని మండలం విభజనపై నంద్యాల జిల్లా కలెక్టర్ నుంచి ఇప్పటికే సమగ్ర నివేదిక కోరింది. 28న జరిగే సమావేశంలో దానిపైనా నిర్ణయం తీసుకోనుంది. తదనంతరం ముఖ్యమంత్రికి నివేదించనుంది. ఆయన సమక్షంలో చర్చించి తుది నిర్ణయాలు తీసుకున్న తర్వాత మంత్రివర్గం ముందుకు వెళ్తుంది. దాని ఆమోదంతో తుది నోటిఫికేషన్ జారీచేస్తారని రెవెన్యూ వర్గాలు తెలిపాయి.


స్వర్ణాంధ్ర 2047, పది పాయింట్ల అమలుపై సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు, అధికారులు

వేగంగా మెరుగైన సేవలు

- స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్‌లో అందించాలి
- ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రతే లక్ష్యం కావాలి
- రైతు ఆత్మహత్యల నివారణకు కార్యాచరణ చేపట్టాలి
- నైపుణ్య ఉద్యోగాల కల్పనకు ప్రాధాన్యం: సీఎం

అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్‌లో భాగంగా పౌరులకు మెరుగైన సేవలు వేగంగా అందించేందుకు ప్రతి శాఖ ఇండికేటర్లు సిద్ధం చేసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాలు, పది సూత్రాల అమలుపై సచివాలయంలో ఆయా శాఖల నోడల్ అధికారులతో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధన కోసం రూపొందించిన పది సూత్రాలను పది మిషన్లుగా నిర్దేశించుకుని పని చేయాలని సూచించారు. జీరో పావర్టీ మిషన్‌లో భాగంగా పీ4 విధానాన్ని ముందుకు తీసుకెళ్లడంతో పాటు పథకం అమలును విజన్ మానిటరింగ్ యూనిట్ల ద్వారా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ప్రతి కుటుంబమూ సాధికారిత సాధించాలని, అలాగే వ్యక్తులకు ఆర్థిక భద్రత కల్పించడమే ఈ మిషన్ ముఖ్య లక్ష్యమన్నారు. వివిధ సంక్షేమ పథకాల అమలుతో రాష్ట్రంలోని 30 లక్షల బీపీఎల్ కుటుంబాలకు ఎంత ప్రయోజనం కలిగిందో అంచనా వేయాలని ఆదేశించారు. పాపులేషన్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి విధానాన్ని రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. నైపుణ్య ఉద్యోగాల కల్పన అనేది అత్యంత ప్రాధాన్య అంశంగా తీసుకోవాలని స్పష్టం చేశారు. 20 లక్షల ఉద్యోగాల కల్పనే మొట్టమొదటి ప్రాధాన్యంగా పనిచేయాలన్నారు. నైపుణ్యం పోర్టల్ ద్వారా ఈ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో ఉంచాలని సూచించారు. పది సూత్రాలకు సంబంధించిన అంశాలు ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లాలని తెలిపారు. నీటి వనరుల సమర్థ వినియోగంతో పాటు నీటి ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు. నీటి వినియోగంలో వివాదాలు లేకుండా చూడాలని.. .రెండు తెలుగు రాష్ట్రాలు సస్యశ్యామలంగా ఉండాలన్నదే తన లక్ష్యమని చెప్పారు. రాష్ట్రంలో కరువు అనే మాట లేకుండా వరద నీటి నిర్వహణ జరగాలని పేర్కొన్నారు. టెక్నాలజీ వినియోగంతో సాగు వ్యయం తగ్గేలా చూడాలన్నారు. డిమాండ్ ఆధారిత పంటల ఉత్పత్తి, కోల్డ్ చైన్, ఫుడ్ ప్రాసెసింగ్ లాంటి అంశాలపై దృష్టిపెట్టి రైతులకు ప్రయోజనం కలిగేలా చూడాలని అన్నారు. రైతు ఆత్మహత్యల నివారణకు సంబంధించి కార్యాచరణ చేపట్టాలని సీఎం ఆదేశించారు.

లాజిస్టిక్స్ రంగాన్ని తీర్చిదిద్దాలి: రాష్ట్రంలో రవాణా వ్యయాన్ని గణనీయంగా తగ్గించేలా లాజిస్టిక్స్ రంగాన్ని తీర్చిదిద్దాలని చంద్రబాబు స్పష్టం చేశారు. రోడ్లు, రైతులు, అంతర్గత జల రవాణా, సీకార్గో, ఎయిర్ కార్గో లాంటి అంశాలతో పాటు కోల్డ్‌చైన్ లాంటి మౌలిక సదుపాయాల కల్పనకు లాజిస్టిక్స్ మాస్టర్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. విద్యుత్, ఇంధన వ్యయాలను తగ్గించే అంశంపైనా దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రంలో తయారయ్యే ఉత్పత్తుల నాణ్యతతో పాటు మేడ్ ఇన్ ఆంధ్రా బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తం చేసేలా స్పష్టమైన విధానం ఉండాలని దిశానిర్దేశం చేశారు. స్వచ్ఛాంధ్రలో భాగంగా సర్క్యులర్ ఎకానమీని ప్రోత్సహించడంతో పాటు గాలి, నీటి నాణ్యతల్లో అత్యున్నత ప్రమాణాలు పాటించాలన్నారు. కేంద్ర నిధుల్ని సమర్థంగా వినియోగించుకోవాలన్నారు. రెసిడెన్షియల్ హాస్టళ్లలో ఆర్గానిక్ కూరగాయల ఉత్పత్తిపై ఆలోచన చేస్తున్నట్లు వెల్లడించారు. పౌరసేవలు సులభంగా అందేలా శాఖలన్నీ సాంకేతికతను అందిపుచ్చుకోవాలని... ఆర్టీజీఎస్ ద్వారా సమాచారాన్ని సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో సీఎస్ విజయానంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విశాఖలో అమెజాన్ విస్తరణ..!

- ఇప్పటికే ఈ-కామర్స్ డెవలప్‌మెంట్ సెంటర్
- దానిని విస్తరించనున్నట్టు ఎస్‌టీపీఐకి వెల్లడి
- ఐటీపై దృష్టి సారించినట్టు సమాచారం
- 850 మందికి ఉద్యోగ అవకాశాలు

విశాఖపట్నం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): అమెజాన్ సంస్థ విశాఖపట్నంలో తన కార్యకలాపాలను విస్తరిస్తోంది. ఈ-కామర్స్ వ్యవహారాల కోసం రెండేళ్ల క్రితం పెందుర్తి సమీపాన గుర్రంపాలెంలో తన డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించింది. సుమారు 400 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ లైసెన్స్ కాలపరిమితి ముగిసిపోవడంతో వారం క్రితం విశాఖపట్నంలోని సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా(ఎస్‌టీపీఐ) వద్ద లైసెన్స్ రీ రిజిస్టర్ చేసింది. ఇక్కడి డెవలప్‌మెంట్ సెంటర్‌ను విస్తరించనున్నామని పేర్కొంది. ఐటీ, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌పై దృష్టి సారించనున్నట్టు తెలిసింది. హై స్కిల్డ్ ఉద్యోగులను తీసుకుంటారని ప్రచారం జరుగుతోంది. రాబోయే మూడేళ్లలో రూ.9,740 కోట్ల ఎగుమతులు చేయాలనే లక్ష్యంతో 850 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని ఐటీ వర్గాలు తెలిపాయి.

భారీగా ప్రణాళికలు

అమెజాన్ సంస్థ ఇండియాలో రాబోయే ఐదేళ్లలో రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు పెడతామని ప్రకటించింది. అంటే ఏడాదికి రూ.60 వేల కోట్ల చొప్పున వెచ్చిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా భారీగా పెట్టుబడులు పెట్టనుంది. ప్రస్తుతం విశాఖలో 400 మంది అమెజాన్ కోసం వర్క్ ఫ్రమ్ హోమ్ పనిచేస్తున్నారు. ఇక్కడ డెవలప్‌మెంట్ సెంటర్‌ను భారీగా విస్తరించనున్నారు.

- ఓ.నరేశ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్, రుషికొండ ఐటీ పార్క్ అసోసియేషన్


వాజపేయి విగ్రహ ఆవిష్కరణ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా , బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, మంత్రి సత్యకుమార్

నేటితో ముగియనున్న సుపరిపాలన యాత్ర

- అమరావతిలో 2.53 ఎకరాల్లో అటల్ స్మృతివనం: మాధవ్

అమరావతి, తుళ్లూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో చేపట్టిన సుపరిపాలన యాత్రకు విశేష స్పందన వచ్చిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నాగోతు రమేశ్, వల్లూరు జయప్రకాశ్, షేక్ బాజీ, లక్ష్మీ ప్రసన్న తదితరులతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. 'వాజపేయి అనేక రంగాల్లో కొత్త ఒరవడి తీసుకొచ్చిన మహోన్నత నాయకుడు. భారత దేశాన్ని ప్రపంచంలో అగ్రగామిగా చూడాలన్నదే ఆయన ఆశయం. ఆ లక్ష్యం ప్రధాని మోదీ ద్వారా 2047కు నెరవేరబోతోంది. ఈ నెల 11న ధర్మవరం నుంచి ప్రారంభమైన సుపరిపాలన యాత్ర 25న వాజపేయి జయంతి సందర్భంగా ముగుస్తుంది. అమరావతిలో అటల్ స్మృతివనం ఏర్పాటు చేసి అందులో 13 అడుగుల వాజపేయి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నాం' అని చెప్పారు.

నేడు వాజపేయి విగ్రహ ఆవిష్కరణ

రాజధాని అమరావతిలో వాజపేయి విగ్రహ ఆవిష్కరణ గురువారం జరగనుంది. ఉదయం 11 గంటలకు వెంకటపాలెం సమీపంలో అటల్ కాంస్య విగ్రహాన్ని సీఎం చంద్రబాబు ఆవిష్కరిస్తారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు కార్యక్రమంలో పాల్గొంటారు. వాజపేయి శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని రాజధాని అమరావతిలో ఆయన విగ్రహం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. అందుకు ఎన్-4, ఈ-4 రోడ్డు జంక్షన్‌లో వాజపేయి స్మృతి వనానికి 2.53 ఎకరాలు కేటాయించింది.

క్రైస్తవుల సంక్షేమమే కూటమి లక్ష్యం: రామాంజనేయులు

అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): 'క్రైస్తవుల సంక్షేమం, అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. అందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 8,427 మంది పాస్టర్లకు రూ.51 కోట్లు విడుదల చేసింది' అని ఎమ్మెల్యే రామాంజనేయులు తెలిపారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు 2019లో గుంటూరులో రూ.16 కోట్లతో క్రిస్టియన్ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారని, దాన్ని జగన్ అధికారంలోకి రాగానే అడ్డుకున్నారని విమర్శించారు. కూటమి అధికారంలోకి రాగానే ఆ భవనానికి రూ.10 కోట్లు మంజూరు చేసిందన్నారు. పాస్టర్లకు గౌరవ వేతనంగా రూ.51 కోట్లు విడుదల చేసిందని తెలిపారు.

రాష్ట్రంలో 210 పీడబ్ల్యూఎం యూనిట్లు

అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 210 ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్(పీడబ్ల్యూఎం) యూనిట్లు ఏర్పాటుకానున్నాయి. వాటిని గుర్తించిన 202 ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. స్వచ్ఛ భారత్ గ్రామీణ్ ఫేజ్-2 కింద రూ.33.60 కోట్లతో వీటిని ఏర్పాటు చేస్తూ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ టెండర్లు పిలిచి పనులు నిర్వహించాలని, ఆర్‌డబ్ల్యూఎస్ విభాగం బిల్లులు అప్‌లోడ్ చేయాలని ఆదేశాలిచ్చారు.

గోవింద మాల ధరించడానికి చెవిరెడ్డికి అనుమతి

విజయవాడ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మద్యం స్కాం కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి గోవిందమాల ధరించేందుకు కోర్టు అనుమతించింది. బుధవారం ఈ మేరకు ఉత్తర్వులను వెలువరించింది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా గోవింద మాల ధరించేందుకు అనుమతి ఇవ్వాలని చెవిరెడ్డి పిటిషన్ వేయగా.. గురువారం నుంచి 31 వరకు గోవింద మాల ధరించి దీక్ష చేసుకునేందుకు న్యాయస్థానం అనుమతించింది.

కాస్మెటిక్స్ కాంట్రాక్టులో కిరికిరి

- అర్హత లేని సంస్థకు 17 కోట్ల టెండరు
- వైసీపీ కీలక నేత మిత్రుడి సంస్థకు లబ్ధి!
- సీఎంకు ఫిర్యాదులు..పేషీకి ఆదేశాలు!

అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్ల విద్యార్థులకు కాస్మెటిక్ సరఫరా చేసేందుకు పిలిచిన టెండర్ల ప్రక్రియ అభాసుపాలైంది. టెండరు వేసే సంస్థకు రూ.9 కోట్ల విలువైన కాస్మెటిక్ వస్తువులు సరఫరా చేసిన అనుభవం ఉండాలని నిబంధనల్లో పేర్కొని, కేవలం రూ.2.2 కోట్ల విలువైన సరఫరా అనుభవం మాత్రమే కలిగిన సంస్థను ఎంపిక చేయడం చర్చనీయాంశంగా మారింది. అధికారులు నిబంధనలను అడ్డగోలుగా పక్కనపెట్టేసి.. అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంకు చెందిన విక్టరీ బజార్ సంస్థకు రూ. 17.95 కోట్ల విలువైన టెండరు కట్టబెట్టారు. ఇది వైసీపీ కీలక నేత మిత్రుడి సంస్థ కావడం గమనార్హం. ఈయనకు టెండర్ కట్టబెట్టేందుకు సాంఘిక సంక్షేమశాఖలోని కొందరు అధికారులు శాయశక్తులా సహకరించారనే ఆరోపణలు వినిపించాయి. దీనికోసం నాణ్యత విషయంలోనూ రాజీ పడ్డారని విమర్శలు వస్తున్నాయి. ఆ వివరాల్లోకి వెళితే.. గతంలో సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్లలో విద్యార్థులకు కాస్మెటిక్ చార్జీలు ప్రతినెలా ఆయా తరగతుల వారీగా నగదు రూపంలో చెల్లించేవారు. కూటమి సర్కారు వచ్చిన తర్వాత ఆ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి చొరవతో కాస్మెటిక్ చార్జీలను పెంచారు. మూడో తరగతి నుంచి ఆరో తరగతి విద్యార్థుల వరకు బాలురకు నెలకు రూ.125, బాలికలకు రూ.130; ఏడో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు బాలురకు రూ.150, బాలికలకు రూ.200, ఇంటర్ ఆ పైబడిన విద్యార్థులకు బాలురకు రూ.200, బాలికలకు రూ.250 పెంచారు. గతంలో నగదు ఇవ్వడంతో విద్యార్థులు కాస్మెటిక్స్‌కు కాకుండా ఇతర అవసరాలకు వినియోగించుకున్నట్టు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. దీంతో విద్యార్థులకు నేరుగా కాస్మెటిక్ కిట్స్ అందించాలని నిర్ణయించింది. ఈ కిట్‌లో కొబ్బరి నూనె, టూత్‌పేస్ట్, టూత్‌బ్రష్, టాల్కమ్ పౌడర్, షాంపూ, వంటి, డిటర్జెంట్ సబ్బులు, శానిటరీ నాప్‌కిన్స్, వాషింగ్ పౌడర్, స్టిక్కర్లు, దువ్వెన ఉంటాయి. కాస్మెటిక్స్‌ను సరఫరా చేసే సంస్థ కోసం సెప్టెంబరు 29న టెండర్లు నోటిఫికేషన్ జారీ చేశారు. అక్టోబరు 13న ప్రీబిడ్ మీటింగ్ నిర్వహించారు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు బిడ్ తెరిచారు. మొత్తం రూ.17.95 కోట్ల బిడ్‌ను అడ్డగోలుగా వైసీపీ కీలక నేత మిత్రుడికి చెందిన సంస్థకు కట్టబెట్టారని ఆరోపణలు వస్తున్నాయి. గత నెల 1 నుంచి వచ్చే ఏడాది అక్టోబరు 31 దాకా ఈ సంస్థకు కాంట్రాక్టు ఇచ్చారు.

డాక్యుమెంట్‌లో 'కిట్' మాయం

టెండర్ల నోటిఫికేషన్‌లో ఆర్భాటంగా బేబీ కేర్ కిట్, ఫేసియల్ కిట్ అని పేర్కొన్నారు. కానీ రావులపాలెం విక్టరీ బజార్‌కు టెండరు కట్టబెట్టేందుకు డాక్యుమెంట్‌లో కిట్ అనే పదం తొలగించారు. జెమ్ (గవర్నమెంట్ ఈ-మార్కెట్) ప్రకటనకు విరుద్ధంగా టెండర్లు పిలిచారు. బిడ్డర్లు మూడేళ్లలో కనీసం రూ.9 కోట్ల విలువైన కాస్మెటిక్స్ ప్రభుత్వానికి లేక ప్రభుత్వ సంస్థలకు, ప్రైవేట్ సంస్థలకు, బహుళజాతి కంపెనీలకు సరఫరా చేసిన అనుభవం కలిగి ఉండాలి. దానికి సంబంధించి బిడ్డర్ పర్చేజ్ ఆర్డర్, పేమెంట్ ఓచర్స్, కంప్లీషన్ సర్టిఫికెట్లు, సప్లయ్ కాపీలు జోడించాలని నిబంధనల్లో ఉంది. రిటైల్ సరఫరాను పరిగణనలోకి తీసుకోరు. అయితే విక్టరీ బజార్ సంస్థ రూ.2.2 కోట్ల విలువైన కాస్మెటిక్స్‌ను రిటైల్‌గా సరఫరా చేసినట్టు డాక్యుమెంట్లు జతచేసింది. అది కూడా రావులపాలెంలోని కొన్ని కిరాణా షాపులకు సరఫరా చేసినట్లు ఆడిట్ నివేదికలు సమర్పించింది. ఆ డాక్యుమెంట్లను, ఆడిట్ నివేదికలను గుడ్డిగా పరిగణనలోకి తీసుకుని టెండర్ ఖరారు చేయడం గమనార్హం. ఇతర సంస్థలు కాస్త నాణ్యమైన చిక్ సాచెట్, షాంపూలు తెస్తే అంగీకరించలేదు గానీ, విక్టరీ బజార్ తెచ్చిన నాసిరకం చిక్ శాంపిల్స్‌ను ఆమోదించారు. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు కొంత మంది టీడీపీ నేతలు, పలు సరఫరా సంస్థలు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. దీనిపై పరిశీలించాలని పేషీ అధికారులను సీఎం ఆదేశించినట్లు సమాచారం.

పదవుల బొనాంజా!

- టీడీపీలో 1,050 మందికి పోస్టులు
- ఒక్కో పార్లమెంటరీ కమిటీలో 40 మంది
- బీసీలకు 37%, ఎస్సీలకు 20%
- ఓసీ-32%, ఎస్టీ-4%, మైనారిటీలకు 7%
- మహిళలకు 28 శాతం కేటాయింపు

అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో పదవుల జాతరకు తెర లేచింది. పార్లమెంటరీ నియోజకవర్గ కమిటీలను బుధవారం ప్రకటించారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాకుండా 40 మందితో కూడిన జంబో కమిటీలను ప్రకటించారు. ప్రతి కమిటీలో 9 మంది ఉపాధ్యక్షులు, 9 మంది కార్యనిర్వాహక కార్యదర్శులు, 9 మంది అధికార ప్రతినిధులు, 9 మంది కార్యదర్శులు.. ట్రెజరర్, కార్యాలయ కార్యదర్శి, మీడియా కో-ఆర్డినేటర్, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్లు ఉంటారు. ఈ మేరకు జిల్లాల్లోని పార్టీ యంత్రాంగానికి అధిష్ఠానం నుంచి సమాచారం అందింది. రెండ్రోజుల క్రితం పార్లమెంటరీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ప్రకటించారు. వీరితో కలిపి ఒక్కో కమిటీలో 42 మందిని నియమించారు. మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా 1,050 మందికి పదవులు దక్కాయి. పార్టీ పదవుల్లో మహిళలు, బీసీ, ఎస్సీలకు ప్రాధాన్యమిచ్చారు. బీసీలకు మొత్తం పదవుల్లో 37 శాతం అంటే 389 పదవులు దక్కగా.. ఎస్సీలకు 20 శాతం (207 పదవులు) దక్కాయి. బీసీ, ఎస్సీలకు కలిపి 57 శాతం పదవులు లభించాయి. ఎస్టీలకు 4 శాతం, మైనారిటీలకు 7 శాతం, ఓసీలకు 32 శాతం పదవులు కేటాయించారు. మహిళలకూ పెద్దపీట వేశారు. మొత్తం పదవుల్లో 28 శాతం వారికే ఇచ్చారు.

అసెంబ్లీ ఇన్‌చార్జులపై కసరత్తు

పార్లమెంటరీ కమిటీల ఏర్పాటు ప్రక్రియను విజయవంతంగా ముగించుకున్న టీడీపీ అధిష్ఠానం త్వరలో అసెంబ్లీ ఇన్‌చార్జుల నియామక ప్రక్రియపై దృష్టి పెట్టనుంది. రాష్ట్రంలో 175 అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను టీడీపీ ఎమ్మెల్యేలు 135 నియోజకవర్గాల్లో ఉన్నారు. మిగిలిన 40 నియోజకవర్గాల్లో వైసీపీ గెలుపొందిన 11 నియోజకవర్గాల్లో.. తంబళ్లపల్లె తప్ప మిగిలిన 10 చోట్ల టీడీపీ తరపున పోటీ చేసిన అభ్యర్థులు లేదా గతంలో ఇన్‌చార్జులుగా ఉన్నవారినే కొనసాగిస్తున్నారు. కూటమి పార్టీలైన జనసేన, బీజేపీ గెలుపొందిన 29 నియోజకవర్గాల్లో.. ఎచ్చెర్ల, పాలకొండ, విశాఖ ఉత్తరం, యలమంచిలి, కైకలూరు, అవనిగడ్డ, పి.గన్నవరం, విజయవాడ పశ్చిమ, తిరుపతి మొదలైనవాటికే పార్టీ ఇన్‌చార్జులను నియమించాల్సి ఉంది. ఈ నెలాఖరులోగా వీరినీ నియమించనున్నట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి.


ఫ్లెక్సీలకు రక్తాభిషేకం చేసిన వైసీపీ కార్యకర్తలను కోర్టుకు తరలిస్తున్న పోలీసులు

ధర్మవరంలోనూ రక్తాభిషేకం!

- జగన్ పుట్టినరోజున కార్యకర్తల హల్‌చల్
- సోషల్ మీడియాలో వీడియోలు వైరల్.. ఆరుగురి అరెస్టు

ధర్మవరం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు జగన్ పుట్టినరోజు సందర్భంగా శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలోనూ ఆ పార్టీ కార్యకర్తలు వేట కొడవళ్లతో క్రూరంగా పొట్టేళ్లను నరికి ఫ్లెక్సీలకు రక్తాభిషేకం చేశారు. ఈ విషయాన్ని పోలీసులు ఆలస్యంగా గుర్తించారు. ఈ నెల 21న వైసీపీ కార్యకర్తలు పొట్టేళ్ల తలలు నరికి.. జగన్, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఫ్లెక్సీలకు రక్తాభిషేకం చేశారు. ఆ వీడియోలు బుధవారం సోషల్ మీడియాలో ప్రత్యక్షమయ్యాయి. దీనిపై ఫిర్యాదు అందడంతో పోలీసులు స్పందించి తొమ్మిది మంది కార్యకర్తలపై కేసు నమోదు చేశారు. వీరిలో ఆరుగురు.. తిమ్మారెడ్డి మల్లికార్జున రెడ్డి, రెడ్డివారి రాజశేఖర్‌రెడ్డి, వినయ్ గౌడ్, సాకే కాశప్ప, దాసరి మల్లికార్జున, దేవరపల్లి ఓబిరెడ్డిలను అరెస్టు చేశామని టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు.

అస్వస్థతతో ముందస్తు క్రిస్మస్ వేడుకలకు జగన్ దూరం

పులివెందుల, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ ముందస్తు క్రిస్మస్ వేడుకలకు దూరంగా ఉన్నారు. బుధవారం ఇడుపులపాయలోని ప్రార్థనా మందిరంలో కుటుంబసభ్యులతో కలిసి ముందస్తు క్రిస్మస్ వేడుకలకు హాజరుకావాల్సి ఉంది. కానీ మంగళవారం రాత్రి నుంచి అస్వస్థతకు గురైనట్లు వైసీపీ వర్గాలు తెలిపాయి. జ్వరం, విరేచనాలతో బాధపడుతున్నట్లు సమాచారం. ఈ కారణంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు జగన్ ఇంట్లో నుంచి బయటకు రాలేదు. దీనితో కడప ఎంపీ అవినాశ్‌రెడ్డిని ప్రజలు కలిశారు. సాయంత్రం 5 గంటలకు క్యాంపు కార్యాలయం వద్ద ఉన్న నాయకులు, కార్యకర్తలు, ప్రజలను సీఐ సీతారామిరెడ్డి బయటకు పంపించి గేటు వేశారు.

జగన్ పాలనలో తిరుమలలో మహాపాపాలు

- మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ధ్వజం

అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ పాలనలో తిరుమలలో అనేక అక్రమాలు, మహా పాపాలు చోటు చేసుకున్నాయని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ హయాంలో తిరుమలలో వెంకటేశ్వర స్వామి పవిత్రతకు భంగం కలిగేలా అనేక వ్యవహారాలు జరిగాయని, అవన్నీ ఇప్పుడు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయని తెలిపారు. భక్తులు అత్యంత పవిత్రంగా భావించే లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడిన ఉదంతం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిందని అన్నారు. అప్పట్లో టీటీడీ ఛైర్మన్‌గా వ్యవహరించిన భూమన కరుణాకర్ రెడ్డి పాత్రకు సంబంధించిన అనేక అంశాలు వెలుగులోకి వస్తున్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తిరుమలను ప్రక్షాళన చేస్తోందని తెలిపారు. రాష్ట్ర చరిత్రలో తొలిసారి ఏకాదశి రోజున వైకుంఠ దర్శనం ద్వారా 90%పైగా సామాన్యులకు దర్శనం కల్పించే విధంగా నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

దేవుడి ఆస్తులనూ జగన్ వదల్లేదు: సప్తగిరి ప్రసాద్

వైసీపీ హయాంలో దేవుడి ఆస్తులనూ జగన్ వదల్లేదని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ విమర్శించారు. తిరుమల తిరుపతి దేవస్థానం, దాని అనుబంధ ఆలయాల్లో 2019-24 మధ్య జరిగిన పరిణామాలపై సమగ్ర విచారణ జరగాలని ప్రసాద్ డిమాండ్ చేశారు. అత్యంత పురాతనమైన గోవిందరాజ స్వామి ఆలయం బంగారు తాపడం పనులు పేరుతో బంగారాన్ని దోచేయడం దారుణమని, ఇది హిందూ భక్తుల మనోభావాలతో ఆడుకోవడమేనని అన్నారు. ఈ మొత్తం వ్యవహారాలపై సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు.

భగవద్గీత మతగ్రంథం కాదు!

అదో నైతిక శాస్త్రం.. భారతీయ నాగరికతలో ఒక భాగం

యోగాను మతకోణంలో చూడటం దారుణం: మద్రాస్ హైకోర్టు

చెన్నై, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): 'భగవద్గీత కేవలం మతగ్రంథం కాదు. అది నైతిక శాస్త్రం, భారతీయ నాగరికతలో భాగం' అని మద్రాస్ హైకోర్టు స్పష్టం చేసింది. భగవద్గీతకు వర్తించేది వేదాంతానికి కూడా వర్తిస్తుందని తెలిపింది. ఇది మన పూర్వీకులు అభివృద్ధి చేసిన స్వచ్ఛమైన తత్వాన్ని సూచిస్తుందని పేర్కొంది. యోగా విషయాన్ని మతం అనే కోణం నుంచి చూడడం దారుణమని, ఇది సార్వత్రికమైనదని తేల్చిచెప్పింది. విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్‌సీఆర్ఏ) కింద కేంద్ర హోంశాఖ జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ 'అర్ష విద్యా పరంపర ట్రస్టు' దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణలో మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జీఆర్ స్వామినాథన్ నేతృత్వంలోని మదురై ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యానించింది. ముందస్తు అనుమతి లేకుండా విదేశీ విరాళాల నిధులు స్వీకరించడం, సంస్థ స్వభావం మతపరమైనదిగా కనిపించడం వంటి కారణాలతో 2021లో ట్రస్టు రిజిస్ట్రేషన్ దరఖాస్తును హోంశాఖ తిరస్కరించింది. దీనిని ఆ సంస్థ హైకోర్టులో సవాల్ చేసింది. మంగళవారం విచారణ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ.. పిటిషనర్ భగవద్గీతలో పేర్కొన్న సందేశాన్ని బోధించడంలో కూడా నిమగ్నమై ఉన్నందున పిటిషనర్ ఒక మత సంస్థ అని అధికారులు నిర్ధారించడం పట్ల విస్మయం వ్యక్తం చేసింది. పిటిషనర్ 'ఒక మత సంస్థగా కనిపిస్తున్నారు' అని పేర్కొనడం ద్వారా అధికారులు నిబంధనలో నిర్దేశించిన ప్రమాణాన్ని పాటించలేదని వ్యాఖ్యానించింది. ట్రస్టు 2021లో రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ దాని పరిశీలన ప్రక్రియ 2024 అక్టోబరులో మాత్రమే ప్రారంభమవడాన్ని గుర్తు చేస్తూ.. అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, ఇది సుపరిపాలనలో ఒక ప్రాథమిక సూత్రమని హితవు పలికింది.

ఇదీ వివాదం..

అర్ష విద్యా పరంపర ట్రస్టును స్వామి దయానంద సరస్వతి శిష్యులు 2017లో తమిళనాడులోని హోసూరులో స్థాపించారు. ఇది ఒక పబ్లిక్ ధార్మిక ట్రస్టు. ఇది వేదాంతం, సంస్కృతం, హఠయోగం, యోగా బోధించడంలో, ప్రాచీన గ్రంథాలను పరిరక్షించడంలో నిమగ్నమై ఉంది. ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 12ఏ కింద దీన్ని నమోదు చేశారు. 2021లో విదేశీ విరాళాలు స్వీకరించడానికి ఈ ట్రస్టు ఎఫ్‌సీఆర్ఏలోని సెక్షన్ 11 కింద రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకుంది. ఆ దరఖాస్తుకు అనుమతి రాక ముందే 2024లో అమెరికాకు చెందిన ప్రవాస భారతీయుడి నుంచి రూ.9 లక్షల విరాళం స్వీకరించింది. జరిగిన తప్పును సరిదిద్దుకుని 2025లో రూ.3.7 లక్షల జరిమానా కూడా చెల్లించింది. ఈ నేపథ్యంలో ముందస్తు అనుమతి లేకుండా విదేశీ విరాళాలు స్వీకరించారని, మతపరమైనదిగా కనిపిస్తోందన్న కారణంగా కేంద్ర హోంశాఖ ఈ ట్రస్టు దరఖాస్తును తిరస్కరించింది.



క్రిస్మస్ సందర్భంగా విద్యుద్దీపాల వెలుగుల్లో గుణదల మేరీమాత ఆలయం

గవర్నర్, సీఎం, పవన్ క్రిస్మస్ శుభాకాంక్షలు

అమరావతి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): క్రైస్తవులకు గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఇది ఏసుక్రీస్తును సంతోషంగా స్మరించుకునే, ప్రజలందరిలో క్షమాగుణం, ఐక్యత, ప్రేమ, దయ, కరుణ, దాతృత్వాన్ని వ్యాప్తి చేసే సమయమని గవర్నర్ పేర్కొన్నారు. శాంతి దూత ఏసుక్రీస్తు జన్మదినం సందర్భంగా జరుపుకొనే క్రిస్మస్ పర్వదినం మనందరి జీవితాల్లో కొత్త వెలుగు నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని చంద్రబాబు పేర్కొన్నారు. పాస్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. క్రైస్తవ ధర్మాన్ని విశ్వసించేవారందరికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. దయా గుణాన్ని ఇతరులకు పంచడమే ఏసుక్రీస్తు సందేశమని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు.

8,427 మంది పాస్టర్లకు 50.04 కోట్లు జమ

పాస్టర్లకు కూటమి ప్రభుత్వం క్రిస్మస్ కానుక అందించింది. వారికి నెలవారీ అందించే గౌరవ వేతనం జమ చేసింది. సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం 8,427 మంది పాస్టర్లకు గౌరవ వేతనాన్ని బుధవారం వారి ఖాతాల్లో జమ చేశారు. 2024 డిసెంబరు నుంచి ఈ ఏడాది నవంబరు వరకు మొత్తం రూ.50.04 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం పాస్టర్ల ఖాతాల్లో వేసింది. దీంతో ఒక్కో పాస్టర్‌కు నెలకు రూ.5 వేల చొప్పున ఒక్కొక్కరికి 12 నెలల మొత్తం రూ.60 వేలు అందించింది. క్రిస్మస్‌కి ఒక రోజు ముందే పాస్టర్ల అకౌంట్లకు గౌరవ వేతనం చెల్లింపు ప్రక్రియ పూర్తయినట్లు మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు.

ఇచ్చిన మాట కోసం..!

- ఇప్పటం గ్రామంలో పవన్ కల్యాణ్ పర్యటన
- గతంలో వైసీపీ దాష్టీకాలను ఎదుర్కొన్న నాగేశ్వరమ్మ ఇంటికి ఉపముఖ్యమంత్రి
- సంక్రాంతి కానుకగా చీర బహూకరణ
- ఖర్చుల నిమిత్తం మరో రూ.50 వేలు
- ప్రతి నెలా తన వేతనం నుంచి 5 వేలు
- ఆమె మనవడి చదువుకు రూ.లక్ష సాయం
- క్యాన్సర్ బాధితుడైన కొడుక్కి సీఎం సహాయ నిధి నుంచి 3 లక్షలు



ఇప్పటం గ్రామంలో ఇండ్ల నాగేశ్వరమ్మతో డిప్యూటీ సీఎం పవన్ ఆత్మీయ ఆలింగనం

తాడేపల్లి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో దాష్టీకాలకు ఎదురొడ్డి నిలిచిన ఇండ్ల నాగేశ్వరమ్మ ఇంటికి డిప్యూటీ సీఎం, జనసేనాని పవన్ కల్యాణ్ వెళ్లారు. ఆమె యోగక్షేమాలు తెలుసుకుని పరామర్శించారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఇప్పటం గ్రామానికి చెందిన నాగేశ్వరమ్మ తదితరులు.. జగన్ ప్రభుత్వ హయాంలో జనసేన ఆవిర్భావ సభకు భూములు ఇచ్చారు. ఆ అక్కసుతో రోడ్డు విస్తరణ పేరిట గ్రామంలో వారి ఇళ్లను అధికారులు కూల్చివేశారు. గత పాలకుల దాష్టీకాలకు ఎదురు నిలిచిన నాగేశ్వరమ్మ.. 'నా బిడ్డ పవన్‌కల్యాణ్ వస్తారు... మీ బెదిరింపులకు భయపడం' అంటూ రోడ్డెక్కారు. ఎన్నికల సమయంలో పవన్ కల్యాణ్ ఆ గ్రామానికి వెళ్లి నాగేశ్వరమ్మను కలిసి.. ఇంటి కొడుకుగా అండగా ఉంటానని ప్రకటించారు. గెలిచాక తన ఇంటికి రావాలని నాగేశ్వరమ్మ కోరగా.. ఆమెకు ఇచ్చిన మాట ప్రకారం బుధవారం ఆ ఇంటికి ఆయన వెళ్లారు. ఆమెను అక్కున చేర్చుకుని అండగా ఉంటానని.. అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు. 'అమ్మా నీ పెద్ద కొడుకును వచ్చా.. బాగున్నావా... ఆరోగ్యం ఎలా ఉంది... నాలుగు రోజులుగా నిన్ను చూసేందుకు వద్దామంటే అధికారిక కార్యక్రమాల వల్ల వీలుపడలేదు.. నీకిచ్చిన మాట కోసం ఈ రోజు పనులన్నీ వాయిదా వేసుకుని నీకోసం వచ్చా..' అని ఆప్యాయంగా మాట్లాడారు. నాగేశ్వరమ్మ ఉద్వేగానికి లోనయ్యారు. అనంతరం పవన్ ఆమెకు సంక్రాంతి కానుకగా చీర బహూకరించారు. ఖర్చుల నిమిత్తం మరో రూ.50 వేలు అందజేశారు. ఈ రోజుకీ కుటుంబ పోషణ నిమిత్తం పొలం పనులకు వెళ్తున్నానని నాగేశ్వరమ్మ చెప్పడంతో ప్రతి నెలా తన జీతం నుంచి రూ.5 వేలు ఆమె పోషణ నిమిత్తం పంపుతానని ఆయన హామీ ఇచ్చారు. దివ్యాంగుడైన నాగేశ్వరమ్మ మనవడు మనోజ్‌సాయి చదువు నిమిత్తం రూ.లక్ష సాయం అందజేశారు. ఆమె కుమారుడు కొండయ్య క్యాన్సర్‌తో బాధపడుతున్న విషయం తెలుసుకుని చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.3 లక్షలు అందజేశారు. అనంతరం నీ ఆరోగ్యం జాగ్రత్తమ్మా అని చెప్పి పవన్ వెనుదిరిగారు.

పవన్‌కు ఘనస్వాగతం..

పవన్ రాకను పురస్కరించుకుని ఇప్పటం గ్రామం ప్రజలు, జనసైనికులతో నిండిపోయింది. కొలనుకొండ, ఇప్పటం గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా జనం ఆయనకు ఘన స్వాగతం పలికారు. పలువురు యువత సీఎం పవన్ అంటూ నినాదాలు చేశారు. ఆయన దాదాపు 25 నిమిషాలు గ్రామంలో ఉన్నారు. ఈ పర్యటనలో శాసనమండలి విప్ పిడుగు హరిప్రసాద్, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కల్యాణ శివశ్రీనివాస్, పార్టీ నేతలు గంజి చిరంజీవి, జొన్నా రాజేశ్, సామల నాగేశ్వరరావు, తిరుమలశెట్టి కొండలరావు, అంబటి తిరుపతిరావు, సాధు చంద్రశేఖర్, టీడీపీ నేతలు దాసరి కృష్ణ, కొల్లి శేషు, శంకరశెట్టి పిచ్చయ్య, సబ్ కలెక్టర్ సంజనా సిన్హా, జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

చలి చంపేస్తోంది!

- జి.మాడుగులలో 4 డిగ్రీలు నమోదు

విశాఖపట్నం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): చాలా సంవత్సరాల తరువాత ఈ ఏడాది దేశవ్యాప్తంగా ఎక్కువ రోజులు చలి కొనసాగుతోంది. డిసెంబరు ప్రారంభంలోనే ఉత్తరాదిలో మొదలైన చలి తీవ్రత తమిళనాడు వరకూ విస్తరించింది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు రోజుల తరబడి సింగిల్ డిజిట్‌లోనే నమోదవుతున్నాయి. ఉత్తరాది నుంచి దక్షిణ భారతం వరకూ ఈ నెల తొలివారం నుంచి నెలకొన్న అధికపీడనం (యాంటీ సైక్లోన్) సైబీరియా నుంచి వస్తున్న అతి శీతల గాలులు దక్షిణాది వరకు విస్తరించేందుకు దోహదం చేస్తోందని వాతావరణ నిపుణుడొకరు పేర్కొన్నారు. ఇంకా ఉత్తరాది మీదుగా పయనించే వెస్ట్రన్ డిస్ట్రబెన్స్ పెద్దగా ప్రభావం చూపకపోవడంతో జమ్ము కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్‌లలో ఒక మోస్తరుగా వర్షాలు కురుస్తున్నాయి తప్ప పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్ వరకూ విస్తరించలేదు. ఈ ప్రభావంతో ఉత్తర, వాయువ్య భారతం నుంచి శీతల గాలులు తమిళనాడు వరకూ వీస్తుండంతో పలుచోట్ల రికార్డుస్థాయిలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈశాన్య రుతుపవనాల ప్రభావం డిసెంబరు తొలి వారం తరువాత కనిపించడం లేదు. అంటే రెండో వారం నుంచి వర్షాలు లేవు. బహుశా వాతావరణంలో మార్పుల ప్రభావంతోనే ఈ ఏడాది చలి తీవ్రత పెరగడానికి కారణంగా విశ్లేషించారు. బుధవారం కోస్తా, రాయలసీమలో చలితీవ్రత కొనసాగింది. అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో 4డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఉత్తర, వాయువ్య, మధ్య, తూర్పుభారతంలో చలి తీవ్రత పెరిగేందుకు అనువుగా వాతావరణం ఉందని, రానున్న 2, 3 రోజుల్లో ఉష్ణోగ్రతలు తగ్గుతాయని వాతావరణ అధికారి ఒకరు తెలిపారు. ఈ నెల 27న ఉత్తరాది మీదుగా పయనించనున్న వెస్ట్రన్ డిస్ట్రబెన్స్ బలంగా ఉంటే చలిగాలులు కొంతవరకూ తగ్గుతాయని లేకపోతే 31న చలి తీవ్రత కొనసాగుతుందని పేర్కొన్నారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**, on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal, Guntur, Editor: **N.Rahul Kumar** Phone No: (0863)2512379,2512376, RNI no.APTEL/2003/9781. **Managing Director : Vemuri Radha Krishna**. Founder: K.L.N.Prasad.